
Deccan Land

December 2024

Deccan

December



డిసెంబర్ - 2024

₹ 30


# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

DECCAN LAND, HYDERABAD

148

DECEMBER - 2024




- సురపురం రాజా వెంకటప్పనాయక్
- జన్యు నియంత్రణ - మైక్రోఆర్ఎన్ఏ
- సుస్థిర ప్రణాళికతో విశ్వహోదా
- డార్విన్-పర్యావరణ విధ్వంసగాథ

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



**10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300**

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

**-మణికొండ వేదకుమార్**

చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



**10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300**




**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు






## UNESCO SITE

**Agra Fort :** Uttar Pradesh, India
Date of Inscription: 1983 Category : Cultural (Monument)

## ఇండో-ముస్లిం శైలిలో ఆగ్రా ఫోర్ట్

ఆగ్రాకు చెందిన రెడ్ ఫోర్ట్ పదహారో శతాబ్దానికి చెందింది. మొఘల్ రాజు అక్బర్ దీన్ని యమునా నదీతీరంలో నిర్మించాడు. ఇప్పుడు దీన్ని షాజహాన్ గార్డెన్స్ వాయువ్య భాగంలో చూడవచ్చు. దీనికి దగ్గర్లోనే తాజ్ మహల్ ఉంది. ఈ రెడ్ ఫోర్ట్ రెడ్ శాండ్ స్టోన్‌తో నిర్మించబడింది. 2.5 కి.మీ. పొడవునా కోట గోడలున్నాయి. ఆగ్రా ఒకప్పుడు మొఘల్ పాలకుల రాజధానిగా ఉండింది. ఈ కోటలో జహంగీర్ ప్యాలెస్, ఖాస్ మహల్ (షాజహాన్ నిర్మించింది), దివాన్ -ఇ-ఖాస్ వంటి సభా మందిరాలు, రెండు అందమైన మసీదులను చూడవచ్చు. ఈ కట్టడాలన్నీ కూడా పర్షియా ప్రభావంతో కూడిన ఇండో-ముస్లిం శైలిలో ఉన్నాయి.

ఈ కల్చరల్ మాన్యుమెంటు UNESCO చే 1983లో గుర్తించబడింది.

*ప్రత్యేక వ్యాసం : 29 పేజీలో*

TELANGANA RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## ఆదివాసుల సంస్కృతి

దక్కన్‌ల్యాండ్ నవంబర్ మాస పత్రికలో ద్యావనపల్లి సత్యనారాయణ గారి 'గోండుల దివాళి నృత్యోత్సవం' వ్యాసంలో ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాలను చక్కగా వివరించారు. ముఖ్యంగా దండారి గురించి ఎన్నో విషయాలు తెలియజేశారు. ఒక ఊరి నుండి ఒక ఊరికి అతిథులుగా వెళ్లడం, ఇందులో జరిగే ఏడూ రకాల నృత్యాలు గురించి, ఐదో రోజు చేసుకునే కొలబోది ఆచారం గురించి, దందారిగా వెళ్లిన ప్రజలు అందరు కలిసి ఐక్యతగా నృత్యాలు చేయడం ఎత్మసూర్ దేవతకు కోడిని కోయడం గురించి, తెగ పెద్ద ఇంటిదగ్గర బద్దిలో కుడికాలు పెట్టి ప్రమాణం చేసే ఖుద్ద తిరువల్ నుండి మొదలు పెట్టి పోరిక్‌ల వరకు వీరి సంస్కృతి గొప్పతనం గురించి చాలా చక్కగా వివరించారు. ఇలాంటి సంస్కృతిని గుస్సాడీ నృత్యాన్ని దేశమంతా ఎత్తిపట్టిన కనకరాజు గారు మృతి చెందడం గోండు సమాజానికి మాత్రమే కాదు, దేశంలో ఉన్న నృత్య ప్రేమికులకు ఒక విషాదం. 1982లో ఇందిరాగాంధీ చేత గుస్సాడీ నృత్యం చేయించిన కనకరాజు మళ్ళీ కలాం ముందు కూడా గుస్సాడీ సంస్కృతికి పేరు తెచ్చిపెట్టాడు. కనకరాజుకు నివాళిగా తెలంగాణ రాష్ట్రపభుత్వం ఒక విశ్వవిద్యాలయం స్థాపన చేసి ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాల గురించి పరిశోధనల సెంటర్లు ఏర్పాటుచేస్తే అదే మనము ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి.

**-కృష్ణ నాయక్,** ఆదిలాబాద్

❖ ❖ ❖

## కొన్న చరిత్ర చారిత్రాత్మకం

కొన్నె గ్రామ చెరువు గురించి, గోనె రానురాను కొన్నెగా మారిన వత్తాంతాన్ని, ఆ గ్రామంలోని కోట గురించి, దేవాలయాలు గురించి, రాతిచిత్రాలు, నెకావపెంత తవ్వకాల్లో అక్కడ దొరికిన ఆనవాళ్ల గురించి శ్రీరామోజు హరగోపాల్ సార్ ఎన్నో తెలియని విషయాలు తెలియజేశారు. **-చౌడు స్వామి,** బచ్చన్నపేట

## మనుషులు లేని అభివృద్ధి ఎవరికోసం

అభివృద్ధి అనేది అన్ని సమాజాలకు అవసరం అయిన పనే అయితే భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు అది మరింత అవసరం. అయితే మనుషుల జీవితాలను ప్రభావితం చేసే విధాన పరమైన నిర్మాణాలు జరిగేటప్పుడు పౌరుల భాగాస్వామ్యం తప్పనిసరి. అది తెలంగాణ లాంటి చైతన్యవంతం అయిన సమాజంలో అది మరింత ముఖ్యం. కానీ 2,900 ఎకరాల భూమిలో ఉన్న 12 లక్షల చెట్లను తొలగించి మరి రాడార్ స్టేషన్ నిర్మించవలసిన అవసరం ఏమిటి? హైద్రాబాద్ నగరానికి ఒక కిటికీగా ఉపయోగపడే దామగుండం మూతపడితే హైద్రాబాద్ మరొక ఢిల్లీగా మారిపోతే ఏమిటి పరిస్థితి. ఈ 12 లక్షల చెట్లను తొలగించి వేరే ప్రాంతాలలో అయినా చెట్లను నాటాలి కదా. ఈ 12 లక్షల చెట్లను నాటడానికి అనువైన స్థలం కానీ, అందుకు తగ్గ ప్రణాళిక కానీ మరిచారా? మరిస్తే ఇప్పటికైనా ప్రణాళిక తయారు చేయండి. టెక్నాలజీ ఇంత అబివృద్ధిచెందింది అని చెప్పుకుంటున్నాం కదా మరి లో ఫ్రీక్వెన్సీ కారణంగా ప్రజలు రోగాలు బారిన పడకుండా కాపాడడానికి ప్రణాళిక తయారు చేయండి. వలస పోవాల్సిన స్థితిలో అక్కడి ప్రజలకు స్థిరమైన జీవిక కల్పించే ఏర్పాటు చేయాలి. ఇవన్నీ అనుకున్నప్పటికి ఎక్కడో కేరళ నుండి వచ్చిన వలస జీవి తాను ఉంటున్న ఆ దామగుండం భూమి మీద ఉన్న ప్రేమ తెలంగాణ వారుగా చెప్పుకుంటున్న మనకి లేకపోవడం విచారం. ఇవన్నీ పక్కన పెట్టి గొప్ప సంప్రదాయ సాంస్కృతిక కేంద్రంకు సాక్షి భూతంగా నిలిచిన రామలింగేశ్వర స్వామి దేవాలయం అయిన కాపాడుకోవాలి. మరి ఈ 12 లక్షల చెట్లను నాటడానికి ఉపాధి హామీని ఆలంబనగా చేసుకొని హరిత సంపద వనాలను సృష్టి చేయాలి. దీని ద్వారా మళ్ళీ ఒక వనంను సృష్టి చేయాలి. అప్పుడే అక్కడ జీవ వైవిధ్యం పెంపొందుతుంది. లేకపోతే వనమహోత్సవాలు, హరితహారాలు అన్ని బూడిదలో పోసిన పన్నీరు అవుతాయి. విలువైన అరుదు అయిన మొక్కలను కాపాడుతూ చేయాలి. సాధ్యం అయినంత వరకు మొక్కల గొడ్డలి పెట్టును తగ్గించాలి. అందుకు తెలంగాణ చిప్ కో ఉద్యమాన్ని నడపాలి. అయితే ఆ చిప్ కో చెట్లను హత్తుకోవడం అయితే ఈ చిప్ కో చెట్లను నాటడం.

**-భారత అవినాష్,** జనగామ

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com **- ఎడిటర్**

ISSN 2581-3188

విషయసూచిక

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 13 సంచిక : 4 పేజీలు : 60

డిసెంబర్ - 2024

సంపాదకులు
**మణికొండ వేదకుమార్**
9848044713
edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు
**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్
**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు
**సయ్యద్ ఖైజర్ భాషా**
9030626288

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**

కవర్‌పేజీ
**ఆగ్రా ఫోర్ట్**

layout - Composing & Printed @
DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**


దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.

## లోపలి పేజీల్లో...



కవర్ స్టోరీ
29వ పేజీలో

మేము నాగరిక బాటలో!
మీరు అనాగరిక
దారిలో!!



జీడికల్లు
తీర్థం




గడియారం రామకృష్ణ శర్మ ...... డా॥ గన్నవరాజు గిరిజా మనోహర బాబు ...... 6
రాజ్యాంగ వజ్రోత్సవాలను ..... (ఎడిటోరియల్) ...... వేదకుమార్. యం ...... 7
ఈ గ్రానైట్ రాళ్ళలో ...... చకిలం వేణుగోపాలరావు ...... 9
ఘనపురం కోటగుళ్ల ఆలయాన్ని పునరుద్ధరించాలి ...... శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే ...... 12
సురపురం రాజా వెంకటప్పనాయక్ ...... పరవస్తు లోకేశ్వర్ ...... 13
గోన బుద్ధారెడ్డి కట్టించిన గుడి ...... ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ...... 16
'డార్విన్ పీడకల' : పర్యావరణ విధ్వంసగాథ ...... డా॥ ఆర్. సీతారామారావు ...... 17
జన్యు నియంత్రణలో గేమ్ ఛేంజర్ మైక్రో ఆర్ఎన్ఏ ...... పుట్టా పెద్దఓబులేసు ...... 19
దక్కన్‌ల్యాండ్ వ్యాసాల నుండి గ్రూప్-1 మెయిన్స్‌లో ప్రశ్నలు ...... కొత్వాల్ సచిన్ ...... 23
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శిలా, ఖనిజ సంపద ...... కమతం మహేందర్‌రెడ్డి ...... 27
ఇండో-ముస్లిం శైలిలో ఆగ్రా ఫోర్ట్ ...... అమితా బేగ్ ...... 29
హెరిటేజ్ పునరుజ్జీవనం ...... కె. శ్యామల ...... 31
సుస్థిర ప్రణాళికతోనే హైదరాబాద్‌కు విశ్వహోదా! ...... వేదకుమార్ మణికొండ ...... 33
కృత్రిమ మేధస్సుతో మానవ మనుగడ ప్రశ్నార్థకమేనా! ...... డా॥ చిటికెన కిరణ్ కుమార్ ...... 35
ప్రమాదంలో జీవనవైవిధ్యం ...... రామకిష్టయ్య సంగనభట్ల ...... 36
జీడికల్లు తీర్థం ...... శ్రీరామోజు హరగోపాల్ ...... 37
రాజ్యాంగ రూపశిల్పి డా. అంబేద్కర్ ...... డా॥ ఎస్. యాదగిరి ...... 40
కబిని ప్రకృతితో ఏకత్వాన్ని అనుభవిస్తోంది ...... విధి బుబ్నా ...... 43
మేము నాగరిక బాటలో! మీరు అనాగరిక దారిలో!! ...... డా॥ లచ్చయ్య గాండ్ల ...... 45
సింగరేణి: బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థ ...... చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ...... 49
పామాయిల్ గెల - కాసులు గలగల ...... సముద్రాల విజయ్ కుమార్ ...... 51
పర్యావరణాన్ని పరిరక్షించే గిరిజనుల కల్పవృక్షం ...... ఎసికె. శ్రీహరి ...... 53
చిరుధాన్యాల పుణరాగమనం ...... కట్టా ప్రభాకర్ ...... 55
సాదిక్ అంటే నిరంతర చలనం! ...... కవి యాకుబ్ ...... 56
పిల్లల గ్రంథాలయాలు - ప్రాముఖ్యత ...... ఖైజర్ భాష ...... 57


**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# గడియారం రామకృష్ణ శర్మ

"పరమ పావని తుంగభద్ర స్రవంతియే
పరుషమ్ములడగించు గంగాభవానీ
రసలింగ రూపుడా బ్రహ్మేశ్వర స్వామి
యెల్లరదన్వు విశ్వేశ్వరుండు
శుభకామనులు దీర్చు జోగులాంబ శ్రీ
అఖిల జీవుల బ్రోచు అన్నపూర్ణ
వాస్తు శిల్ప విశేష వైభవాఢ్యము హేమ
లాపురంచే కాశికపురంబు
భవ్య చౌషష్టి ఘట్ట సంభరిత మగుచూ
తలప శ్రీగిరి పశ్చిమద్వారమగుచు
వ్యాసముని సన్నుతికి పాత్రమైన భూమి
భద్రగుణరాశి దక్షిణ వారణాశి"

అని గొంతెత్తి గానం చేసి తెలంగాణలో ఏకైక శక్తిపీఠంగా వెలుగొందుతున్న, దక్షిణ కాశీగా ప్రసిద్ధిచెందిన అలంపుర ప్రాశస్త్యాన్ని చాటిన పండిత కవి కీర్తిశేషులు గడియారం రామకృష్ణ శర్మగారు.



ఇవాళ ఆలంపురాలోని అపురూప ఆలయాన్నీ విశ్వమంతా ప్రాచుర్యం పొందడానికి అవసరమైన చారిత్రక నేపథ్యాన్ని పలు మార్గాల్లో అందించిన మాన్యులు ప్రముఖ చారిత్రక విషయ పరిజ్ఞాన కవి, విమర్శకులు, మహావక్తలు బ్రహ్మశ్రీ గడియారం రామకృష్ణ శర్మగారు.

పాంచజన్యం (కవితా సంపుటి), చంద్రహాస, కువలయానంద సారం, భారీయ వాస్తు విద్య, కన్నడపు చిన్నకథలు వంటి పలు గ్రంథాల్ని రచించి తెలుగు పాఠక లోకానికి అందించిన బ్రహ్మశ్రీ గడియారం రామకృష్ణ శర్మ గారు తెలుగు దేశాన సుప్రసిద్ధులైన పండిత వర్యులు. వారి ప్రతిభ బహుముఖీనమైనది. అనేక కార్యక్షేత్రములకు వారి అసమాన ప్రతిభ కారణంగా చెప్పలేనంత మేలు జరిగింది. పలు వేదికలకు వ్యాపించిన వారి ప్రతిభ ఆయా వేదికలకే వన్నె తెచ్చింది. సాహిత్య, సామాజిక, రాజకీయ రంగాలకు విస్తృత సేవలందించిన వారి జీవితం ప్రతివ్యక్తి విధిగా అధ్యయనం చేసి నేర్చుకోవలసిన ఒక పాఠ్యాంశం అనడంలో ఎటువంటి సందేహం లేదు.

మహోజ్వల చారిత్రక నేపథ్యం కలిగి ఉన్న రాయలసీమలో జన్మించిన బ్రహ్మశ్రీ గడియారం వారు చిన్న వయసులోనే తెలంగాణకు వచ్చి ఇక్కడే స్థిరపడి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అలంపురాతో పాటు యావత్ తెలంగాణకు తమ సేవలను విస్తరింపజేశారు.

అనంతపురం జిల్లాకు చెందిన 'కదిరి'లో శ్రీ కాలయుక్తి నామ ఫాల్గుణ శుద్ధ చవితి (06.03.1919)న సుప్రసిద్ధ జ్యోతిష్యులు శ్రీ గడియారం జ్వాలాపతి శాస్త్రి, సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. వారి ప్రాథమిక విద్య 1929 వరకు కదిరిలోనే కొనసాగింది. తన చిన్నాన్న గారైన రామశర్మగారి వద్ద తాడిపర్తిలో సంప్రదాయ విద్యగా అమరకోశం, శబ్దమంజరి, రఘువంశాది గ్రంథాలను అభ్యసించారు. వాటితో పాటు తెలుగు భాషా సాహిత్యంలోని భారత, భాగవతాదులను కూడా చదవడం ప్రారంభించారు.

కొన్ని ప్రత్యేక కారణాల వల్ల శర్మ గారు మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆలంపుర గ్రామానికి 1929లో అంటే వారి 11వ యేట వచ్చి మరణ పర్యంతం తమ నివాసంగా దక్షిణ వారణాశి అని ప్రసిద్ధి చెందిన ఆలంపురాన్ని స్థిరపర్చుకున్నారు. 1930-31లో శర్మగారు ఆలంపురాలోనే తమ మాధ్యమిక విద్యను పూర్తిచేశారు. దాంతో శర్మగారి జీవితంలో పాఠశాల విద్య ముగిసినట్లే. "పుణ్యగుణ భూమియైన ఈ తెలంగాణ సీమ" శర్మగారి వంటి మహా విద్వాంసుని తనవానిగా చేసుకుంది.

పాఠ్యశాల విద్య ఆగిపోయినా శర్మగారిలోని జ్ఞానతృష్ణ తనవొక జిజ్ఞాసునిగా మార్చినది. ఆ తృష్ణే శర్మగారిని మహావిద్వద్వరేణ్యులు, శతావధానులు, బ్రహ్మశ్రీ వేలూరి శివరా శాస్త్రుల వారి సన్నిధికి చేర్చింది. వారివద్ద చేసిన శిష్యరికం శర్మగారి జీవితంలోనే ఒక మహత్తర ఘట్టం. సంప్రదాయక రీతిలో కావ్య నాటకాలంకార వ్యాకరణములను అభ్యసించిరి. శర్మగారిలోని సహజమైన ప్రతిభా పాండిత్యాలు గురువు గారి ప్రేరణ కారణంగా రాణించే సమయం రావడం వారి సహచర్యం వల్ల శర్మగారిలో నూతన వికాసం కలగడం వారి జీవితంలోనే అతిపెద్ద మలుపు. ప్రతి విషయంలోనూ ఉన్నత ఆదర్శాలకు మాత్రమే స్థానం కల్పించడం, త్రికరణ శుద్ధితో జీవన యానాన్ని సాధించడం, ఉత్తమ విలువలకు పెద్దపీట వేయడం, మానవతా దృక్పథానికి అంకితం కావడం వంటి సలక్షణాలు శర్మగారికి గురువు గారి వలన కలిగిన సుగుణాలు. 1937 నుంచి 1939 వరకు శర్మగారు శాస్త్రిగారి వద్ద శిష్యునిగా ఉండి పలు విషయాలపై విస్తృత అవగాహనను పొందారు. పుత్రవాత్సల్య సమమైన వారి శిష్య వాత్సల్యం శర్మగారి జీవితంపై గొప్ప ప్రభావాన్ని చూపించింది.


బ్రహ్మశ్రీ వేలూరి శివరామ శాస్త్రిగారి వద్ద నుంచి తిరిగివచ్చిన శర్మగారు మరింత దీక్షతో వారు చూపించిన మార్గంలోనే విద్యార్జన కృషి సాగించి పఠనాపాఠనాదులను కొనసాగించి తమలోని ప్రతిభకు మరింత వన్నెపెట్టిరి. కవితా కళను సాగిస్తూనే పాండితీ బలాన్ని కూడా పెంపొందింప జేసుకున్నారు. ఆంగ్ల, హిందీ, కన్నడాది భాషా సారస్వతాల అధ్యయనం చేసి స్వయంకృషితో ఎన్నో లోతులు సాధించారు.

ఆలంపురమే స్థిరనివాసంగా చేసుకున్న శర్మగారు అప్పటికే తాలూకాలో ప్రసిద్ధమైన గ్రంథాలయాలుగా పేరుబడ్డ ఉండవెల్లిలోని

(తరువాయి 8వ పేజీలో)

# రాజ్యాంగ వజ్రోత్సవాలను

## రాజకీయ ఆచరణ ద్వారా విజయవంతం చేద్దాం




మన రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాల అయిన సందర్భంలో రాజ్యాంగ వజ్రోత్సవాలను ఈ నవంబర్ 26 నుంచి సంవత్సరం పాటు దేశమంతా జరుపుకోబోతుంది. వాడ వాడలా రాజ్యాంగం పట్ల దాని ఆచరణ పట్ల అవగాహన పెంపొందించడమే ఈ వజ్రోత్సవాల లక్ష్యం కావాలి. డా. అంబేద్కర్ నాయకత్వంలో వివిధ దేశాల రాజ్యాంగాలు, భారతీయ సమాజపు నైతిక, తాత్విక మూలాలు అధ్యయనం చేసి దాదాపు మూడు సంవత్సరాలు కృషితో రూపొందించబడిన డాక్యుమెంట్ మన రాజ్యాంగం. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ఎలాంటి అసమానతలు, వివక్షలు లేని ప్రజాస్వామిక, మానవీయ స్ఫూర్తితో విలసిల్లే మానవ సమాజాన్ని నిర్మించుకోవడం కోసం అవసరమైన భావనల, పాలనా విధానాల, బాధ్యతల సమోన్నత చట్టరూపమే మన రాజ్యాంగం. ఏ తారతమ్యాలు లేకుండా ప్రజలందరికీ ఓటు హక్కు, విద్య, వైద్య హక్కులు, ఆరోగ్యంగా ఆత్మాభిమానంతో జీవించే హక్కు, ఆలోచనలను, విశ్వాసాలను భయం లేకుండా చెప్పగలిగే భావ ప్రకటనా స్వేచ్ఛ, జీవిత విధానాన్ని ఇష్టపూర్వకంగా నిర్దేశించుకునే స్వేచ్ఛ రాజ్యాంగం ఇచ్చింది. పలు రాష్ట్రాలు, ప్రాంతాలు, జాతులు, కులాలు, భాషలు, భిన్న సంస్కృతులు, భౌగోళిక స్థితులతో వైవిధ్యపూరితమైన మన దేశ ప్రజలందరి మధ్య ఐక్యత సాధించి భిన్నత్వంలో ఏకత్వం సాధ్యమని నిరూపించింది మన రాజ్యాంగం. కేంద్ర రాష్ట్ర సంబంధాలను ఫెడరల్ విధానం ద్వారా సమన్వయం చేసింది. తరతరాలుగా ఎలాంటి అవకాశాలు పొందలేకపోతున్న సమూహాల కోసం ప్రత్యేక సదుపాయాలు, రిజర్వేషన్లు కల్పించింది. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకున్న ఈ సమూహాలు విద్యావంతులై ఉన్నత పదవుల్లో, ఉద్యోగాల్లో ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీ, ఆదివాసీ సమూహాలు, స్త్రీలు సామాజిక ఆర్థిక, రాజకీయ రంగాల్లో బలమైన శక్తిగా ఎదిగారు. ఇది ఒక చారిత్రక మలుపు. ఈ రాజ్యాంగమే లేకపోతే ఈ అభివృద్ధి సాధ్యమయ్యేది కాదు.

భారతీయ సామాజిక వ్యవస్థను సమూలంగా మార్చి అసమానతలు లేని, వివక్షలు లేని, అందరికీ సమాన హక్కులు కలిగిన నూతన సమాజ నిర్మాణానికి శాంతియుత, సహేతుక మార్గాన్ని చూపుతున్న మన రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయడమే ఇవ్వాళ్టి మేధావుల, విద్యావంతుల, ప్రజాస్వామికవాదుల కర్తవ్యం.

ఈ వజ్రోత్సవాల సందర్భంగా ఈ సంవత్సరమంతా గ్రామగ్రామాన రాజ్యాంగం పట్ల, దాని ఆచరణ పట్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి. రాజ్యాంగాన్ని పాఠ్యాంశం చేసి ప్రతి పాఠశాలలో వారానికి ఒక పీరియడ్ రాజ్యాంగ శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. వివిధ రంగాల, వృత్తుల ప్రజల మధ్య అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి.

మన దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద లౌకిక ప్రజాస్వామిక గణతంత్ర దేశంగా నిలబెట్టుకోవడానికి తగిన రాజకీయ ఆచరణ కోసం కృషి చేయాలి.

ఈ రాజకీయ ఆచరణ ద్వారానే రాజ్యాంగ వజ్రోత్సవాల లక్ష్యాన్ని సాధించగలం....




(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

సరస్వతీ గ్రంథాలయంలోనూ ఆలంపురాలోని రామకృష్ణారెడ్డి స్మారక గ్రంథాలయంలోనూ వివిధ గ్రంథాలను అధ్యయనం చేసి తమ వైదుష్యాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ఈ సమయంలోనే శర్మగారు తమచదువుతో పాటు.. స్వీయానుభావం వలన, స్వయంకృషి వలన అనేక విద్యా విషయాలతో పాటు... భావి జీవితానికి ఉపయుక్తములయ్యే పలు కార్యములకు సంబంధించిన విశేషజ్ఞాన సముపార్జన చేసి సమయాన్ని సద్వినియోగపర్చుకున్నారు.

కేవలం సాహిత్యవేత్తగానే గాక, శర్మగారు ఒక చరిత్ర పరిశోధకునిగా, వాస్తు, శిల్ప, లిపి, శాస్త్రాదులందు అభిరుచిగల జిజ్ఞాసునిగా తమను తాము మలుచుకొని ఆయా రంగాలలో అధికంగా పరిశ్రమించి జ్ఞాన సముపార్జనం చేశారు. వీటితోనే సరిపెట్టుకోక.. నాటక కళారంగ సేవ, సమాజ సేవ, గ్రంథాలయోద్యమ నిర్వహణ, భాష ప్రచారోద్యమ సేవ వంటి పలు రంగాలకు తమ సేవలను విస్తరించారు.



1940-59 మధ్యకాలంలో నాటక రంగానికి విస్తృత సేవలందించారు. అనేక నాటక ప్రదర్శనలు నిర్వహించి ఆలంపురాలో 'ఆంధ్ర యువజన నాట్యమండలి'ని స్థాపించి దర్శకులుగా, నటులుగా హరిశ్చంద్ర, శ్రీకృష్ణ, బిల్వమంగళ, ఖడ్గ, నారాయణాది పాత్రలను తామే ధరించి తెలుగు నేలపై విశేష ఖ్యాతినొందారు.

నాటి నిజాం ఏలుబడిలో తెలుగును, తెలుగుదనాన్ని మరిచిన ప్రజలకు తెలుగు పరిమళాలను వెదజల్లే ప్రయత్నమే ఆంధ్రోద్యమమై వ్యాప్తి చెందింది. స్వాతంత్ర్యోమంలో మిక్కిలి ఉత్సాహంగా పాల్గొంటున్న శర్మగారు అంతకు రెండింతల ఉత్సాహంతో ఆంధ్రోద్యమంలోనూ పాల్గొన్నారు.

ఆంధ్రోద్యమంతో పాటు.. గ్రంథాలయోద్యమంలోనూ చురుకుగా పనిచేసిన శర్మగారి కృషి అసాధారణం. 1940 నుంచి 1956 వరకు ఈ ఉద్యమాలే ఊపిరిగా శర్మగారు పనిచేశారు. స్వాతంత్ర్యానంతరం రాజకీయాల్లో కల్మషాలకు విసిగి ఆ రంగాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నారు.

పత్రికా రంగం పట్ల ఆసక్తి ఉన్నవారు శర్మగారు. 1950-53 మధ్యకాలంలో "సుజాత" మాసపత్రికకు సంపాదకులుగా వ్యవహరించారు. "తెలంగాణ సంచిక" "సప్తమ వార్షికోత్సవ సంచిక"లుగా వారి సంపాదకత్వంలో వెలువడ్డ ప్రత్యేక సంచికలు. నేటికీ పలువురి ప్రశంసలకు పాత్రమవుతూనే ఉన్నాయి.

వారి మరో ప్రధాన రంగ చరిత్ర. విశేషమైన చరిత్ర కలిగిన ఆలంపురాలని శ్రీ బాలబ్రహ్మేశ్వర దేవస్థానానికి ట్రస్టు బోర్డు అధ్యక్షులుగా 1954 నుంచి కొన్ని దశాబ్దాల పాటు గణనీయమైన సేవలందించారు గడియారం వారు.

కీర్తిశేషులు గడియారం రామకృష్ణ శర్మగారు తమ 18వ యేటనే చంద్ర హాసోపాఖ్యానం అనే పద్యకావ్య రచన చేసి సాహిత్య రంగంలోకి అడుగుపెట్టారు. ఆలంపుర శిథిలములు, దక్షిణ వారణాశి ఆలంపుర క్షేత్రం వంటి చరిత్ర సంబంధించి రచనలతో పాటు.. భారతదేశపు చరిత్ర, ప్రపంచ రాజ్యముల వంటి గ్రంథములను వారు అందించారు. మన వాస్తు సంపదను గురించి వారు రాసిన గ్రంథము ఆ శాస్త్రంలో శర్మగారికి ఉన్న పాండిత్యానికి నిదర్శనం. చరిత్ర పరిశోధన మాత్రమే కాక... శాసన పరిశోధనలోనూ పరిణత ప్రజ్ఞ కలిగిన శర్మగారు వినయాధిత్యుని పల్లెపాడు తామ్ర శాసనం తెలంగాణ శాసనములు (రెండో భాగం) కూడా వెలువరించారు. వారు కన్నడం నుంచి అనువదించిన బి.ఎం. శ్రీ కంఠయ్య గారి గదాయుద్ధ నాటకమునుకు 1970లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.


వీరిలోని కార్యదక్షతకు, మేధాశక్తికి అబ్బురపడిన అనేక సంస్థలు వారి సేవలను ఉపయోగించుకున్నాయి. వారు 1965 నుంచి 1975 వరకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యులు. 1968-70లలో కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యులు. 1962 నుంచి దాదాపు ఒక దశాబ్ద కాలం వారు గ్రంథాలయ సంస్థ సభ్యులు. 1970 ప్రాంతంలో ఆంధ్రోద్యమ చరిత్ర నిర్మాణ సంఘంలో సభ్యులు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అకాడమిక్ కౌన్సెల్‌లో 1970 నుంచి సభ్యునిగా సేవలందించారు. ఇవి మాత్రమే కాక ఆలంపుర తాలూకాలోని రైతుల కొరకు కృషి చేసి రైతులందరినీ సంఘటితపర్చి "ఆలంపుర వ్యవసాయ సంఘాన్ని" ఏర్పర్చిరి.

వీరిలోని మరో ఘనమైన పార్శ్వం సంఘ సంస్కరణ. మూఢాచారాలను తీవ్రంగా వ్యతిరేకించే శర్మగారు 1945 నుంచి 1965 వరకు స్త్రీ జనాభ్యుదయం కొరకు ఒక మహాసంస్థ వలె కృషి చేశారు. స్వయంగా వితంతు వివాహం చేసుకున్న శర్మగారు ఆ స్ఫూర్తితో ఆ రోజుల్లో హైందవ బాలవితంతువుల వివాహాలు తాము దగ్గరుండి జరిపించిచడమేగాక... ఎదిరించిన పండితులతో శాస్త్ర వాదములు చేసి పునర్ వివాహములు శాస్త్ర సమ్మతములేనని నిరూపించుకున్నారు. ఆలంపురాలో అనాథ స్త్రీల కొరకు ప్రత్యేక విద్యాల్యం స్థాపించి హిందూ, ముస్లిం, క్రైస్తవ విద్యార్థులకు శిక్షణ ఇప్పించారు. దానివల్ల పలువురు స్త్రీలు జీవనోపాధి పొందడం శర్మగారి కృషికి ఫలితం.

గడియారం రామకృష్ణ శర్మగారి జీవితం ఒక మహాత్ముని జీవితం వంటిది. స్వాభిమానంతో స్వతంత్ర జీవనాన్ని గడిపి తాము జీవించినంత కాలం లోకపకారమే లక్ష్యంగా సాగిన మాన్యులు శ్రీ రామకృష్ణ శర్మగారు 2006 జులై 25వ తేదీన తుదిశ్వాస విడిచారు. భౌతికంగా శర్మగారు లేకున్నా తెలుగు నేలపై సాహితీ సంస్కృతులు విలసిల్లినంత కాలం శర్మగారు చిరంజీవులే.

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన 'తెలంగాణ తేజోమూర్తులు' నుంచి)*

**-డా॥ గన్నవరాజు గిరిజా మనోహర బాబు**


కుకునూరు రాతిచిత్రాల పడిగెరాయి


గ్రానైట్ శిలలు

# ఈ గ్రానైట్ రాళ్ళలో...

తెలంగాణ ప్రాంతంలో గ్రానైట్ అనే పేరు విననివారు ఉండరు. మన దైనందినజీవితంలో అడుగడుగునా గ్రానైట్లు కనిపిస్తాయి. రోడ్డువేసే కంకర, పక్కన ఉన్న మైలురాయి, అనేక రకాల స్తంభాలు, గోడలకు వాడిన రాళ్ళు, దేవాలయంలో మంటపాలు, శిల్పాలు ఇంట్లో ఫ్లోరింగ్, వంటింటి స్లాబ్ ఇలా ఒకటేమిటి ఎటుచూసినా మనచుట్టూ గ్రానైట్ కనిపిస్తుంది. ఇంతకీ అసలీ గ్రానైట్‌లో ఏముంది, మనదగ్గరే ఎక్కువ ఎందుకు ఉంది. దీని వివరాలు పరిశీలిద్దాం..

"గ్రానైట్" అనే పదానికి ప్రాచీనభాషలలో మూలాలు ఉన్నాయి.

**వ్యుత్పత్తి:**

- ఫ్రెంచ్ "గ్రానైట్" నుండి (17వ శతాబ్దం)
- ఇటాలియన్ "గ్రానిటో" (16వ శతాబ్దం) నుండి తీసుకోబడింది.
- లాటిన్ "గ్రానమ్" నుండి ఉద్భవించింది అంటే విత్తనం లేదా గింజలు అనే అర్థం.

పురాతన లాటిన్ పదం "గ్రానరో"తో కూడా సంబంధించినది కావచ్చు అనగా అంకురించు లేదా ఎదుగు అని అర్థం.

పూర్వం గ్రీకులు రోమన్లు గ్రానైట్ ను దాని కణస్వభావం వల్ల "లాపిడస్ గ్రానాటి" లేదా "లాపిస్ గ్రనటస్"గా వ్యవహరించారు. ఇటలీలో మన్నికగా దృఢంగా పెద్దకణాలున్న రాళ్ళను "గ్రానిటో"గా వర్తకులు వ్యవహరించేవారు.

ఫ్రెంచ్ భూవైజ్ఞానికులు 17వ శతాబ్దంలో గ్రానైట్ అనే పదం వాడుకలోకి తెచ్చారు. ఈ పదం ఇప్పుడు వైజ్ఞానికంగా వాణిజ్యపరంగా విశేషంగా వాడుకలోకి వచ్చింది. అయితే వాణిజ్య పరంగా గ్రానైట్ అనే పదం గ్రానైట్, గ్రానైటాయిడ్ లకే కాకుండా పెనిన్సులర్ గ్నిసిక్ కాంప్లెక్స్ (PGC)లో దొరికే అన్ని రకాల శిలలకూ వాడతారు.

గ్రానైట్ ఒక అగ్నిశిల, శిలాద్రవం యొక్క నెమ్మదిగా శీతలీకరణ జరగటం వల్ల ఏర్పడుతుంది. దాని విలక్షణమైన చుక్కల్ని (Sparkled) లేదా (Veins) సిరలరూపాన్ని కలిగి ఉంటుంది. ఖనిజ పరంగా ఇందులో క్వార్ట్జ్ సమృద్ధిగా ఉంటుంది. ఫెల్డ్‌స్పార్ రెండవస్థానంలో ఉంది. బయోటైట్ కూడా ఉంటుంది. హార్న్ బ్లెండ్ వంటి ఖనిజాలు తక్కువ మొత్తంలో ఉంటాయి.

హైదరాబాద్ ప్రాంతంలో ఉన్న గ్రానైట్ భారతదేశంలో ఉన్న అన్ని గ్రానైట్ ప్లుటాన్‌లో కన్నా పెద్దది. ఇది తూర్పుధార్వార్ క్రటాన్‌లో భాగంగా ఉంది. ఆర్కియన్ క్రస్టల్ కారిడార్‌లో మూడురకాల ముఖ్యమైన శిలలు ఉంటాయి.

**క్రస్టల్ కారిడార్ శిలలలో రకాలు:**

1. ప్రారంభ దశలో ఏర్పడ్డ టోనలైట్‌ట్రోండ్‌జెమైట్ గ్రానోడయోరైట్ (TTG)
2. గ్రీన్‌స్టోన్ బెల్ట్
3. చివరి దశలో అంతర్గమం చెందిన అనాటెక్టిక్ హై K గ్రానైటిక్ సీక్వెన్స్.

ఈ చివరిదశలో ఏర్పడిన గ్రానైట్‌లు క్రస్టల్ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాయి. ఈ శిలాసమూహాలు అన్ని ధార్వార్ క్రటాన్‌లో కనిపిస్తాయి. ఈ ధార్వార్ క్రటాన్ తూర్పుభాగంలో ఉన్న హైదరాబాద్ ప్రాంతంలో బహిర్గతమైన విశాల గ్రానైటిక్ భూభాగాన్ని, హైదరాబాద్ గ్రానైట్ బాథోలిత్ (HGB)అని అంటారు. ఇది ఆప్లైట్స్, గ్రానైట్‌లు, గ్రానోడయోరైట్స్, మోంజోగ్రానైట్స్, సినోగ్రానైట్స్ అలస్కైట్స్ మొదలైన వివిధరకాల గ్రానైటాయిడ్‌ల సమూహం. ఈ గ్రానైటిక్ భూభాగాల వయస్సు 250 కోట్ల సంవత్సరాలు. ఈ శిలలు ఇదే ధార్వార్ క్రటాన్ లో ఉన్న క్లోజ్‌పేట్ గ్రానైట్‌లతో పోల్చదగినవి.

**హైదరాబాద్ గ్రానైట్ బాథోలిత్ (HGB):**

HGBలో మోలిబ్డినం మినిరలైజేషన్ కూడా పీరంచెరువు మరియు తారామతిపేటలో గుర్తించబడింది. హైదరాబాద్ ప్రాంతంలోని గ్రానైట్‌ల చుట్టూ ప్రీకేంబ్రియన్ గ్నీసిక్ కాంప్లెక్స్, కరీంనగర్ గ్రాన్యులైట్ బెల్ట్, గోదావరి గ్రాబెన్, కడప బేసిన్ మరియు దక్కన్ ట్రాప్లు ఉన్నాయి.

HGB 10 కి.మీ. కంటే ఎక్కువలోతు వరకు విస్తరించి, 10000 చ.కి.మీ విస్తీర్ణంలో వివిక్తమూలాన్ని కలిగి ఉంది. ఈ బాథోలిత్ లో పెద్ద మరియు చిన్న లీనియమెంట్స్ ఉన్నాయి. గ్రానైట్ పుట్టుకకు పూర్వం ఏర్పడిన భ్రంశాలు అక్కడక్కడ ఉండి అప్పుడప్పుడు సర్దుబాటుకు గురికావడం వల్ల నియోటెక్టానిక్ మార్పులకు కారణం అవుతాయి.

హైదరాబాద్ గ్రానైట్‌లు రసాయనిక కూర్పులో ఎక్కువ


పెరలుమినస్, ఆల్కలీ నుండి ఆల్కలీ క్యాల్సిక్ స్వభావం కలిగి ఉన్నాయని అధ్యయనాలు సూచించాయి. ప్రధానంగా సబార్డినేట్ ప్లాజియోక్లేస్‌తో K ఫెల్డ్‌స్పార్, క్వార్ట్జ్ మరియు బయోటైట్‌లను కలిగి ఉంటుంది. LRRE HREE కన్నా ఎక్కువ మరియు వీటిలో SrTi మరియు Nb ఎనామలీ రుణాత్మకంగా ఉంది.

**గ్రానైట్ రకాలు:**

**పింక్ గ్రానైట్:** హైదరాబాద్‌లో విరివిగా కనిపించె ఈ గ్రానైట్‌లో గులాబీరంగు K-ఫెల్డస్పార్ ఉంటుంది. దీనివల్ల గ్రానైటులు గులాబీరంగులో కనిపిస్తాయి. ఇవి ప్లాజియోక్లేజ్ మెటాసోమాటిజం చెంది K-ఫెల్డస్పార్‌గా మారటంవల్ల ఇలా జరుగుతుంది.

**గ్రే గ్రానైట్:** గ్రే గ్రానైట్‌లో ప్లాజియోక్లేజ్ ఎక్కువగా ఉంటుంది.

ఈ రెండు గ్రానైట్లలో క్వార్ట్జ్ సంవృద్ధిగా ఉంటుంది. బయోటైట్ కూడా ఉంటుంది. ఇతర మాఫిక్ ఖనిజాలు తక్కువమొత్తంలో ఉంటాయి.




*తెలంగాణలో గ్రానైట్*

హైదరాబాద్‌లో ఉన్న కొన్ని ముఖ్యమైన గ్రానైట్ గుట్టలు

1. బంజారాహిల్స్ (17.402°N, 78.437°E)
2. జుబ్లీహిల్స్ (17.445°N, 78.461°E)
3. గోల్కొండ హిల్స్ (17.384°N, 78.401°E)
4. శామీర్ పేట హిల్స్ (17.533°N, 78.533°E)
5. ఖాజాగూడ హిల్స్ : (17° 22' 0" N 78° 32' 0"E)
6. రాచకొండగుట్టలు (హైదరాబాద్ శివారులో)

హైదరాబాద్ ప్లూటాన్ యొక్క భౌతికవ్యక్తీకరణ వృత్తాకార రూపంలో ఉంటుంది. ఇందులో జుబ్లీహిల్స్ ఈ మార్ఫోటెక్టానిక్ ముడిమధ్య ఉంటుంది. ఈ ముడిభ్రంశాలు మరియు లీనియమెంట్స్ ఒకదానిని ఒకటి ఖండించుకోవడంవల్ల ఏర్పడినవి. వీటివల్ల స్థానికంగా కొద్దిపాటి భూకంపాలు రావచ్చని శాస్త్రజ్ఞుల అంచనా. మంజీరానది మరియు మూసీనదులు ఈ ప్లూటాన్ యొక్క వాయువ్య, ఆగ్నేయదిశల్లో విస్తరించలేకపోయిన భుజాల (failed arms)లో ఉంటాయి.

**బ్లాక్ గ్రానైట్ (డోలరైట్):** ఇది ఒక రకమైన అంతర్గమ అగ్నిశిల. ఇది భూమి యొక్క క్రస్ట్‌లో లోతైన శిలాద్రవం గ్రానైట్‌లోకి అంతర్గతం చెంది శీతలీకరణ జరగటంవల్ల ఏర్పడుతుంది.

**బ్లాక్ గ్రానైట్ యొక్క నిర్దిష్ట లక్షణాలు:**

1. అధిక ఇనుము మరియు మెగ్నీషియం ఉన్న కారణంగా ముదురురంగులో కనిపిస్తాయి.
2. యాంఫిబోల్ లేదా పైరోక్సీన్ ఖనిజాల ఉనికి ఉంది.
3. ఫైన్ నుండి మీడియం కణపరిమాణం కలిగి ఉంటుంది. సాంకేతికంగా దీన్ని డోలరైట్ డైక్ అంటారు.

సాధారణంగా ఇవి నలుపురంగులో ఉన్న చారలవలె దూరం నుంచి కనిపిస్తాయి. స్థానికంగా వీటిని ఏనెరాళ్ళు అంటారు.

ఈ డైక్‌లు తూర్పు ధార్వార్ క్రటాన్‌లో అయిదు క్లస్టర్ లుగా ఉన్నాయి. అందులో హైదరాబాద్ క్లస్టర్ ఒకటి.

ఇవి ఎక్కువగా ఉత్తర ఈశాన్యం నుండి దక్షిణ వాయవ్యం (NNE-SSW) ఒక్కోసారి పూర్తి ఉత్తర,దక్షిణంగా ఉన్న డైకులు తూర్పు ఈశాన్యం – పశ్చిమ నైరుతి (ENE- WSW) దిశగా ఉన్న డైకులను ఖండిస్తూ ఉంటాయి. ఇందులో ఎక్కువభాగం డోలరైట్ డైకులే. వీటి వయసు 147 కోట్ల నుండి 133 కోట్ల సంవత్సరాలు ఉండవచ్చని అంచనా. కొన్ని తూర్పు పడమరగా ఉన్న డైకులు 240 కోట్ల సంవత్సరాల వయస్సు కలవని, ఉత్తర దక్షిణంగా ఉన్న డైకులు 220 కోట్ల సంవత్సరాలనాటివి అని అంచనా వేస్తున్నారు. ఈ శిలలు నిర్మాణాలకు, అలంకరణకు మరియు శిల్పాలుగా ఉపయోగిస్తారు.

**క్వార్ట్జ్ మరియు ఎమిథిస్ట్:**

హైదరాబాద్ ప్రాంతంలో ఉన్న గ్రానైట్‌లో అక్కడక్కడ స్ఫటికరూపంలో ఉన్న క్వార్ట్జ్, ఎమిథిస్ట్ ఉన్నట్టు తెలుస్తోంది. ఇంతకు ముందు బోయినపల్లిలో ఉప్పల్‌లో ఎమిథిస్ట్ దొరికినట్లు సమాచారం. ఇటీవల మస్జిద్ బండ వద్ద క్వారీలో మంచి క్వార్ట్జ్ స్ఫటికాలు దొరికాయి.

**మైసూరు శిలలు:**

మైసూరు చుట్టూ ఉన్న శిలలు ఆర్కియన్-ధార్వార్ క్రేటన్‌లో భాగంగా ఉన్నాయి. మైసూరు చుట్టూ ఉన్న అతిపురాతనశిలలు సియాలిక్ (సిలికా మరియు అల్యూమినాతో సమృద్ధిగా ఉంటాయి). వీటిని పెనిన్సులర్ నీస్ అని పిలుస్తారు. Gneissic శిలలలోని జిర్కాన్ రేణువుల యొక్క U-Pb (యురేనియం మరియు సీసం) ఐసోటోపిక్ అధ్యయనాల వల్ల 3.4 ఈ శిలాల వయస్సు బిలియన్ సంవత్సరాలుగా తెలుస్తుంది. ఇటువంటి శిలలు ఇప్పుడు మైసూరు ప్రాంతం నుండి ఐరోపాకు అలంకారప్రయోజనాల కోసం ఎగుమతి చేయబడుతున్నాయి. క్వార్ట్జైట్‌లు, కార్బోనేట్‌లు, ఇనుపరాళ్లు మరియు పెలిటిక్ శిలలతో కూడిన మెటాసెడిమెంటరీ శిలలసమూహం ఈ basement శిలలపై నిక్షిప్తం చేయబడింది. మైసూరు నగరానికి నైరుతి దిశలో సర్గూర్ పట్టణం చుట్టూ ఈ శిలలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి ఈ శిలాసమూహానికి 'సర్గూర్ సిస్ట్ బెల్ట్' అనే పేరు వచ్చింది. ఈ ప్రాంతంలో అవక్షేపణ శిలలు ఉండటంవల్ల ఈ ప్రాంతం భౌగోళికగతంలో సముద్రంలో మునిగి పోయిందని సూచిస్తుంది.

ఈ బేస్మెంట్ లో ఉన్న అల్ట్రామాఫిక్-మాఫిక్ శిలలు డ్యూనైట్, హార్జ్‌బర్గిట్, లెర్జోలైట్, పెరిడోటైట్స్, పైరోక్సెనైట్స్ మరియు గాబ్రోస్ మొదలైన శిలలతో కూడి వైవిధ్యభరితమై ఉంటాయి.

**గ్రానైటుశిల్పాలు:**

**అయోధ్య రాముడు:**

అయోధ్యారాముడి విగ్రహం కొరకు ఉపయోగించిన శిల గురించి ఆసక్తి చాలామందిలో ఉంది. హెచ్‌డి కోటే తాలూకా లోని జయపుర హొబ్లీ వద్ద గుజ్జేగౌడనాపుర నుండి త్రవ్వబడిన ఆకాశనీలంరంగు కృష్ణశిల నలుపు గ్రానైట్‌గా భావిస్తారు కాని ఇది ఒక "చీలికరాయి". సిస్ట్ (schist). దీనిలోని రేణువులు మధ్యస్థ-కణిత నుండీ సన్నటి రేణువులుగా ఉంటాయి. దీని రంగు ఆకాశ-నీలం-రంగు. ఇది ఒక రూపాంతరప్రాప్తశిల. విగ్రహాలను చెక్కడానికి ఇది చాల అనువైనది.







పాలిష్డ్ పింక్ గ్రానైట్, గ్రానైట్ రాయి, హుస్సేన్ సాగర్ బుద్ధుడు, అవంచ వినాయకుడు, అయోధ్య రాముడు

**బుద్ధ విగ్రహం:**

హుస్సేన్ సాగర్‌లో ప్రతిష్ఠించిన 350 టన్నుల బరువు, 18మీటర్ల ఎత్తున్న బుద్ధుని విగ్రహం తెలుపు గ్రానైట్ లో చెక్కబడింది. ఈ రాయి రాయగిరి ప్రాంతంలో ఉన్న గ్రానైట్ క్వారీ నుండి సేకరించారు. ఇక్కడి గ్రానైట్‌లో క్వార్ట్జ్ సమృద్ధిగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని ప్రపంచంలో కెల్లా అతిపెద్ద ఏకశిలా బుద్ధవిగ్రహం అని అంటారు.

**ఐశ్వర్య గణపతి:**

నాగర్ కర్నూల్ జిల్లా, తిమ్మాజీపేట మండలంలో ఉన్న ఆవంచ గ్రామంవద్ద 30 అడుగుల ఎత్తున్న వినాయకవిగ్రహం ఉంది. ఇది భారత దేశం లో అతిపెద్ద ఏకశిలా వినాయక విగ్రహం అంటారు. ఈ పదకొండవ శతాబ్దపు విగ్రహం గ్రానైట్ శిలపై చెక్కబడింది.

**భూకంపాలు-గ్రానైట్లు:**

హైదరాబాద్ ప్రాంతం భూకంపాలురాని సురక్షితప్రాంతం అని తొలుత భావించినా ఈ గ్రానైట్ బాతోలిత్ స్వరూప, స్వభావాలవల్ల కొద్దిపాటి భూకంపాలకు లోనయ్యే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. 14 జనవరి 1982 నాడు ఉస్మాన్ సాగర్ ప్రాంతంలో 3.5 తీవ్రత గల భూకంపం వచ్చింది. తర్వాత మేడ్చల్ ప్రాంతంలో 30 జూన్ 1983 నాడు 4.5 తీవ్రత గల భూకంపం వచ్చింది. ఆ తర్వాత కుషాయి గూడలో 25 ఆగస్టు 1984 నాడు చిన్నచిన్న ప్రకంపనలు వచ్చాయి. 29 నవంబర్ అదే సంవత్సరంలో మూడు ప్రకంపనలు సరూర్ నగర్ లో వచ్చాయి. జుబ్లీహిల్స్‌లో 1994, 95, 98 మరియు 2000 సంవత్సరాలలో సూక్ష్మ ప్రకంపనలు వచ్చాయని రికార్డులు ఉన్నాయి.

వీటన్నింటికి అనేక భూవైజ్ఞానిక కారణాలు ఉన్నాయి. సాధారణంగా క్రటాన్ చాలాస్థిరంగా ఉండే భూభాగం. కాని భారత ఉపఖండంలో ఉన్న క్రటాన్ లలో భూమి కర్పరం (Crust) ఎక్కువ మందంగా లేదు. ధార్వార్ క్రటాన్‌లో కూడా ఇదే పరిస్థితి. హైదరాబాద్ క్రింద ఉన్న కర్పరం సరాసరి మందం 34కి. మాత్రమే అని భూభౌతిక శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఈ అంశాలన్నీ కలిసి తక్కువ తీవ్రతలోనైనా సరే, భూకంపాలకు కారణం అవుతున్నాయి. మంజీరానది భౌమకాలంలో ఒకప్పుడు మూసీనదిలోకి ప్రవహించేది కాని నవీన విరూపణ (Neotectonism)వల్ల హైదరాబాద్ ప్రాంతం కొద్దిగా పైకిలేచినందున ఈ నది దిశను మార్చుకుంది.

**విధ్వంసక దృశ్యం:**

భూవిజ్ఞానశాస్త్ర పరంగా ఒక విధ్వంసంకర పరిస్థితిలో ఏర్పడిన షియర్ జోన్ రంగాపూర్ శివన్నగూడెం మధ్యలో ఇటీవల కనుగొన్నారు. ఇది తూర్పు ధార్వార్ క్రెటాన్ లోనే మెదటిది. ఇందులో బ్రిక్షియా, కెటాక్లాస్టైట్, మైలోనైట్ వంటి శిలలు ఉండటం, తీవ్రమైన ఫ్రాక్చరింగ్ వంటి లక్షణాలవల్ల ఈ శిలలు అత్యధిక విరూపణకు గురి అయినట్లు సూచిస్తున్నాయి.

**భూగర్భజలాలు:**

హైదరాబాద్ యొక్క పగుళ్లకల గ్రానైట్‌లో హైడ్రోలాజికల్ పరిస్థితులు భిన్నమైనవి. నీటి రీఛార్జ్ శైథిల్యం చెందిన జోన్లో మొదలై క్రమంగా షీట్ జాయింట్‌లోకి జరుగుతుంది. దూరప్రాంతంలో నుండి శైథిల్యజోన్ వరకు భూగర్భజలాల రీఛార్జ్ యొక్క మూలాలు ఉన్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. గ్రే మరియు పింక్ గ్రానైట్ మధ్య కాంటాక్ట్ జోన్ భూగర్భ జలాలకు అత్యంతఅనుకూలమైనది. భూగర్భజలాలు శైథిల్యంచెందిన శిలలలో మరియు పగుళ్లు, షీర్ జోన్‌లలో కన్ఫైన్డ్ సెమీ కన్ఫైన్డ్ పరిస్థితుల్లో ఉన్నాయి. భూగర్భజలాల క్షీణత చాలా వేగంగా జరుగుతోంది. నగరంలోని చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. లోతైన భాగంలో లభించే నీటికోసం 1200 నుండి 1500 అడుగుల బోరుబావులు తవ్వుతున్నారు. సరస్సులు మరియు నీటి వనరుల సరైన రక్షణ చేపట్టకపోతే హైదరాబాద్‌లో బెంగళూరులాంటి పరిస్థితి ఏర్పడుతుంది.

**గ్రానైట్స్‌లో సాంస్కృతిక విశేషాలు:**

గ్రానైట్ గుట్టల్లో ఎన్నోచోట్ల రాతిచిత్రాలున్న తావులున్నాయి. దాదాపు 30వేల సంవత్సరాల కిందటి పురామానవులు గీసిన ఈ రాతిచిత్రాలలో నాటి పురామానవుల సంస్కృతి చిత్రించబడ్డది. అవి మన మానవవికాసాన్ని మనకు చెప్పే చిత్రగ్రంథాలు. కాని, గ్రానైట్ రాళ్ళను క్వారీలుగా, క్రషింగ్ ప్లేసెస్ గా, రియల్ ఎస్టేట్లుగా మార్చిన తర్వాత ఆ రాతిచిత్రాల తావులు మాయమైపోతున్నాయి. కోకాపేట రాతిచిత్రాలు నేలగూలాయి. గుండ్లపోచంపల్లి రాతిచిత్రాలు కనుమరుగు కానున్నాయి. కరీంనగర్ ప్రాంతంలో వందలాది గుట్టలు క్రషింగ్‌కు గురైనాయి. వాటిలో ఎన్నెన్ని పురామానవుల ఆవాసాలు, రాతి చిత్రాల తావులు ధ్వంసమైపోయాయో.

కీసరగుట్టలో తొలి తెలుగు శాసనం 'తొలుచువాన్రు' కూడా గ్రానైట్ రాతిగోడకే చెక్కివుంది. ఎన్నో అద్భుతమైన శిల్పాలు గ్రానైట్ శిలలమీద చెక్కబడ్డాయి. కాపాడుకుంటే కాపాడుకున్నంత చరిత్ర, లేకపోతే రాతి ఇటికెలో, కంకరో, రాతిపొడో మాత్రమే.

**-చకిలం వేణుగోపాలరావు**

డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)

m: 9866449348

e : venugopal.chakilam1@gmail.com

**- శ్రీరామోజు హరగోపాల్,**

m : 99494 98698

e: akshara25@gmail.com




# ఘనపురం కోటగుళ్ళ ఆలయ సముదాయాన్ని పునరుద్ధరించాలి

దక్కన్ ల్యాండ్ నవంబర్ 2024 సంచికలో ప్రచురించిన ఈమని శివనాగిరెడ్డి గారి వ్యాసం “ఒకప్పుడు నిత్య కళ్యాణం పచ్చతోరణం – నేడేమో చిన్నాభిన్నశిథిలావరణం” వ్యాసం అక్షర సత్యం. అక్టోబర్ 9, 10 తేదీల్లో వరంగల్ జిల్లా పర్యటనకు కుటుంబంతో వెళ్ళాను. అక్టోబర్ 9 న మొదట రామప్ప దేవాలయం, రామప్ప చెరువు చూసాము. ఆ తర్వాత రామప్ప దేవాలయానికి సుమారు 20–25 కిలోమీటర్ల దూరంలో ఘనపురం గ్రామంలో ఉన్న “కోట గుళ్ళు” అని ప్రజలు పిలుచుకుంటున్న గణపేశ్వరాలయ సముదాయాన్ని చూడటానికి వెళ్ళాము. శివనాగిరెడ్డి గారు చెప్పినట్టు అచ్చం రామప్ప దేవాలయాన్ని పోలి ఉన్న ప్రధాన గణపేశ్వరాలయం, దాని చుట్టూ 19 చిన్నచిన్న గుడులు, ఎడమ వైపున అదే పద్ధతిలో నిర్మించిన మరో చిన్న ఆలయం చూపరులను ఆకట్టుకుంటాయి. అయితే అవన్నీ శిథిలావస్థలో కునారిల్లుతున్నాయి. కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడు నిర్మించిన ఈ ఆలయ సముదాయం రామప్ప దేవాలయంతో పోలిస్తే ఏ మాత్రం వెనుకబడి లేదు. అద్భుతమైన ఆలయం వాస్తు వైవిధ్యంతో, శిల్ప సంపదతో కనువిందు చేస్తాయి. రామప్ప దేవాలయాన్ని కాపాడిన పాలకులు/ జిల్లా నాయకులు/శిల్ప కళారాధకులు/ ప్రజలు కోటగుళ్ళు ఆలయ సముదాయాన్ని విస్మరించడం దారుణం.



అక్కడ ప్రధాన దేవాలయంలో ఇంకా పూజా పునస్కారాలు కొనసాగుతుండడం చూసాము. పూజలు రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నట్టు పూజారి చెప్పినాడు. ప్రధాన ఆలయం కూడా శిథిలావస్థలో ఉన్నప్పటికీ కొంత మంది దాతల సహకారంతో మరమ్మతులు జరిగి పూజా పునస్కారాలు జరుపుకోవడానికి అనుకూలంగా మారింది. ఈ కోట గుళ్ళు ఆలయ సముదాయం దుర్భర పరిస్థితిని చూసిన తర్వాత తీవ్రమైన ఆవేదన కలిగింది. కోటగుళ్ళ పునరుద్ధరణ కోసం రెండుసార్లు ప్రారంభోత్సవాలు జరిగినట్టుగా ఆలయ ప్రాంగణంలో ఉన్నరెండు శిలాఫలకాలు తెలియజేస్తున్నాయి. ఒకటి 2009 లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆనం రాంనారాయణ రెడ్డి గారు వేసింది. రెండవది తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 లో ఆనాటి అసెంబ్లీ స్పీకర్, ఇప్పుడు శాసన మండలి సభ్యులు శ్రీ మధుసూదనాచారి గారు వేసింది. ఈ రెండు సందర్భాలలో కూడా శిలాఫలకాలు వేయడంతో అయిపోయింది తప్ప ఆలయ సముదాయం పునరుద్ధరణ మాత్రం జరగలేదు. “కోటగుళ్ళ సముదాయం పునరుద్ధరణ విషయంలో కేసిఆర్ ప్రభుత్వం మీద మాకు ఆశ ఉండింది. కానీ వారు కూడా శిలాఫలకంతోనే సరిపెట్టుకున్నారు” అని ఆలయ పూజారి వాపోయాడు. ఏది ఏమైనా అద్భుతమైన కోటగుళ్ళ ఆలయ సముదాయం ఈ రకంగా అందరి నిర్లక్ష్యానికి గురికావడం శోచనీయం అని చెప్పక తప్పదు. భారతీయులకు చారిత్రిక సంపదను పరిరక్షించుకోవడం పట్ల నిర్లక్ష్యం ఏ విధంగా ఉంటుందో ఎక్కడకు పోయినా కనిపిస్తాయి. కోటగుళ్ళ అందుకు ప్రబలమైన సాక్ష్యం. అయిదారేళ్ల క్రితం చూసిన రామప్ప దేవాలయ పరిసరాలు యునెస్కో గుర్తింపు వచ్చిన తర్వాత సుందరంగా మారినాయి. సౌకర్యాలు మెరుగుపడినాయి. పర్యాటకుల సంఖ్య కూడా పెరిగింది. ఇది సంతోషించదగిన అంశం. అయితే పర్యాటకులకు మంచి భోజన హోటల్ మాత్రం అక్కడ లేదు. భోజన సౌకర్యం మెరుగుపడేందుకు టూరిజం శాఖ చర్యలు తీసుకోవాలి. కోటగుళ్ళ శిథిలావస్థను అందరి దృష్టికి తీసుకువచ్చిన మిత్రులు ఈమని శివనాగిరెడ్డి గారికి అభినందనలు.

ఆదిలాబాద్ జిల్లా గోండుల గుసాడి నృత్య విశేషాలను సమగ్రంగా తెలియజెప్పిన చరిత్రకారులు ద్యావనపల్లి సత్యనారాయణ గారికి కూడా అభినందనలు.

– శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే,
m : 94910 60585
e : deshpandesri@gmail.com

# సురపురం రాజా వెంకటప్పనాయక్

**1857** మార్చి నెలలో ఉత్తర భారత దేశంలో ప్రారంభమైన సిపాయిల తిరుగుబాటు కొంచెం ఆలస్యంగా జూన్ నెలలో హైద్రాబాద్ దక్కన్‌కు కూడా వ్యాపించింది. హైద్రాబాద్ పట్నంలో అదే జూన్ నెలలో తుర్రేబాజ్‌ఖాన్, సయ్యద్ మౌల్వీ అల్లా ఉద్దీన్‌ల నాయకత్వంలో తిరుగుబాటు తలెత్తింది. కోఠీలో ఉన్న రెసిడెంట్ భవనంపై దాడి జరిగింది. భీకరమైన పోరు జరిగినా ఆ తిరుగుబాటు విఫలమైంది. ఆ నాయకులిద్దరూ తప్పించుకొని పారిపోయినా తిరిగి అరెస్టు చేశారు. తుర్రేబాజ్ ఖాన్‌ను తూప్రాన్‌లో పట్టుకొని చంపివేసి కోఠిలోని పుత్లీబౌలి చౌరస్తాలో రోజుల తరబడి అతని శవాన్ని అట్లనే వ్రేలాడదీశారు. మౌల్వీ అల్లా ఉద్దీన్ మాత్రం అండమాన్ జైలుకు పంపారు. అక్కడ అతను 26 సంవత్సరాల పాటు నరక ప్రాయమైన జీవితాన్ని గడిపి 1884లో అక్కడనే మరణించాడు.



రాజా వెంకటప్ప నాయక్

ఈ ఇద్దరు అమరవీరుల్ని హైద్రాబాద్ నగరం ఎప్పుడూ మరిచిపోదు. 1857లో అటు ఉత్తర భారతదేశంలోనూ ఇటు హైద్రాబాద్ దక్కన్‌లోనూ సిపాయి తిరుగుబాట్లు జరుగుతున్న సందర్భంలోనే సురపురం రాజా వెంకటప్ప నాయక్ కూడా తిరుగుబాటు బావుటాను ఎగురవేశాడు. అది మరొక అమరగాథ.

ఆనాటి నైజాం “హైద్రాబాద్ రాజ్యంలో సురపురం ఒక సంస్థానం. ఇది రాయచూర్ ‘సుబా’లో కృష్ణానది తీరాన వెలిసిన సంస్థానం. గద్వాల, వనపర్తి సంస్థానాధీశుల మాదిరిగానే సురపురం రాజాకూడా ప్రతి ఏటా నిజాంకు కప్పం చెల్లించేవాడు. ఆ సంస్థానంలో మెజార్టీ ప్రజలు ‘బేదర్’ కులస్థులు. వీరిది పౌరుషం గల జాతి. ఎవరికీ తలవంచని జాతి. తిరుగుబాటు ప్రారంభమయ్యే నాటికి సురపురం రాజా వెంకటప్ప నాయక్‌కు సరిగ్గా ఇరవై నాలుగేండ్ల వయస్సు.

రాజాకు ఏడేండ్ల వయస్సులోనే ‘పితృయోగం’ సంభవించింది. అతను మైనర్, ఆ పరిస్థితులలో హైద్రాబాద్‌లో ఉన్న బ్రిటిష్ రెసిడెంటు “ఫిలిఫ్స్ మెడాస్ టేలర్”ను సురపురం సంస్థానానికి రాజకీయ పరిపాలకుడిగా మైనర్ రాజుకు “సంరక్షకుడి”గా నియమించాడు. దానికి నిజాం రాజు ఆమోదముద్ర కూడా లభించింది. మేడాస్ టేలర్ సమర్థవంతమైన పరిపాలకుడే గాక చక్కటి చిత్రకారుడు మరియు రచయిత. ఆనాటి హైద్రాబాద్ రాజ్యం, ప్రజల స్థితిగతుల్ని తన జీవిత చరిత్ర, నవలల ద్వారా గ్రంథస్తం చేశాడు. అతను నిజమైన ప్రజాసేవకుడు. ప్రజలను మనసావాచా ప్రేమించిన వాడు.

టేలర్ సురపురం అధికారిగా సంస్థానాన్ని చక్కగా పరిపాలించాడు. మైనర్ రాజాకు నిజమైన పోషకుడిగా, సంరక్షకుడిగానిలిచి తండ్రి ప్రేమను అందించాడు. వీరిద్దరి మధ్య తండ్రికొడుకుల సంబంధమే పెనవేసుకుంది. కృష్ణదేవరాయల వారికి తిమ్మరుసుకు మధ్య వున్న సంబంధమే వారిరువురి సంబంధం.

1843 నుండి 1853 వరకూ టేలర్ సుపురాన్ని సుభిక్షంగా ఒక తండ్రిలా పరిపాలించాడు. ప్రజలకు ఉపయుక్తమైన అనేక ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేశాడు. రాజ్యం శాంతి భద్రతలతో చల్లగా వర్థిల్లింది. ప్రజలు సుఖశాంతులతో జీవించారు.

1853లో రాజా వెంకటప్పనాయక్‌కు మైనార్టీ తీరింది. రాజకుమారునికి రాజ్యాన్ని అప్పగిస్తూ గవర్నర్ జనరల్ లార్డ్ డల్హౌసీ ఒక ఉత్తర్వును హైద్రాబాద్‌లో ఉన్న రెసిడెంటుకు జారీ చేశాడు. దాని ప్రకారంగానే టేలర్ స్వయంగా తన చేతులతో అతనికి పట్టాభిషేకం చేసి స్వర్ణఖచిత సింహాసనంపై అధిష్టింప చేశాడు. ఆ రోజు సురపురం సంస్థానంలో ఉత్సవ సౌరంభం ఇంతా అంతా కాదు. సంబరాలు అంబరాన్ని అందుకున్నాయి. మూడు రోజులు రాత్రింబవళ్లు, ఉత్సవాలు జరిగాయి.

పట్టాభిషేకం మహోత్సవాన్ని చూడటానికి వివిధ స్థాయిలకు చెందిన ప్రజలు చాలా మంది వచ్చారు. అతిథులందరికీ అత్తరులను పూసి మెడలో పూలదండలు వేశారు. అందరికీ వస్త్రాలు దక్షిణ ఇచ్చారు. పండ్లు తాంబులాలు పంచారు. బ్రాహ్మణులకు సత్కారాలు చేశారు. విందులు గోవిందులు రెండు రోజులపాటు సాగినై. రాజ బంధువులందరికీ తలపాగాలు, ఉత్తరీయాలు బహుమతులుగా ఇచ్చారు. వారి విడిది కోసం ఊరంతా రంగు రంగుల దేరాలతో గుడారాలు వెలిసినై. మేళతాళాలు పెట్టారు. కొమ్ములు, బూరాలు ఊదారు. గాలిలో తుపాకులు పేల్చారు.

పట్టాభిషేకం జరిగిన ఆ రాత్రి రంజుగా రాణించింది. చెట్లన్నింటికీ కాగడాలను కట్టారు. రంగురంగుల దీపాలతో చెట్ల కొమ్మలను అలంకరించారు. ప్రక్కన మైదానంలో అంబరాన్ని చుంబించే బాణాసంచా ప్రదర్శనలు సరేసరి. రెండు వందల పటాకులతో ఆకాశంలోకి ఎగిరి పూలు ఈనే బాణాసంచా

ప్రత్యేకంగా అందరినీ ఆకర్షించింది. ఆ రాత్రంతా చెట్ల క్రింద రాయచూరు, గుల్బర్గా, బీజాపూర్‌నుండి వచ్చిన భోగంమేళాల ఆటపాటల నృత్యాలు జరిగాయి.

ఆ విధంగా సురపురం రాజా వెంకటప్ప నాయక్ 1853లో అధికారం చేపట్టినాడు. ఆ తర్వాత బ్రిటిష్ రెసిడెంటుగారు మెడాస్ టేలర్‌కు పదోన్నతి కల్పించి 'బిరార్'కు తబాదలా (ట్రాన్స్‌ఫర్) చేశాడు.

ఆ వార్త వినగానే రాజా వెంకటప్ప నాయక్ ఆనందమంతా ఆవిరైపోయింది. తన హోదా దర్పం అన్నీ మరిచి తనే స్వయంగా టేలర్ నివాసానికి వెళ్లాడు. టేలర్ కనబడగానే గట్టిగా కౌగలించుకుని "అప్పా మీరు నిజంగానే వెళ్లిపోతారా? మీ మార్గదర్శకత్వం, మీ సలహాలు లేకుండా ఈ రాజ్యభారాన్ని నేను నిర్వహించగలనా? మీరు లేకుండా నేను ప్రజలకు ఎటువంటి మంచి పనులు చేయలేను. నన్ను విడిచి వెళ్లకండి అప్పా" అని కండ్లనిండా నీళ్లు నింపుకున్నాడు.

"లేదు రాజా నేనొక మామూలు ప్రభుత్వ అధికారిని. మా అధికారులు ఎక్కడికి వెళ్లమంటే అక్కడికి వెళ్లి ఉద్యోగం చేయాలి. తప్పదు, అయినా జాగ్రత్తగా వ్యవహరిస్తే మీరు మంచిరాజుగా, పరిపాలకులుగా మన్ననలు పొందుతారు" అన్నాడు టేలర్.

"అప్పా నేను మళ్లీ చిన్న పిల్లవాడిగా మారితే ఎంత బాగుంటుంది! మీరు నన్ను ఎత్తుకుంటారు. ఒడిలో కూచో బెట్టుకుంటారు. కథలు చెబుతారు. మళ్లీ ఆ రోజులు రావు కదా. ఎందుకొచ్చిన ఈ రాజ్యభారం ఈ ముళ్లకిరీటాలు?" వైరాగ్యంతో అన్నాడు రాజు

"బాధపడకు రాజా నేనక్కడికి వెళ్లినా నా మనస్సులో నువ్వే ఉంటావు. నీకు ఏం కష్టం వచ్చినా రెక్కలు కట్టుకొని వాలుతాను. "రా" అని ఒక్క అక్షరం రాస్తే చాలు" అన్నాడు టేలర్. "నేను మీ బిడ్డడనే సంగతి మరచిపోకండి అప్పా" అని టేలర్ కాళ్లకు దండం పెట్టినాడు రాజు. ఇద్దరి కండ్లల్లో కన్నీళ్లు జలజలారాలుతుండగా టేలర్ తన అధికార నివాసానికి చేరుకున్నాడు.

కాల వాహిని అలల వాలున కాల చక్రం గిరగిరా నాలుగేళ్లు తిరిగి 1857లోకి ప్రవేశించింది. తుర్రేబాజ్‌కాన్, సయ్యద్ మౌల్వీ అల్లా ఉద్దీన్‌ల తిరుగుబాటు ఉప్పెనతో హైద్రాబాద్ నగరం అల్లకల్లోలానికి గురై అప్పుడప్పుడే చల్లబడుతున్నది. హైద్రాబాద్ నగరంలోని తన నివాసంలో "దివాన్‌ఖానా"లో కూచొని టేలర్ మరాఠీ భాషలో తన ఆత్మకథ రాసుకుంటున్నాడు.

ఇంతలో ఒక చప్రాసీ లోపలికి వచ్చి వొంగివొంగి మూడుసార్లు సలాం చేశాడు.

"రాస్తున్న పెన్నును ఆపి ఏమిటి సంగతి అన్నట్లు కళ్ళద్దాల నుండి చూశాడు.

"హుజూర్! ఆప్‌కే లియే లష్కర్ ఖైద్‌ఖానాసే జైలర్ సాబ్ ఆయే హైఁ" అన్నాడు వినయంగా.

"పేష్ కరో"

తలమీద రూమీ టోపీ తీసి చంకలో పెట్టుకున్న "జైలర్" గదిలోకి వినయంగా వచ్చి వొంగి వొంగి సలాములు చేశాడు.

"క్యాబాత్ హై"

"జైల్లో మిమ్మల్ని కలవటానికి ఓ ఖైదీ ఎదురు చూస్తున్నాడు. అతడి చివరి కోరిక అదొక్కటే".

"వాట్! ఏ ఖైదీ ఫర్ మీ!!" ఆశ్చర్యంతో అడిగాడు టేలర్.

"యస్ సార్!"

"హూ ఈజ్ హీ?"

"జీ హుజూర్! హిజ్ నేమ్ ఈజ్ రాజా వెంకటప్ప నాయక్"

"వ్వాట్? ఆర్యూ మాడ్?" కోపంతో వొణికాడు టేలర్.

"సారీ సర్! హి ఈజ్ ఇన్ ది ప్రిజన్"

"ఓ మై గాడ్!" రెండు చేతులతో తల పట్టుకుని టేబుల్‌పై వాలిపోయాడు టేలర్.

"మై సన్. మై సన్" అని రోదిస్తున్నాడు.

× × ×

జైలు గదిలోకి టేలర్ అడుగు పెట్టగానే 'అప్పా' అని గట్టిగా కావలించుకుని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు రాజా వెంకటప్ప నాయక్. దారి తప్పిన పిల్లవాడు తండ్రిని కలుసుకుని దుఃఖిస్తున్నట్లే ఉంది. తన ఒడిలో ఆడుకున్న పిల్లవాడు, తన ఒడిలో ఓనమాలు దిద్దిన పిల్లవాడు. తను పెంచి పెద్ద చేసిన లేత చిన్నారి కొమ్మ రత్నఖచిత సింహాసనం నుండి కింద పడి దుమ్ముధూళి పేరుకున్న ఈ చీకటి గదిలో ఒంటరిగా..

దుఃఖాన్ని బలవంతంగా నిగ్రహించుకున్నాడు టేలర్.

రాజా వెంకటప్ప నాయక్ గద్గదస్వరంతో సురపురంలో ఏం జరిగిందో వివరించాడు. ఆ సంగతులన్ని ఓపికగా విన్నాడు టేలర్.

ఒకప్పుడు సురపురం మరాఠాల కింద ఉన్న సామంత రాజ్యం. ఆ తర్వాత బ్రిటిష్ అధినంలోకి వెళ్లింది. 1857 తిరుగుబాటు సందర్భంగా బ్రిటిష్ వారి నుండి స్వతంత్రం పొందాలని ఆలోచన చేశాడు రాజు వెంకటప్ప నాయక్. అట్లనే హైద్రాబాద్ సంస్థానం పెత్తనం నుండి కూడా విముక్తి పొందొచ్చని ఆశపడ్డాడు. దానికి తోడు నానా సాహెబ్, రాయచూర్ జమీందార్లు కూడా అతనిని ప్రోత్సహించి గెలిచిన తర్వాత సురపురం నుండి రామేశ్వరం వరకూ దక్షిణ మహారాష్ట్ర రాజ్యానికి రాజును చేస్తామని ప్రలోభపెట్టారు.

ధైర్యం చేసిన రాజు చివరికి తిరుగుబాటు బావుటా లేవనెత్తాడు. కాని ఏం ఫాయిదా? ఆ భగావత్ విఫలమయ్యింది. హైద్రాబాద్ నుండి వచ్చిన బ్రిటిష్ ఫౌజ్ సురపురాన్ని దిగ్బంధనం చేసింది. పెద్ద ఎత్తున ఆస్తినష్టం ప్రాణనష్టం జరిగి బలగాలన్ని చెల్లాచెదురైన తర్వాత రాజు ఒంటరిగా మిగిలిపోయాడు. బయటి నుండి 'సహాయం' వాగ్దానాలకే పరిమితమయింది తప్ప ఎవరూ

ముందుకు రాలేదు. అటువంటి క్లిష్ట సమయంలో సురపురం నుండి సైన్య దిగ్బంధనాన్ని ఛేదించుకుని తన ఒకప్పటి సంరక్షకుడు, తండ్రిలాంటి వాడైన “టేలర్”ను కలుసుకుని సలహా తీసుకుందామని హైద్రాబాద్ నగరానికి రహస్యంగా చేరుకున్నాడు.

రాజా నగరానికి రాగానే ముందు రెసిడెన్సీ బజారుకు వెళ్లి టేలర్ కోసం విచారించగా ఆయన దౌరాకు (క్యాంపుకు) వెళ్లాడని ఒకటి రెండు రోజులలో రావచ్చని సమాచారం తెలిసింది. నిరీక్షించటం తప్ప మరో మార్గం లేదు కావున కాశీ యాత్ర ముగించుకొని వస్తున్న ఒక హిందూ “ముసాఫిర్” లాగ వేషం మార్చుకొని మారువేషంలో నగర సంచారానికి బయలుదేరాడు.

ఆ సాయంత్రం ఒక అంజాన్ ‘ముసాఫిర్’ లాగానే నడుచుకుంటూ మక్కామసీద్‌ను, చార్మినార్‌ను సందర్శించాడు. కాసేపు విశ్రమించడానికి చార్మినార్ చబూత్రా మీద కూచున్నాడు.


మెడాస్ టేలర్

కాలం కలిసిరానపుడు పచ్చికట్టెకూడా పామై కరుస్తుంది.

“కుఫియాలు” నలమూలల్నుండి చుట్టుముట్టి ఆ సురపురం రాజాను ‘గిరఫ్తార్’ చేసి లష్కర్‌లో ఉన్న తిర్మల్‌గిరి ఖైద్‌ఖానాకు తరలించారు.

కేసు విచారణలో వుంది.

× × ×

అంతా సావధానంగా విన్న టేలర్ “రాజా రెసిడెంటు గారిని కలుస్తావా?” అని అడిగాడు.

“లేదప్పా! నేను కలువను. నాకు ఇష్టం కూడా లేదు. నేను ప్రాణభిక్షకోసం క్షమాభిక్ష కోసం ప్రార్థించాలని ఆయన ఆశిస్తాడు. ఎంతైనా నేను మీ పెంపకంలో పెరిగాను. నా ఆత్మగౌరవానికి వ్యతిరేకంగా నేను వెళ్లను. మరణదండనైనా స్వీకరిస్తాను గాని పిరికివాడిగా మాత్రం బకతలేను.

“సరే రాజా! కనీసం కోర్టు విచారణలోనైనా అన్ని సంగతులు ధైర్యంగా చెప్పు. న్యాయం భగవంతుడికే వదిలేద్దాం.”

“నాకు సంబంధించినవి మాత్రము చెప్పగలను అప్పా! నాకు సహకరించిన వారి పేర్లు చెప్పి వారిని మోసం చేయలేను. నన్ను ఉసిగొల్పిన వారి పేర్లు కూడా చెప్పను”.

“నీకు ఇంగ్లీషు వాళ్ల మీద అంత కోపమెందుకు రాజా నేనూ ఇంగ్లీషు వాడినే కదా?”

అప్పా! తండ్రి ప్రేమ ఏమిటో తెలియని అభాగ్యుణ్ణి నేను. మీరే నాకు తండ్రి లాంటి వారు. మీతో అబద్ధం చెపుతానా? నాకు వ్యక్తిగతంగా ఎవరి మీదా కోపం లేదు. ఇంగ్లీషువారి పెత్తనం మీదే నా కోపమంతా.

టేలర్ ఒడిలో తలపెట్టుకుని ప్రశాంతంగా పడుకున్నాడు రాజా. మళ్ళీ చిన్ననాటి సురపురం రోజులు వచ్చినట్టనిపించింది ఇద్దరికీ. రాజా వీపును ప్రేమగా నిమురుతున్నాడు... తండ్రి.

“అప్పా! నాకు మీరొక సహాయం చేస్తారా” తలెత్తకుండానే చిన్న పిల్లాడిలా గోముగా అడిగాడు.

“ఏంటదీ?”

“ఎట్లాగూ నాకు మరణదండన శిక్షనే విధిస్తారు. దానికి నేను సిద్ధమే. భయపడనుగాని ఉరి మాత్రం తీయొద్దని చెప్పండి. దొంగలను బందిపోట్లను ఉరితీసినట్లు నన్ను ఉరితియ్యొద్దు. మరణంలో కూడా నేను గౌరవాన్నే కోరుకుంటాను. అయినా నేనేమంత పాపం చేశాను? దేశం కోసం పోరాడటం పాపమా? దేశభక్తి ఉండటం నేరమా?”

“లేదు బేటా. నువ్వేమీ తప్పు పని చేయలేదు.” టేలర్ కంఠం వొణికింది. కన్నీళ్లు జలజలా రాలి తల మీద పడ్డాయి.

“నన్ను ఫిరంగి మూతికి కట్టిపడేసి పేల్చివేసినా నేను బయపడను అప్పా. కాని నన్ను ఉరి మాత్రం తీయొద్దు. అట్లనే జైలు శిక్ష కూడా నాకు ఇష్టం లేదు. రాజుగా బ్రతికిన నేను ప్రతిక్షణం కృంగి కృశించి మరణించడం కంటె ఫిరంగి మూతికి కట్టి పేల్చేసినా ఫరవాలేదు.”

సున్నితంగా తన చేత్తో అతడి పెదాలను మూశాడు టేలర్.

టేలర్ వెళ్లడానికి లేచి నిలబడగానే రాజా అతని పాదాలకు ప్రణామం చేశాడు.

× × ×

కోర్టు విచారణ ముగిసింది. ముందు ఉరిశిక్ష ఖాయం చేశారు. కాని మెడాస్ టేలర్ జోక్యం వలన చెంగల్‌పట్టు కోటలో ఆ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వచ్చింది. ఆ తీర్పును యావజ్జీవ శిక్షగా మార్చి, రాజాను హైద్రాబాద్ నుంచి మద్రాస్‌కు తరలిస్తుంటే శంషాబాద్ ప్రాంతంలో సైనికులు కొంతసేపు విశ్రాంతి కోసం ఆగారు. ఒక సైనికుడు తన బెల్టుకు ఉన్న పిస్టల్‌ను చెట్టుకింద పెట్టి స్నానానికి పక్కకు వెళ్ళగానే రాజా ఆ పిస్టల్‌ను చేతిలోకి తీసుకుని కణతకు గురి పెట్టుకుని పేల్చుకున్నాడు.

సరిగ్గా ఆ రోజుకు అతనికి ఇరవై నాలుగు సంవత్సరాలు నిండాయి. ఒక రోజు కూడా అటూ ఇటూ తేడా లేదు.

నాలుగు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన సురపురం సంస్థానం నైజాం రాజ్యంలో 1861లో విలీనం అయ్యింది.

–పరవస్తు లోకేశ్వర్, m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com







# అది గోన బుద్ధారెడ్డి కట్టించిన గుడి! ఒకప్పుడు వేదాలు వల్లించిన బడి!!

ఆ గుడిలో ఒకప్పుడుండేది నాలుగువేదాలు వల్లించిన బడి. అది నిత్య కళ్యాణం, పచ్చతోరణంలా వెలుగొందిన శివుని గుడి. గర్భాలయం, అర్ధమండపాలతో, ఎత్తైన శిఖరం, దానిపైన ధగధగలాడిన బంగారు కలశం. గర్భాలయం మధ్యలో చక్కటి శివలింగం, అర్ధమండపం మధ్యలో నంది వాహనం. కప్పు నుంచి వేలాడుతున్న గణగణ మోగే కంచుగంట. మహామండపం లేని ఏక కూటాలయం. ఇది ఒప్పటి మాట. ప్రస్తుత వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలం, బుద్ధారం అనే గ్రామంలో శిథిలావస్థలో ఉంది ఆ శివాలయం. ఇది ఇప్పటి మాట. నిజానికి ఆ వూరి పేరు బుద్ధవరం, గోనబుద్ధవరం. నాగర్‌కర్నూలు జిల్లా, బిజనేపల్లి మండలం, నందివడ్డమాను (వర్ధమానపురం) నుంచి పాలించి, **రంగనాథ రామాయణాన్ని** ద్విపదలో రాసిన గోనబుద్ధారెడ్డి క్రీ.శ.13వ శతాబ్దిలో కాదంబ నాగర శైలిలో నిర్మించిన చిన్నదైనా అందమైన గుడి.

నాకు ఈ ఆలయం ఫోటోలు పంపిన డా. బైరోజు శ్యాంసుందర్ ఇచ్చిన సమాచారం మేరకు, శేషాద్రిరమణ కవులు ఈ ఆలయాన్ని సందర్శించి, ఆ ఆలయంలో గోన బుద్ధారెడ్డి తన పేర బుద్ధేశ్వరున్ని ప్రతిష్టించి, గ్రామానికి గోనబుద్ధవరమనే పేరు పెట్టారని, ఇదే గ్రామానికి రామేశ్వరమనే పేరు కూడా ఉందని రాశారన్నారు. ఆలయ వాస్తు, ముమ్మాటికీ గోన బుద్ధారెడ్డి, తన రాజధాని వర్ధమానపురంలో నిర్మించిన ఆలయాల మాదిరిగానే ఉండటం గమనించాల్సిన విషయం.

శిఖరం పడిపోయిన ఈ ఆలయం కుడివైపు కప్పు, గోడ భాగాలు కూలిపోయాయి. అర్ధమండపం ముందున్న చక్కటి ద్వారశాఖలు ముందుకు వాలిపోయాయి. గర్భాలయంలోని శివలింగంపై ఉండాల్సిన పై భాగం కనిపించకుండా పోయి శివలింగం మొండిదైంది. ఆలయం ఎడమవైపున్న నాగదేవత, వీరుల శిల్పాలు, ముందున్న రెండు నందులు అలనాటి చరిత్రకు మిగిలి ఉన్న ఆనవాళ్లు, ఎవరో ఒక మహానుభావుడు ముందుకొచ్చి, పూనుకొని, గోన బుద్ధారెడ్డిని తలచుకొని, ఆలయాన్ని పునరుద్ధరిస్తాడని, మునుపటి వైభవాన్ని కలిగిస్తాడని ఆశిద్దాం. మానవ మాత్రులం, అంతకంటే ఏం చేయగలం?

(డా. బైరోజు శ్యాంసుందర్ గారికి కృతజ్ఞతలు)

–ఈమని శివనాగిరెడ్డి–స్థపతి
m : 9848598446
e : nagireddy@malaxmi.in

# 'డార్విన్ పీడకల'–పర్యావరణ విధ్వంసగాథ: ఒక మెటాఫర్

సురవరం ప్రతాపరెడ్డిగారు 'మామిడిపండు' గురించి వ్యాసం వెనకటికెప్పుడో రాశారు. ఆయన వ్యాసంలో మామిడి పుట్టు పూర్వోత్తరాలు, చరిత్ర, జాతిభేదాలు వ్యాప్తితో పాటు ఆర్థిక విషయాల గురించి ఆసక్తికరమైన విషయాలు తెలియజేశారు. మామిడి చెట్టు పెరగాలంటే ఎటువంటి నేలలు, ఏ శీతోష్ణస్థితిగతులు అవసరమో తెలియజేస్తూ మరికొంత ఆసక్తిని కలిగించే ఉదంతం కూడా రాశారు. "ఇంగ్లండు చలి ప్రదేశమగుట చేత అచ్చట దీనిని నాటినను పెరుగదు. విక్టోరియా రాణి కాలములో రాజబంధు వొకడు ఇండియా నుండి ఎర్రటిమన్ను బండ్ల కొలది తెప్పించి తన భూమి మన్ను తీసివేసి యీ మన్నును నింపి మామిడి నాటెను. దానికి చలి తగలకుండ విద్యుద్దీపమును తగినంత సప్లయి చేయించెను. ఆరేండ్లకు పెరిగి ఆరు కాయలు కాసెనట. వాటిని విక్టోరియా రాణికి కానుకగా నియ్యకోసెనట. తర్వాత చెట్టెండిపోయెనట" ఒక వాతావరణంలో పెరిగే చెట్లు చేమలు, జీవులు దానికి భిన్నమైన పరిస్థితులలో పెరగవు అని అర్థమవుతుంది దీనిని బట్టి. ఒకవేళ పెరిగితే ఆ జీవి వల్ల పరిసరాలకు ఎంత నష్టం జరుగుతుందో ఇప్పుడు చూద్దాం.



నైల్ పెర్చ్ అనేది ఒక పెద్ద చేప. ఇది మంచినీటిలోనే పెరుగుతుంది. ఆరడుగులు పొడవు, నాలుగువందల పౌండ్ల బరువు వరకు పెరగగల సామర్థ్యం సహజంగానే దానికి ఉంటుంది. ఈ చేప సబ్ సహారా ప్రాంతంలోని నదులలో పెరుగుతుంది. నైలు నదిలోనే కాకుండా కాంగో, నిగర్ లాంటి ఇతర స్థానిక నదులలోనూ లేక్ చాడ్, ఇతర ప్రధాన పరీవాహకంలోనూ ఉంటుంది. అయితే తూర్పు ఆఫ్రికాలోని విక్టోరియా సరస్సులో కూడా అర్ధ శతాబ్దం క్రిందట పెరుగుతున్నట్లు గుర్తించారు. విక్టోరియా సరస్సుకు ఇది స్థానికం కాదు. ఒక ఆవరణ వ్యవస్థలో పెరిగే జీవన జలాలను మరొక ఆవరణ వ్యవస్థలోకి తీసుకురావటం వల్ల ఎటువంటి పర్యవసానాలు, పరిణామాలు తలెత్తుతాయో తెలుపటానికి దీనిని ఒక ఉదాహరణగా పేర్కొంటూ ఉంటారు. హ్యూబర్ట్ –సౌపర్ 'డార్విన్స్ నైట్‌మేర్' పేరిట అద్భుతమైన డాక్యుమెంటరీ కూడా తీశాడు. ఈ డాక్యుమెంటరీ ఆస్కార్‌కు కూడా నామినేట్ అయ్యింది. నైల్‌పెర్చ్ గురించి డాక్యుమెంటు తీశాక అది సృష్టించిన విధ్వంస తీవ్రత ప్రపంచానికి తెలిసొచ్చింది.



పరిమాణంలో అతిపెద్దది కావటం, బలం, దాని అత్యాశవల్ల ఏదైనా తింటుంది. తన సంతతిని కూడా వదలిపెట్టదు. ఇది ఇంచుమించు పదహారు సంవత్సరాలపాటు జీవిస్తుంది. కనుక అది సృష్టించే విధ్వంసం కూడా భారీగానే ఉంటుంది. ఈ నైల్ పెర్చ్‌ను వ్యాపార పంటగా వృద్ధిపరచటానికి విక్టోరియా సరస్సుకు తీసుకురాబడింది. ఎప్పుడైతే అది అక్కడికి చేర్చబడిందో ఆ సరస్సులో పెరిగే స్థానిక చేపలు ఇతర జలప్రాణులు అదృశ్యం కావటం మొదలైంది. అదొక్కటే కాదు అది సృష్టించిన సామాజిక, ఆర్థిక విధ్వంసం కూడా తక్కువేమీ కాదు. భారీ స్థాయిలో నైల్ పెర్చ్‌ను పెంచి అదే స్థాయి వాటిని పట్టేందుకు నిర్వహించే పనులవల్ల స్థానిక మత్స్యకారులు తమ సంప్రదాయ జీవనోపాధిని కోల్పోవలసి వచ్చింది. ఎగుమతుల కోసం ఉద్దేశించటం వల్ల అక్కడి మత్స్య వ్యాపారులు దెబ్బతిన్నారు. ఆ సరస్సు ఒడ్డున ఉండే మత్స్యకార్మికుల సంఖ్య పెరిగింది. ఆయా ఒడ్డున ఉండే పట్టణాలలోని కార్మికులకు ప్రాథమిక సేవలైన నీరు, విద్యుచ్ఛక్తి లాంటివి కూడా తక్కువయ్యాయి. స్థానికులు కొత్తగా వచ్చిన పట్టణ సంస్కృతి, నగదు మార్పిడి ఆర్థిక విధానాలకు అంత త్వరగా అలవాటు పడలేక పనిని వెతుక్కుంటూ తమ ఇళ్లను వదిలి పెట్టారు. వేశ్యావృత్తి పెరిగింది. ఎయిడ్స్ ప్రబలింది. మాదక ద్రవ్యాల వినియోగం కూడా విపరీతంగా అధికమైపోయింది.

ఇదిలా ఉంటే ఈ నైల్ పెర్చ్‌ను సంప్రదాయ బద్ధమైన సూర్యరశ్మిలో ఎండబెట్టడం సాధ్యం కాదు. అది ఎండదు. దానిని కట్టెలు మండించి ఎండబెట్టి భద్రపరచవలసి వచ్చింది. ఫలితంగా ఆ ప్రాంతంలో వంటచెరుకు కూడా తీవ్రస్థాయిలో తగ్గిపోయింది.

ప్రపంచమంతటా తాత్కాలిక లాభాల కొరకు ఎన్నో విధాలుగా ఇటువంటి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. రాజ్యసార్వభౌమత్వం ప్రైవేట్ యాజమాన్యాలు డబ్బుతో ముడివడి సాగించే లావాదేవీల వల్ల పెద్ద మొత్తంలో లాభాలు కొద్ది మందికి అందుతున్నాయి. మరోవైపు స్థానిక సమూహాలకు, పర్యావరణానికి హాని జరుగుతూనే ఉన్నది. రాజ్యం, పెట్టుబడిదారీ యాజమాన్యాలు ముఖ్యంగా ట్రాన్స్‌నేషనల్ కార్పొరేషన్స్ ఇటువంటి వైఖరులను బైటపెడుతూనే ఉన్నాయి. ఏదో ఒక విధంగా బయట పడుతూనే ఉన్నాయి. చిన్న చేపను

పెద్ద చేపలు మింగినట్లుగా ఈ వ్యవహారమంతా నడుస్తూనే ఉంది మన కళ్లముందు.

ప్రపంచం మొత్తం మీదా ఆహార కొరత, వ్యాధులు, అధిక జనాభా పెరుగుదలలు జరుగుతున్నాయి. తాత్కాలిక ఆర్థిక లాభాలు లేదా ఇతర మానవ కార్యకలాపాలు మొదలైనవి ఆర్థిక అంతరాలను పర్యావరణ క్షీణతను పెంచటంలో కీలక పాత్రను పోషిస్తూ ఉన్నాయి. నైల్‌సెర్చ్ రాక్షస భక్షకి లాగా తాను ప్రవేశించిన కొత్త ఆవరణ వ్యవస్థను తుడిచి పెట్టింది. లేక్ విక్టోరియాలో ఇంకేమీ మిగలకపోతే తనని తానే భక్షిస్తుందంటే అతిశయోక్తేమీ లేదు. మానవ నాగరికత ఉన్నతోన్నత జీవన రూపాలు భూమండలం నుండి తుడిచిపెట్టుకుపోయే పరిస్థితిలో మనమున్నాం. కాలాంతరంలో ఈ తక్షణ లాభాలు తవ్విపోసుకోవటం విధ్వంసం పూరిత చర్యలను మానుకోకపోతే, ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలు నైల్‌సెర్చ్‌లాగా ప్రపంచంలోని బహు ప్రాంతాలను సంస్కృతి, నాగరికతలను మటుమాయం చేయటం ఖాయం. దీనికి విరుగుడు ఏమిటంటే ముందుగా ఈ వ్యవస్థ ఎలా వచ్చిందనేది అర్థం చేసుకోవాలి. ఆధునికత కోసం పదిహేడవ శతాబ్దం నుండి ప్రకృతి నుంచి పిండేయటమనే ధోరణి వచ్చింది. పారిశ్రామిక యుగం దానిని బలపరిచింది. ఒక యాంత్రిక, భౌతిక దృష్టి ఆవరించింది. ఈ దృష్టి పథం మారవలసి ఉంది. తనకు సరిపడని నేలలో బలవంతంగా నాటిన మామిడి చెట్టు కేవలం ఆరుకాయలను మాత్రమే ఇచ్చి తనువు చాలించింది. అంతే తప్ప అది కలిగించిన హాని ఏమీ లేదు. కానీ, నైల్ సెర్చ్ వల్ల జరిగిన నష్టం అంతాయింతా కాదు.



తేటనీటిలో జీవించే నైల్‌సెర్చ్‌కు అనేక పేర్లున్నాయి. ఆఫ్రికన్ స్నూక్, గోలియల్‌సెర్చ్, ఆఫ్రికన్ బరాముండి, గోలియర్ బారాముండి లాంటి పేర్లతో పిలుస్తారు. విక్టోరియా సరస్సుకు తీసుకు రావడంతో విక్టోరియా సెర్చ్ అనే పిలవబడింది. కాంగో, నైల్, సెనెగల్, నిగర్ లేక్‌చాప్, వోల్టా, లేక్ తుర్కానా ఇతర నదీ బేసిన్లలో ఇది స్థానికం. తూర్పు ఆఫ్రికాలో ఆర్థిక, ఆహార భద్రత అనే రెండు కారణాల వల్ల పెంచబడింది. విక్టోరియా సెర్చ్ అనేది తప్పుదోవ పట్టించే వాణిజ్య నామం. హౌసా భాషలో గివాన్ రువా అంటారు. అంటే దీనర్థం 'నీటి ఏనుగు' అని నైల్ సెర్చ్ విధ్వంసమే కాదు పలు వివాదాలను కూడా సృష్టించింది. విక్టోరియా సరస్సు ఆవరణ వ్యవస్థను కాపాడాలని వాదించారు కొందరు. ఈ చేపకున్న ప్రాధాన్యం, ప్రాంతీయ ఆర్థికాలకు, పేదరిక నిర్మూలనకూ దీని పెంపకం అవసరమనే వాదం బలంగానే సాగింది. దీనిని ఎగుమతి కారణంగా స్థానికంగా చేపలు పట్టే మత్స్యకారులు కుటుంబాలలోని పిల్లలకు చేపల వల్ల అందే ప్రొటీన్ లోపం, పోషకాహార లోపాలు ఏర్పడి వారి ఎదుగుదలను దెబ్బతీశాయని తేలింది. మత్స్యకారుల కుటుంబాలకు చెందిన పిల్లల్లో 40.2% ఎదుగుదల నిలిచిపోయిందని ఒక అధ్యయనం తేల్చింది. అది సరస్సుకు సమీపాన ఉన్న కుటుంబాల్లోని పిల్లల పౌష్టికాహార లోటు, సరస్సుకు దూరంగా వ్యవసాయ భూముల్లో ఉన్న కుటుంబాల పిల్లల్లో కంటే తక్కువగానే ఉన్నట్లు తేలింది. తల్లుల్లో దీర్ఘకాలంగా 5.7% మేరకు పౌష్టికలోపం ఉందన్నదీ ఒక అధ్యయనం.

విక్టోరియా సరస్సుకు సరిహద్దులలో ఉన్న ఉగాండా, కెన్యా, టాంజానియా దేశాలు నెల్‌సెర్చ్ ఎగుమతుల మీద సుంకం విధించాలనే నిర్ణయాన్ని అంగీకరించాయి. నైల్‌సెర్చ్ వల్ల జరిగిన విధ్వంసాలను నివారించటానికి మరికొన్ని మార్గాలలో చర్యలనూ చేపట్టాయి. ముఖ్యంగా స్థానిక సమాజాలు స్థిరంగా ఉండటానికి మత్స్యకారులు, స్థానిక మత్స్యపరిశ్రమ ఉపయోగ పడాలని ఆశించాయి. విషాదం ఏమంటే పన్ను విధింపుకు అంగీకరించాయి. కానీ అమలుకు నోచుకోలేదు.

1954లో లేక్ విక్టోరియాలోకి ప్రవేశపెట్టబడిన నైల్ సెర్చ్ పర్యావరణ విధ్వంసాలకు ఒక 'మెటాఫర్'గా పేర్కొంటు ఉంటారు పర్యావరణవేత్తలు, మన పరిసరాలలో ఉన్న జీవరాశులు ఏవి? బయటనుంచి ప్రవేశపెట్టబడినవి ఏవి? అనే వాటి పట్ల కనీస అవగాహన అవసరం.


- డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# జన్యు నియంత్రణలో గేమ్ ఛేంజర్ @మైక్రోఆర్ఎన్ఏ

*(మైక్రో ఆర్ఎన్ఏపై పరిశోధనకు గానూ, 2024వ సం॥రానికి ఫిజియాలజీ (లేదా) వైద్య శాస్త్ర విభాగంలో నోబెల్ బహుమతి వచ్చిన సందర్భంగా..)*

మానవ దేహం కణనిర్మితమన్న విషయం మనందరికీ తెలుసు. కణాల లోపల కేంద్రకం, కేంద్రకం లోపల మైటోకాండ్రియా, మైటోకాండ్రియా లోపల క్రోమోజోమ్‌లు చుట్టలుగా చుట్టుకొని ఉంటాయి. ఈ క్రోమోజోముల మెలికలను విడదీస్తే, అది మెలితిరిగిన నిచ్చెన ఆకారంలో ఉంటుంది. దానినే డీఎన్ఏ అంటారు. ఈ డీఎన్ఏ లోపల జన్యువులు ఉంటాయి. కణాలన్నీ కలిసి కణజాలాలుగానూ, కణజాలాలు అన్నీ కలిసి అవయవాలుగానూ ఏర్పడతాయి. అయితే ఈ అవయవాలు వాటికి నిర్దేశించిన విధులను మాత్రమే నిర్వర్తిస్తాయి. ఇలా వాటికి నిర్దేశించిన విధులను మాత్రమే నిర్వర్తించడానికి ప్రధాన కారణం వాటిలోని జన్యువులు, ఆ విధులను మాత్రమే నిర్వర్తించేటట్టుగా నియంత్రించబడడమని చెప్పవచ్చు. డీఎన్ఏలో భాగమైన మైక్రో ఆర్ఎన్ఏ (ఎంఐఆర్ఎన్ఏ అనే కణాంగం జన్యు నియంత్రణతో కీలకపాత్ర పోషిస్తుంది. ఈ ఎంఐఆర్ఎన్ఏ అన్న కణ విభాగంపై పరిశోధనకు గానూ అమెరికాకు చెందిన విక్టర్ ఆంబ్రోస్ మరియు గ్యారీ రువ్‌కున్‌లకు 2024 సం॥రానికి గానూ ఫిజియాలజీ (మెడిసిన్) విభాగంలో నోబెల్ బహుమతి లభించింది. ఈ నేపథ్యంలో మైక్రోఆర్ఎన్ఏ గురించి, జన్యు నియంత్రణ (Gene Regulation)లో దాని పాత్ర గురించి మనం కూడా తెలుసుకుందామా!!




### అసలు మైక్రో ఆర్ఎన్ఏ అంటే?

ముందే చెప్పుకున్నట్టు కణాలలో క్రోమోజోములు చుట్టలాగా మెలితిరిగి ఉంటాయి. ఈ క్రోమోజోముల మెలికలను విడదీస్తే అది మెలి తిరిగిన నిచ్చెన ఆకారంలో కనిపిస్తుంది. దానినే డీఎన్ఏ అంటారు. ఈ డీఎన్ఏలో రెండు పోచలు ఉంటాయి. ఇది ద్వికుండలి నిర్మాణంలో ఉంటుంది. ఈ డీఎన్ఏ నుండి **ట్రాన్స్ క్రిప్షన్** అన్న ప్రక్రియద్వారా ఆర్ఎన్ఏ తయారవుతుంది. ఆర్ఎన్ఏ నిర్మాణ పరంగా ఒకే పోచను (Single Stranded) కలిగి ఉంటుంది. ఈ ఆర్ఎన్ఏ శరీరంలో విభిన్న క్రియలు నిర్వర్తించడానికి అవసరమైన ప్రొటీన్లను తయారుచేయడానికి అవసరమైన నత్రజని క్షారతంతువులు (అడినైన్ (A), థైమీన్ (T), గ్వానిన్ (G) మరియు సైటోసిన్ (C))తో ఒక నిర్దిష్ట పద్ధతిలో అమరి ఉంటుంది. ఇలా అమరి ఉండడాన్ని కోడింగ్ అంటారు. ఈ విధంగా కోడింగ్ చేయబడిన ఆర్ఎన్ఏ నుండి **ట్రాన్స్‌లేషన్** అన్న ప్రక్రియ ద్వారా ప్రొటీన్లు తయారవుతాయి. అదే విధంగా అదే ఆర్ఎన్ఏలోని మిగిలిన భాగంలో ప్రొటీన్లు ఉత్పత్తి అయ్యేందుకు వీలుగా ఎలాంటి నత్రజని క్షారాల అమరికలు ఉండవు. అనగా ఎలాంటి కోడింగ్ చేయబడి ఉండదు. దీనినే నాన్ కోడింగ్ (Non-Coding) ఆర్ఎన్ఏ అంటారు.


ఈ విధంగా ఆర్ఎన్ఏలో ప్రొటీన్ల తయారీకి అనువుగా లేనటువంటి భాగాన్ని, అనగా నాన్ కోడింగ్ ఆర్ఎన్ఏను మైక్రో ఆర్ఎన్ఏ (ఎంఐఆర్ఎన్ఏ) అంటారు. ఇది మిగిలిన ఆర్ఎన్ఏ భాగంతో పోలిస్తే పరిమాణంలో చాలా చిన్నగా ఉండడం వల్ల దీన్ని మైక్రోఆర్ఎన్ఏ (ఎంఐఆర్ఎన్ఏ) అని పిలుస్తారు. ఇది 20–22 న్యూక్లియోటైడ్‌ల పొడవును కలిగి ఉంటుంది.

### మైక్రో ఆర్ఎన్ఏ పనితీరు:

మైక్రో ఆర్ఎన్ఏ (mi RNA) మెసెంజర్ ఆర్ఎన్ఏ (m RNA) యొక్క పరిపూరకమైన శ్రేణులతో బంధించబడి, ఎంఆర్ఎన్ఏను క్షీణింపజేయడంతో పాటు, ఎంఆర్ఎన్ఏ యొక్క ప్రొటీన్లు ఉత్పత్తి చేసే సామర్థ్యమైన ట్రాన్స్‌లేషన్ అన్న ప్రక్రియను నిలుపుదలచేస్తుంది.

### జన్యునియంత్రణ అంటే..!!

జీవుల చలనానికి మరియు వాటి కార్యకలాపాలు సజావుగా సాగడానికి జన్యునియంత్రణ ఎంతగానో ఉపకరిస్తుంది. జన్యునియంత్రణలో ఎంఐఆర్ఎన్ఏ కీలకపాత్ర పోషిస్తుంది. ఈ నేపథ్యంలో, అసలు జన్యు నియంత్రణ అంటే ఏంటో తెలుసుకుందాం. జీవుల శరీరంలోని కణాలు తమలోని జన్యువులలో ఏ ఏ జన్యువులను ఎప్పుడు, ఎంత పరిమాణంలో





విడుదల (On) చేయాలి, లేదా నిలిపి వేయాలి (Off) అన్న విధానాన్ని సూచించే ప్రక్రియను జన్యు నియంత్రణ (Gene Regulation) అంటారు.

కణాలు ఆశించిన మేరకు తమ విధిని నిర్వర్తించడానికి, కణం యొక్క ఎదుగుదలకు, పురోగతికి జన్యు నియంత్రణ (Generegulation) అనేది ఆవశ్యకమని చెప్పవచ్చు.

**జన్యు నియంత్రణ – దశలు**

**1. ట్రాన్స్‌క్రిప్షనల్ రెగ్యులేషన్**

జన్యు నియంత్రణకు సంబంధించి ఇది మొదటి దశ. ఈ దశలో డీఎన్ఏ మెసెంజర్ ఆర్ఎన్ఏ (mRNA)గా రూపాంతరం చెందడాన్ని **ట్రాన్స్‌క్రిప్షన్ అంటారు.**




**i) ట్రాన్స్‌క్రిప్షనల్ రెగ్యులేషన్‌కు దోహదపడే కారకాలు (Transcription Factors):**

జన్యువుల ట్రాన్స్‌క్రిప్షనల్ రెగ్యులేషన్‌ను ప్రోత్సహించడానికి లేదా నిరోధించడానికి నిర్దిష్ట డీఎన్ఏ శ్రేణులతో బంధించబడిన ప్రొటీన్లు కీలకపాత్ర పోషిస్తాయి. వీటిని ప్రధాన కారకాలుగా చెప్పవచ్చు. హార్మోన్లు, ఒత్తిడి లేదా పోషకాలు (Nuetrients) వంటి వివిధ సంకేతాలకు ప్రధాన కారకాలైన ప్రొటీన్లు స్పందిస్తాయి.

**2. పోస్ట్ ట్రాన్స్ క్రిప్షనల్ రెగ్యులేషన్ :**

ఈ దశలో ట్రాన్స్‌క్రిప్షన్ అనంతరం, రూపాంతరం చెందిన ఎంఆర్ఎన్ఏ ద్వారా అనేక యంత్రాంగాలు (Mechanisms) జన్యువుల విడుదలను (Gene Expression) ప్రొటీన్ల ఉత్పత్తిని నియంత్రిస్తాయి. జన్యువుల విడుదలను నియంత్రించే యంత్రాంగాలు క్రింది విధంగా ఉంటాయి.

**i) ఆల్టర్‌నేటివ్ స్ప్లై సింగ్ (Alternative Splicing) :**

ఒకే mRNA పూర్వగామి (Precursor)ని వివిధరకాల ప్రొటీన్ ఐసోఫామ్‌లను ఉత్పత్తి చేయడానికి విభిన్న రకాలుగా విభజించవచ్చు. తద్వారా ప్రొటీన్ల వైవిధ్యతను పెంపొందించవచ్చు.

**ii) ఆర్ఎన్ఏ జోక్యం (RNA interference):**

mi RNA లేదా si RNA (ఇవి ఆర్ఎన్ఏలో రకాలు) లాంటి చిన్న ఆర్ఎన్ఏ యొక్క అణువులు మెసెంజర్ ఆర్ఎన్ఏ (m RNA) తో బంధించబడి ఎంఆర్ఎన్ఏను ప్రొటీన్లు ఉత్పత్తి చేయకుండా క్షీణింపజేయడం లేదా నిరోధిస్తాయి.

**iii) ఎంఆర్ఎన్ఏ స్థిత్వం (mRNA Stability):**

ఎంఆర్ఎన్ఏ నుండి ప్రొటీన్లు ఉత్పత్తి అయ్యే ప్రక్రియను **ట్రాన్స్‌లేషన్** అందురు. ఎంఆర్ఎన్ఏ స్థిరత్వం, ట్రాన్స్‌లేషన్ ప్రక్రియ ఎంత కాలం కొనసాగగలదో నిర్ణయిస్తుంది. కొన్ని ఎంఆర్ఎన్ఏ పోచలు వేగంగా క్షీణించగా, మరికొన్ని స్థిరంగా ఉండి ప్రొటీన్ ఉత్పత్తిని ప్రభావితం చేస్తాయి.

**3. ట్రాన్స్‌లేషనల్ రెగ్యులేషన్ :**

ఈ దశలో ఎంఆర్ఎన్ఏ రైబోసోమ్ (ప్రొటీన్లను సంశ్లేషించే కణాంగాలను రైబోసోమ్‌లు అంటారు) లను చేరుకున్న తరువాత ప్రొటీన్ల సంశ్లేషణ (ట్రాన్స్‌లేషన్) సమయంలో కూడా జన్యు నియంత్రణ జరుగుతుంది.

**i) రెగ్యులేటరీ ప్రొటీన్లు మరియు మైక్రోఆర్ఎన్ఏ అణువులు:**

ఇవి mRNA లేదా రైబోసోమ్‌తో బంధించబడడం ద్వారా ట్రాన్స్‌లేషన్ ప్రక్రియ యొక్క పనితీరును ప్రభావితం చేస్తాయి. తద్వారా ఇది ప్రొటీన్ ఉత్పత్తి రేటును ప్రభావితం చేస్తుంది.

**4. పోస్ట్-ట్రాన్స్‌లేషనల్ రెగ్యులేషన్ :**

ఈ దశలో ప్రొటీన్ ఉత్పత్తి అయిన తరువాత, దాని పనితీరును నియంత్రించ వచ్చు.

**i) ప్రొటీన్ మార్పులు (Protein midifications) :**

ఫాస్ఫోరైలేషన్, యూబిక్విటినేషన్ లేదా ఎసిటైలేషన్ (సర్వవ్యాప్తి) లాంటి రసాయనిక మార్పులు ప్రొటీన్ యొక్క పనితీరు, స్థిరత్వం లేదా కణంలోపల ప్రొటీన్ యొక్క స్థానాన్ని మార్చగలవు.

**ii) ప్రొటీన్ క్షీణత (Protein degradation) :**

ప్రొటీన్‌లను యూబిక్విటిన్ – ప్రొటీసోమ్ పాత్‌వే విధానం ద్వారా క్షీణింపజేయడం లేదా అధోకరణానికి (degradation) గురిచేయవచ్చు. తద్వారా కణం నుండి దెబ్బతిన్న లేదా అవసరం లేని ప్రొటీన్లను తొలగించవచ్చు.


**జన్యు నియంత్రణ ప్రాధాన్యత:**

జీవశాస్త్రంలో జన్యు నియంత్రణ అనేది ప్రాథమికమైనది.

ఇది జీవులలో జీవన వ్యవస్థలచే నిర్వహించబడే స్థిరమైన అంతర్గత భౌతిక మరియు రసాయన పరిస్థితుల స్థితి అయిన హోమియోస్టాసిస్‌ను నిర్వహించడంలో సహాయపడుతుంది. అదే విధంగా జీవుల అంతర్గత మరియు బాహ్య స్థితిగతులకనుగుణంగా ప్రతిస్పందించడానికి తోడ్పడుతుంది.

**i) అభివృద్ధి మరియు వైవిధ్యం (Development and differentiation) :**

జీన్ రెగ్యులేషన్ ద్వారా ఒక కణాన్ని విభిన్న కణ రకాలతో బహుకణయుత జీవిగా అభివృద్ధి చేయవచ్చు. కొత్తగా ఏర్పడిన బహుకణజీవిలోని ప్రతికణం, దాని పనితీరును నిర్ధారించే ఒక విశిష్ట జన్యువుల జతను విడుదల చేస్తాయి.





**ii) పర్యావరణ ప్రతిస్పందన (Response to Environment):**

కణాలు వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో సహాయపడే జన్యువుల విడుదల (వ్యక్తీకరణ)ను నియంత్రించడం ద్వారా, తమ చుట్టూ ఉన్న పర్యావరణంలో వచ్చే మార్పు (ఒత్తిడి, ఉష్ణోగ్రత, పోషకాలు)లను ఎదుర్కొనేందుకు అనువుగా ఉంటాయి.

**iii) వ్యాధి (Disease) :**

జన్యునియంత్రణ సరిగ్గా జరగకపోవడం వల్ల క్యాన్సర్‌లాంటి వ్యాధులు ఉద్భవించడం జరుగుతుంది. క్యాన్సర్ వ్యాధిలో కణాల పెరుగుదల మరియు విభజనను నియంత్రించే జన్యువులు తప్పుగా నియంత్రించబడడం లేదా నియంత్రణా మూలకాలలో ఉత్పరివర్తనాల వల్ల జన్యుపరమైన రుగ్మతలు అనగా క్యాన్సర్‌లాంటి వ్యాధులకు దారితీస్తాయి.




**మైక్రో ఆర్ఎన్ఏ– జన్యు నియంత్రణలో దాని అనువర్తనాలు:**

**i) జన్యునియంత్రణ (Gene Regulation):**

విభిన్న కణాలు మరియు వైవిధ్యమైన పరిస్థితులలో మైక్రోఆర్ఎన్ఏలు అవసరానుగుణంగా జన్యువుల విడుదలను చక్కగా నియంత్రించడంతో పాటు పరమాణు స్విచ్‌లుగా పనిచేస్తాయి.

**ii) వ్యాధుల నియంత్రణ (Diseases Regulation) :**

మైక్రోఆర్ఎన్ఏల క్రమబద్ధీకరణ సరిగా లేకపోవడం వల్ల క్యాన్సర్‌లు, న్యూరో డీజెనరేటివ్ డిజార్డర్లు (నాడీ సంబంధ రుగ్మతలు) ఆటో ఇమ్యూన్ డిసీజెస్ మరియు హృదయసంబంధ వ్యాధులు తలెత్తే ముప్పు పొంచి ఉంటుంది. మైక్రో ఆర్ఎన్ఏలను సక్రమంగా అవగాహన చేసుకొని, సరైన రీతిలో క్రమబద్ధీకరించినట్లయితే కొన్ని మైక్రో ఆర్ఎన్ఏలు ఆంకోజీన్‌లు లేదా ట్యూమర్ సప్రెసర్ (కణితుల అణిచివేత సాధనాలు)లుగా పనిచేస్తాయి. అదేవిధంగా మైక్రో ఆర్ఎన్ఏ సక్రమ క్రమబద్ధీకరణతో క్యాన్సర్ చికిత్సలో సరికొత్త విధానాలను ఆవిష్కరించవచ్చు.

**iii) జెనెటిక్ డిజార్డర్స్ (Genetic disorders):**

మైక్రో ఆర్ఎన్ఏ సంబంధిత జన్యువులలో ఉత్పరివర్తనాలు సంభవించడం వల్ల పుట్టుకతో వచ్చే వినికిడి లోపం, కంటిలోపాలు, అస్థిపంజర నిర్మాణంలో రుగ్మతలు సంభవించే అవకాశం ఉంది.

**iv) ఫోరెన్సిక్ రంగం:**

ఫోరెన్సిక్ రంగంలో మైక్రో ఆర్ఎన్‌లను శారీరక ద్రవాల గుర్తింపులోనూ, గాయం తీవ్రతను గుర్తించడం మరియు డ్రోనింగ్ (ద్రవంలో మునగడం ద్వారా సంభవించే శ్వాసకోశ సమస్యలు) ప్రక్రియలో వినియోగిస్తారు. మైక్రో ఆర్ఎన్ఏలు స్థిరంగా మరియు నిర్దిష్టంగా ఉంటాయి కాబట్టి పోస్ట్ మార్టమ్ ప్రక్రియలో వినియోగిస్తారు.

**v) బయోమార్కర్స్ (Biomarkers):**

వ్యాధి నిర్ధారణ మరియు రోగ నిరూపణ కోసం మైక్రో ఆర్ఎన్ఏలను బయో మార్కర్లు ఉపయోగిస్తారు. ఆరోగ్యవంతులు మరియు వ్యాధి గ్రస్తుల మధ్య తేడాను గుర్తించడంతో పాటు వ్యాధి యొక్క వివిధ దశల మధ్య తేడాను గుర్తించడానికి మైక్రో ఆర్ఎన్ఏలను ఉపయోగించవచ్చు. ఉదా॥కు సీరంలో మైక్రో ఆర్ఎన్ఏలను ప్రసరింపచేయడం ద్వారా కణితి రకాలు మరియు వాటి మూలాలను గుర్తించవచ్చు.

**vi) డ్రగ్ డెవలప్‌మెంట్ :**

మైక్రో ఆర్ఎన్ఏ ఆధారిత మందులు క్లినికల్‌ట్రయల్స్‌లో వివిధ దశలో ఉన్నాయి. కొన్ని ప్రతికూలతలున్నప్పటికీ, ఈ రకమైన డ్రగ్స్ పై కొనసాగుతున్న పరిశోధనలు డెలివరీ పద్ధతులను మెరుగుపరచడం మరియు దుష్ప్రభావాలను తగ్గించడంపై దృష్టి సారించాయి.

**vii) వ్యవసాయ రంగం:**

వ్యవసాయరంగంలో మైక్రో ఆర్ఎన్ఏ పరిశోధనలు పంట దిగుబడిని పెంచడంతో పాటు తెగుళ్ల నిర్ధారణ మరియు వ్యాధి నిరోధకతను మెరుగుపరుస్తాయి.

## మైక్రో ఆర్ఎన్ఏలపై పరిశోధనలో ఆంబ్రోస్, రువ్‌కున్‌ల పాత్ర:

1980ల చివరలో ఆంబ్రోస్ మరియు రువ్‌కున్‌ల యొక్క పరిశోధనల ద్వారా మైక్రో ఆర్ఎన్ఏల ఆవిష్కరణ జరిగింది. జన్యుశాస్త్రం యొక్క అభివృద్ధిని అధ్యయనం చేయడానికి **సి.ఎలిగాన్స్** అన్న 1 మిమీ పొడవుగల చిన్న గుండ్రని పురుగును వారు నమూనాగా తీసుకొని అధ్యయనం చేశారు.

సి.ఎలిగాన్స్ పరిమాణం చిన్నగా ఉన్నప్పటికీ దీని శరీర నిర్మాణం పెద్ద మరియు సంక్లిష్టమైన జంతువులలో కనిపించే నరాల మరియు కండర కణాల వంటి అనేక ప్రత్యేక కణ రకాలను కలిగి ఉంటుంది. బహుకణ జీవులలో కణజాలాలు ఎలా అభివృద్ధి చెందుతాయి మరియు పరిపక్వం చెందుతాయి అని పరిశోధించడానికి ఇది ఒక అనువైన నమూనాగా చెప్పవచ్చు.

ఆంబ్రోస్ మరియు రువ్‌కున్‌లు సి.ఎలిగాన్స్ పురుగు యొక్క రెండు ఉత్పరివర్తన జాతులైన లిన్-4 మరియు లిన్-14లను అధ్యయనం చేశారు. ఈ రెండు జాతులు తమ ఎదుగుదలలోనూ, జన్యుకార్యక్రమాల క్రియాశీలత సమయంలోనూ లోపాలను ప్రదర్శించాయి.


లిన్-4 జీవి యొక్క జన్యువు అసాధారణంగా మైక్రో ఆర్ఎన్ఏను ఉత్పత్తి చేసింది. దీనికి ప్రొటీన్లను ఉత్పత్తి చేయడానికి కావలసిన కోడ్ లేదు.

ఈ మైక్రోఆర్ఎన్ఏను ఉపయోగించి లిన్-4 యొక్క జన్యువు, లిన్-14 కార్యాచరణను నిరోధించడం ద్వారా లిన్-14 జన్యువు యొక్క ప్రతికూల నియంత్రకం వలె పనిచేసింది.

ఈ పరిశోధన ద్వారా లిన్-4, లిన్-14 యొక్క ప్రొటీన్ ఉత్పత్తిని నిశ్శబ్దం చేసే మైక్రోఆర్ఎన్ఏ వలె పనిచేస్తుందని రుజువైంది.

అయితే మైక్రోఆర్ఎన్ఏ భావన మొదట్లో ఎన్నో సందేహాలను, పరీక్షలను ఎదుర్కొంది. ఎందుకంటే మైక్రో ఆర్ఎన్ఏ అనేది కేవలం సి.ఎలిగాన్స్‌కు మాత్రమే ప్రత్యేకించినదిగా భావించబడింది. అయితే 2000 సం॥లో రువ్‌కున్ జంతురాజ్యం అంతటికీ వర్తించే లెట్-7 అన్న మైక్రో ఆర్ఎన్ఏను కనుగొనడంతో ప్రపంచ వ్యాప్తంగా మైక్రో ఆర్ఎన్ఏలపై మరింత ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

ఆంబ్రోస్ మరియు రువ్‌కున్ పరిశోధనలు 3 అధ్యయనాలుగా ప్రచురించబడ్డాయి. అందులో 1993లో రెండు అధ్యయనాలు కణం (cell) విభాగంలో ప్రచురించబడగా, మరొక అధ్యయనం 2000 సం॥లో నేచర్ (Nature) విభాగంలో ప్రచురించిింది. ఈ మూడు అధ్యయనాలకే వారికి 2024వ సం॥నికి గానూ ఫిజియాలజి లేదా వైద్యశాస్త్ర విభాగంలో నోబెల్ బహుమతి లభించింది.




### viii) వ్యక్తిగతీకరించిన వైద్యం (Perosnalized Medicine):

ఒక వ్యక్తి యొక్క మైక్రో ఆర్ఎన్ఏ ప్రొఫైల్‌ను అర్థం చేసుకోవడం ద్వారా చికిత్సలు మరియు ఔషధ ప్రతిస్పందనలను అంచనా వేయడంతో పాటు వ్యక్తిగతీకరించిన వైద్య విధానాలను అభివృద్ధి చేయవచ్చు.

### ix) కాంబినేషన్ థెరపీలు :

మైక్రో ఆర్ఎన్ఏ చికిత్సా విధానాన్ని ఇతర చికిత్సా విధానాలైన కీమోథెరపీ, ఇమ్యునో థెరపీలతో కలపడం వల్ల మైక్రో ఆర్ఎన్ఏ చికిత్సావిధానం యొక్క సమర్థత పెరుగుతుంది.

### x) రీజెనరేటివ్ మెడిసిన్:

కణ వైవిధ్యంలో మైక్రో ఆర్ఎన్ఏ పాత్రను అర్థం చేసుకోవడం ద్వారా డీజెనరేటివ్ మెడిసిన్ మరియు మూలకణ చికిత్సలు అభివృద్ధి చెందుతాయి.

### చివరగా :

మైక్రో ఆర్ఎన్ఏల ఆవిష్కరణ జన్యు నియంత్రణ, అభివృద్ధి మరియు వ్యాధి అధ్యయన శాస్త్రంలో సరికొత్త పరిశోధనలకు దారులు తెరిచింది. మైక్రో ఆర్ఎన్ఏలలోని సంక్లిష్టతలను పరిష్కరించి వాటిపైన మరింత విస్తృతమైన అవగాహనను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. తద్వారా మాలిక్యులర్ బయాలజీ మరియు వైద్యరంగంలో వివిధ విభాగాలైన డయాగ్నోస్టిక్స్, థెరప్యూటిక్స్ మరియు పర్సనల్ మెడిసిన్ విభాగాలలో, క్యాన్సర్, మధుమేహం, ఆటోఇమ్యూన్ డిసీజెస్ వాటి అరుదైన వ్యాధుల నియంత్రణలో కారుచీకట్లో కాంతిరేఖలా మైక్రో ఆర్ఎన్ఏ వెలుగొందు తుందనడంలో సందేహం లేదు.

-పుట్టా పెద్ద ఓబులేసు,
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం, కడప,
m : 9550290047

# గ్రూప్-1 మెయిన్స్ సైన్స్ & టెక్నాలజీలో

# దక్కన్‌ల్యాండ్ సంచలనం..!!

## గత అక్టోబర్‌లో జరిగిన టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్, సైన్స్ & టెక్నాజీ విభాగంలో దక్కన్‌ల్యాండ్ వ్యాసాల నుండి 100 మార్కులకు పైగా ప్రశ్నలు వచ్చిన వైనం

## పోటీ పరీక్షార్థులకు దిక్సూచిగా యువ రచయిత పుట్టా ఓబులేసు వ్యాసాలు

సివిల్స్, గ్రూప్-1, గ్రూప్-2 వంటి పోటీ పరీక్షల్లో సైన్స్ & టెక్నాలజీ సబ్జెక్ట్ అనేది ప్రవహించే నీటిని తలపిస్తుంది. బేసిక్స్‌పై సమగ్ర అవగాహన కలిగి ఉంటూనే, రోజువారీ వర్తమాన వ్యవహారాలను దేగకన్నుతో పరిశీలిస్తూ, వాటిని బేసిక్ సబ్జెక్ట్‌కు జతపరచుకుంటూ ఆయా అంశాలపై పట్టు సాధించాల్సి ఉంటుంది. అయితే సైన్స్ & టెక్నాజీలోని క్లిష్టమైన సాంకేతిక పదజాలాన్ని అవగాహన చేసుకుంటూ, మూల భావనలపై పట్టు సాధించడం కాస్త శ్రమతో కూడిన వ్యవహారంగా చెప్పవచ్చు.

సైన్స్ & టెక్నాలజీ సబ్జెక్టుకు సంబధించి ఆంగ్లంలో ఉన్న కఠినమైన సాంకేతిక పదజాలాన్నంతటినీ, వీలైనంత వరకు మాతృభాషలోకి అనువదించి, మూలభావనలను సరళంగా, సులువుగా, సమగ్రంగా వివరించి చెబితే ఎంత బాగుంటుందో అని భావిస్తున్న సగటు తెలుగు మీడియం అభ్యర్థులకు దక్కన్‌ల్యాండ్ మాసపత్రికలో ప్రచురితమవుతున్న యువరచయిత పుట్టా ఓబులేసుగారి వ్యాసాలు దారిదీపంలా తోడ్పడుతున్నాయి.



రచయిత
పుట్టా ఓబులేసు

కేవలం క్వశ్చన్ టు ఆన్సర్ రాసే విధానంలో కాకుండా ఒక కాన్సెప్ట్‌కు సంబంధించి విభిన్న కోణాలలో ఏ రూపంలో ప్రశ్న అడిగినా అభ్యర్థులు ధీటుగా సమాధానం రాసేవిధంగా అభ్యర్థులు పరిణామం చెందేలా పుట్టా ఓబులేసు వ్యాసాలున్నాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

దక్కన్ ల్యాండ్ మాసపత్రిక సంపాదకులు మణికొండ వేదకుమార్‌గారి ప్రోత్సాహంతో దక్కన్‌ల్యాండ్ మాసపత్రికలో పుట్టా ఓబులేసు రాస్తున్న వ్యాసాలు తెలుగు మీడియం నేపథ్యం కలిగిన సివిల్స్, గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షార్థులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయని పలువురు అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వర్తమాన వ్యవహారాలలో బాగా చర్చనీయాంశమైన టాపిక్‌ను ఎంపిక చేసుకోవడమే కాకుండా $360^0$ కోణంలో ఆ టాపిక్‌కు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అత్యంత సులభశైలిలో వివరిస్తూ, తగు ఉపమానాలు, కొటేషన్లు, గణాంకాలతో అత్యంత నిగూఢంగా, విశ్లేషణాత్మకంగా పుట్టా ఓబులేసు రాసిన వ్యాసాలు పోటీ పరీక్షార్థుల మనసును హత్తుకుంటున్నాయని పలువురు అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు.

గత అక్టోబర్‌లో జరిగిన టీజీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్స్ పరీక్షలలో సైన్స్ & టెక్నాలజీ విభాగానికి సంబంధించి పేపర్-1, సెక్షన్-3 నందు "వాతావరణ మార్పులను తగ్గించడంలో పునరుత్పాదక ఇంధన పాత్రను వివరించండి" అన్న వ్యాసరూప ప్రశ్న 50 మార్కులకు ఇవ్వడం జరిగింది. పునరుత్పాదక ఇంధన వనరుల (రెన్యువబుల్ ఎనర్జీ)ను గురించి సమగ్రంగా విశ్లేషిస్తూ సుస్థిర ప్రగతికి ఊతం, బంగరు భవితకు మార్గం రెన్యువబుల్ ఎనర్జీ అన్న శీర్షికతో దక్కన్‌ల్యాండ్ అక్టోబర్-2024 సంచికలో వ్యాసం ప్రచురించడం జరిగింది. రెన్యువబుల్ ఎనర్జీకి సంబంధించి పేపర్-4, సెక్షన్-3 ఎన్విరాన్‌మెంట్ విభాగం నందు సాంప్రదాయ శిలాజ ఇంధన ఆధారితశక్తికి బదులుగా హరిత ఇంధనం (గ్రీన్ పవర్)ను ఉపయోగించడం వల్ల వచ్చే పర్యావరణ ఫలితాలను చర్చించుము అన్న ప్రశ్న 10 మార్కులకు ఇవ్వడం జరిగింది. ఇదే అంశంలో భారతదేశంలో పర్యావరణ సుస్థిర తనంతో కూడిన ఆర్థికాభివృద్ధిని సాధించడంలో ఎదురయ్యే సవాళ్లను విమర్శనాత్మకంగా చర్చించండి అన్న ప్రశ్నను 10 మార్కులకు ఇవ్వడం జరిగింది. ఈ విధంగా దక్కన్‌ల్యాండ్ అక్టోబర్-2024లో రెన్యువబుల్ ఎనర్జీ వ్యాసం


దక్కన్ ల్యాండ్
సైన్స్ & టెక్నాలజీ
సుస్థిర ప్రగతికి ఊతం... బంగారు భవితకు మార్గం...!!
@ రెన్యువబుల్ ఎనర్జీ
17
దక్కన్ ల్యాండ్ ■ అక్టోబర్ - 2024

*గత అక్టోబర్‌లో రెన్యువబుల్ ఎనర్జీపై దక్కన్ ల్యాండ్‌లో పై వ్యాసం ప్రచురితమైంది. ఇదే వ్యాసంపై డైరెక్ట్‌గా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో 50 మార్కులకు జనరల్ ఎస్సే క్వశ్చన్ వచ్చింది.*

చదవడం వల్ల ఈ మూడు ప్రశ్నలకు సమాధానాలు రాయొచ్చు, తద్వారా 70 మార్కులు సులువుగా పొందవచ్చు. అదే విధంగా పేపర్-5, సెక్షన్-1లో గగన్‌యాన్, నానో టెక్నాలజీ, రోబోటిక్స్ మీద ఒక్కొక్క ప్రశ్న 10 మార్కుల చొప్పున మొత్తం 30 మార్కులకు ప్రశ్నలొచ్చాయి. ఈ అంశాలన్నింటిపై గతంలో దక్కన్‌ల్యాండ్ మాసపత్రికలో వ్యాసాలు ప్రచురితమయ్యాయి. పేపర్-5, సెక్షన్-2లో భారతదేశంలో వ్యాక్సిన్ ఉత్పత్తి మరియు రోగనిరోధకత కార్యక్రమాన్ని చర్చించండి అన్న ప్రశ్నను 10 మార్కులకు ఇవ్వడం జరిగింది. దీనిపై కూడా దక్కన్‌ల్యాండ్ పత్రికలో గతంలో రెండు సందర్భాల్లో వ్యాసాలు ప్రచురితమయ్యాయి. మొత్తం మీద దక్కన్‌ల్యాండ్ సైన్స్ & టెక్నాలజీ వ్యాసాలు అనుసరిస్తున్న అభ్యర్థులు 100 పైగా మార్కులు అవలీలగా పొందే అవకాశం ఉంది. పుట్టా ఓబులేసుగారి సైన్స్ & టెక్నాలజీ వ్యాసాలతో అభ్యర్థుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

## సివిల్స్ పరీక్షలకూ ఉపయుక్తమైన వ్యాసాలు



ప్రస్తుత పోటీ పరీక్షల ప్రపంచంలో సైన్స్ అండ్ టెక్నాలజీకు ఉన్న ప్రాముఖ్యత చాలా విస్తృతమైనది. ఇది ఎప్పటికప్పుడు వచ్చే వర్తమాన అంశాలతో గతిశీలమవుతూ ఉండే సబ్జెక్ట్. ఈ విషయంలో తెలుగుమీడియం అభ్యర్థులు సరైన వనరులు లేక ఇబ్బంది పడుతున్నారు. అయితే దక్కన్‌ల్యాండ్ మ్యాగజైన్‌లో పుట్టా ఓబులేసు గారు సైన్స్ అండ్ టెక్నాలజీ మీద రాసే వ్యాసాలు చాలా సరళంగా, సమగ్రమైన వివరణలతో, లోతైన విశ్లేషణతో కూడుకొని ఉంటాయి. ఇవి సివిల్స్ మరియు గ్రూప్-1మెయిన్స్ రాసే తెలుగు మీడియం అభ్యర్థులకు చాలా ఉపయుక్తకరంగా ఉంటాయి. ఇటీవల జరిగిన తెలంగాణ గ్రూప్-1 మెయిన్స్ సైన్స్ & టెక్నాలజీ ప్రశ్నల సరళిలోనూ ఆయన వ్యాసాలలోని పునరుత్పాదక ఇంధన వనరులు జనరల్ ఎస్సే పేపర్‌లోనూ నానోటెక్నాలజీ, రోబోటిక్స్, వ్యాక్సినేషన్ తదితర అంశాల మీద పేపర్-5లోనూ డైరెక్ట్‌గా ప్రశ్నలు రావడం జరిగింది. కఠినతరమైన శాస్త్రీయ భావనలను సులభమైన నిర్వచనాలు, సందర్భోచిత ఉదాహరణలు, సమకాలీన అంశాల అనుసంధానం, లోతైన విశ్లేషణతో కూడిన ఆయన వ్యాసరచన తెలుగు మీడియం అభ్యర్థులకు చాలా ఉపయోగకరం. ఆ విషయంలో తన ప్రయత్నం అభినందనీయం. దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక యాజమాన్యానికి కృతజ్ఞతలు.

-**శ్రీరామ్ చంద్ర శ్రీనివాస్.** డీఎస్పీ
టీజీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల మెంటార్

## తెలుగు మీడియం అభ్యర్థులకు వరం



గ్రూప్-1 పరీక్ష రాసే అభ్యర్థులు సైన్స్ & టెక్నాలజీ అంటే ఒక పట్టాన కొరుకుడు పడని సబ్జెక్ట్‌గా భావిస్తూ, ఆందోళన చెందుతూ ఉంటారు. ప్రధానంగా తెలుగు మీడియం అభ్యర్థులకు ఇలాంటి ఆందోళన ఇంకా ఎక్కువగా ఉంటుంది. అయితే దక్కన్‌ల్యాండ్ మాసపత్రికలో పుట్టా ఓబులేసుగారు రాసే సైన్స్ & టెక్నాలజీ వ్యాసాలు చదివి, వాటిని పదిలపరుచుకుంటే అభ్యర్థులకు ఇక ఎలాంటి ఆందోళన అవసరం లేదని చెప్పవచ్చు. చక్కటి ఉపోద్ఘాతంతో వ్యాసం ప్రారంభం నుండి ముగింపు వరకు ఏకబిగిన చదవాలన్న ఆసక్తిని కలిగించే విధంగా ఆయన వ్యాసాలు అద్భుతంగా ఉంటాయి. గత అక్టోబర్‌లో జరిగిన

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో కూడా ఓబులేసుగారు రాసిన నానో టెక్నాలజీ, రోబోటిక్స్, రెన్యువబుల్ ఎనర్జీ, గగయన్‌యాన్, వ్యాక్సిన్లు తదితర అంశాలపై నేరుగా ప్రశ్నలు రావడం హర్షనీయం. పుట్టా ఓబులేసు గారు ఇలా మరిన్ని సంక్లిష్ట, సాంకేతిక అంశాలకు సంబంధించిన వ్యాసాలు రాసి తెలుగుమీడియం అభ్యర్థులకు అండగా నిలవాలని కోరుకుంటూ, ఆయనను ఆ దిశగా ప్రోత్సహించాలని దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక యాజమాన్యాన్ని అభ్యర్థిస్తున్నాను. విలువైన వ్యాసాలు రాస్తున్న పుట్టా ఓబులేసుగారికి అభినందనలు, దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక యాజమాన్యానికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

**-జిన్నా నాగార్జున రెడ్డి,** గ్రూప్-1 ఆస్పిరెంట్ (టీజీపీఎస్సీ), ఎక్సైజ్ సీ.ఐ, హుజూర్‌నగర్, సూర్యాపేట జిల్లా, తెలంగాణ

## విలువైన వ్యాసాలు

గ్రూప్-1 లాంటి ఉన్నతమైన పోటీ పరీక్షల్లో సైన్స్ & టెక్నాలజీ సబ్జెక్ట్ చాలా విస్తృమైనది మరియు ఒక సవాల్ లాంటిది. ఈ సవాల్‌ను ఎదుర్కోవడానికి సరైన వనరులు లేక తెలుగుమీడియం అభ్యర్థులు ఉభయ తెలుగు రాష్ట్రాలలో చాలా ఇబ్బందులు పడుతున్నారు. అయితే దక్కన్‌ల్యాండ్ మాసపత్రికలో పుట్టా ఓబులేసుగారు రాసే సైన్స్ & టెక్నాలజీ వ్యాసాలు ఆ కొరతను తీర్చేవిధంగా ఉన్నాయి. ప్రతివ్యాసం ప్రారంభంలో రాసే పరిచయం పాఠకులను ఆకట్టుకునేవిధంగా, వ్యాసాన్ని ఆమూలాగ్రం చదవాలనే కుతూహలాన్ని కలిగించే విధంగా ఉంటుంది. ఇలా ప్రత్యేకమైన శైలితో సైన్స్ & టెక్నాలజీ వ్యాసాలు రాసే రచయితలు అరుదుగా ఉంటారు. ఓబులేసుగారు అలాంటి అరుదైన రచయితల్లో ఒకరని నేను నమ్ముతున్నాను. ఇటీవల టీజీపీఎస్సీ గ్రూప్- మెయిన్స్ పరీక్షలో ఆయన రాసిన వ్యాసాల నుండే చాలా ప్రశ్నలు వచ్చాయి. భవిష్యత్‌లో ఇంకా అనేక సాంకేతిక అంశాలపై ఆయన మరిన్ని వ్యాసాలు రాయాలని కోరుకుంటున్నాను. తన వెలకట్టలేని వ్యాసాల ద్వారా ఉభయతెలుగు రాష్ట్రాల గ్రూప్స్ పోటీ పరీక్షార్థులకు ఎనలేని సేవచేస్తున్న పుట్టా ఓబులేసుగారికి శుభాభినందనలు. ఇటువంటి రచయితను వెలుగులోకి తెచ్చి, ప్రోత్సహిస్తున్న దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక ఎడిటర్ వేదకుమార్ సర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు.



**-ఎన్. రాంబాబు జోషి**
గ్రూప్స్ ఆస్పిరెంట్, విశాఖపట్నం, ఎన్‌డీ(వీ)

**- కొత్వాల్ సచిన్,**
m : 97010 01036

## చందాదారులుగా చేరండి... చేర్పించండి...

***పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు... నమస్సులు.***

తెలంగాణ ఉద్యమ సందర్భంలో పుట్టిన తెలుగు మాసపత్రిక దక్కన్‌లాండ్. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేలా ఎందరో ప్రముఖుల వ్యాసాలను అందించింది. టిఆర్‌సి 'చర్చ' సారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది. తెలంగాణ భావజాలాన్ని బలోపేతం చేసింది. స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దక్కన్‌లాండ్ తెలంగాణ పునర్ నిర్మాణంతో తనదైన పాత్రను పోషిస్తున్నది. తెలంగాణ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మరింత పరిపుష్టం చేసుకునేదానికి దోహదం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో సామాజిక అంశాలతోపాటు, పర్యావరణం, చరిత్ర, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యాటకం లాంటి అంశాలపై కథనాలను, వివిధ రంగాల నిపుణులతో విద్యార్థులకు, సమాజానికి అవసరమైన వ్యాసాలు వెలువరిస్తున్నది. ప్రజా సంక్షేమం కోసం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలదృష్టికి తీసుకెళ్తుంది. 2012 సెప్టెంబర్‌లో ప్రారంభమైన పత్రిక ఇప్పటి వరకూ మీ అందరి సహకారాలతో కొనసాగుతూ వస్తుంది. ఇప్పటికే ఎంతో మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ చందాలతో పాటు, చందాదారులను చేర్పించడంలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారికి ధన్యవాదాలు.

అయినప్పటికీ పత్రిక నిర్వహణ కష్టసాధ్యంగా ఉంది. దక్కన్‌లాండ్ మనందరిది. పదికాలాల పాటు పత్రిక సజావుగా వెలువడే బాధ్యత మన అందరిదీ.

చందా పూర్తయిన వారు తమ చందాలను రెన్యూవల్ చేసుకుని కాంప్లిమెంటరీ కాపీలు అందుతున్న వారు కూడా చందాదారులుగా చేరి, మిత్రులను చేర్పించి సహకరిస్తారని ఆశిస్తూ...

ధన్యవాదాలతో... మీ
**- మణికొండ వేదకుమార్**
సంపాదకులు

**చందా వివరాలు:**

వార్షిక చందా : రూ. 300 2 సం॥లకు : రూ. 600

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎం.ఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**చిరునామా :**

**DECCAN LAND :**
**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com ww.deccanland.com

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:**

| | |
|---|---|
| Name | : DECCAN LAND |
| Bank | : KOTAK MAHINDRA BANK |
| A/c No | : 7111218829 |
| IFSC Code | : KKBK0007463 |
| Branch Code | : 007463 |



# స్థిరమైన భవిష్యత్తు కోసం పర్వతాలను పరిరక్షించుకుందాం

## డిసెంబర్ 11న అంతర్జాతీయ పర్వత దినోత్సవం

ప్రకృతి మనిషికి అందించిన వనరులు ఎన్నో.. ఎన్నెన్నో. గాలి, నీరు, నిప్పు, అడవులు, బొగ్గు, పెట్రోలియం, బంగారం, వజ్రాలు, ఖనిజాలు, వాతావరణం, వర్షపాతం, కొండలు, గుట్టలు, పర్వతాలు ఇలా ప్రకృతి మనిషికి ఎన్నో ఇచ్చింది. ప్రకృతి మనకు అందించిన ఈ సహజ వనరుల్ని వాడుకోవాలి. వాటిని సంరక్షించుకోవాలి. ఆ బాధ్యత ప్రతీ మనిషికి ఉంది. కానీ మనిషి మాత్రం అన్నింటిని కలుషితం చేస్తున్నాడు. రాబోయే తరాలకు అందకుండా చేస్తున్నాడు.

### ప్రకృతి మనిషికి ఇచ్చిన వరాలు పర్వతాలు

ప్రకృతి మనకు ఇచ్చిన సహజవనరుల్లో పర్వతాలు కూడా ఉన్నాయి. మొదటి తరం మానవుల నాగరికత ఆనవాళ్లు నదులు, పర్వతాల్లోనే బైటపడ్డాయి. నీరు ఉన్నచోటే ప్రాణి మనుగడ సాగిస్తుంది. అలాగే పర్వతాలు భద్రతనిస్తాయి. అందుకే నదులు, పర్వతాల వద్దనే మొదటితరం మనిసి నాగరికత ఆనవాళ్లు బైటపడ్డాయి. నదులు, పర్వతాలు అనేక జీవజాతులకు నిలయంగా ఉంటాయి.

### ప్రపంచ జనాభాలో 15శాతం మందికి పర్వతాలపైనే నివాసం

భూమిపైన జీవవైవిధ్యాన్ని (Biodiversity) కాపాడుకుంటూ వస్తున్నాయి. ప్రపంచ జనాభాలో 15శాతం మంది ప్రజలు పర్వత ప్రాంతాల్లోనే నివసిస్తున్నారంటే పర్వతాల ప్రాముఖ్యత ఏంటో అర్థం చేసుకోవచ్చు. దీన్ని గుర్తుచేసుకుంటూ డిసెంబర్ 11న పర్వతాల పరిరక్షణ, అక్కడి జీవవైవిధ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. పర్వతాలను పరిరక్షించుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఇంటర్నేషనల్ మౌంటెన్ డే ఏర్పడింది. ప్రపంచ జనాభాలో సగంమందికి పర్వతాలు మంచినీటిని అందిస్తున్నాయి. పర్వతాలు అందించే నీటితోనే అంత స్థాయి జనాభా మనుగడ సాగిస్తోంది. కానీ అక్కడి వాతావరణ మార్పుల వల్ల పర్వతాలపై నివసించే ప్రజల మనుగడ కష్టమవుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కరిగిపోతున్న మంచుపర్వతాలు..మనకు తెలియకుండానే మనిషిని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. ఇది మనిషి గుర్తించటంలేదు.


మంచు పర్వతాలు కరిగిపోతుండటంతో కోట్లాదిమంది ప్రజల మంచినీటి సరఫరాపై ప్రభావం పడుతోంది. ఇది ఏ ఒక్క దేశానికో కాదు. ప్రపంచంలోని ప్రతి ఒక్క దేశంపై ఏదో ఒక విధంగా ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఇది ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా గుర్తించాలి. వాతావరణ కాలుష్యానికి కారణమయ్యే చర్యల్ని అడ్డుకోవాలి. సహజవనరులను పరిరక్షించుకోవాలి. ఇది ప్రతీ ఒక్కరి బాధ్యతగా ఉండాలి. దీంతో పాటు పర్వతాల పరిధిలో ఉండే జీవవైవిధ్యాన్ని, అందమైన ప్రకృతిని కాపాడటానికి ప్రజలకు International Mountain Day ఈ అవగాహన కల్పించటానికి ఏర్పడింది. ఇంటర్నేషనల్ మౌంటైన్ డే 2024 అనేది జ్ఞానాన్ని మార్పిడి చేసుకోవడానికి, ఉత్తమ అభ్యాసాలను ప్రదర్శించడానికి మరియు సామూహిక చర్యను సమీకరించడానికి ఒక వేదిక. ఆవిష్కరణ, అనుసరణ, యువత సాధికారత మరియు సహకార విధానాలను స్వీకరించడం ద్వారా, పర్వత సమాజాలు మరియు పర్యావరణ వ్యవస్థలకు మరింత స్థిరమైన మరియు స్థితిస్థాపకమైన భవిష్యత్తు కోసం మేము మార్గం సుగమం చేయవచ్చు.

**2024 థీమ్ :** "స్థిరమైన భవిష్యత్తు కోసం పర్వత పరిష్కారాలు – ఆవిష్కరణ, అనుసరణ మరియు యువత". దేశాలు, సంఘాలు మరియు సంస్థలు ఈ థీమ్ ద్వారా ఉత్సవాలు జరుపుకోవడానికి స్వాగతం పలుకుతున్నాయి.

– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

# ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శిలా మరియు ఖనిజ సంపద

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ యొక్క కోస్తా ప్రాంతంలోని మధ్య భాగంలో ఉంటుంది. ఈ జిల్లాకి ఈశాన్యంలో విశాఖపట్నం జిల్లా, పశ్చిమలో పశ్చిమ గోదావరి జిల్లా, వాయువ్యంలో ఖమ్మం జిల్లా మరియు దక్షిణం, తూర్పులో బంగాళాఖాతం కలదు. కాకినాడ ఈ జిల్లాకు హెడ్ క్వార్టర్. ఇది కాకుండా ముఖ్య పట్టణాలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, పిఠాపురం. కోలకత్తా-చెన్నై (NH-5) ఈ పట్టణాల గుండా వెళ్తుంది. సముద్రతీరాన్ని ఆనుకొని, గౌతమి గోదావరి పక్కన ఉన్న చిన్న భాగం యానం. ఒకప్పుడు ఫ్రెంచ్ కాలనీగా ఉండేది. కానీ ఇప్పుడు ఇది పుదుచ్చేరికి చెందిన ప్రాంతంగా నిర్ధారించారు. ఈ జిల్లాలోని భూభాగాన్ని ఫిసియో గ్రాఫికల్‌గా మూడు భాగాలుగా గుర్తించబడినది. అవి 1. డెల్టా ప్రాంతం – దక్షిణంలో కలదు. 2. మధ్యప్రాంతంలో మెట్ట ప్రాంతం 3. అడవి మరియు కొండలుగా ఉన్న ఈస్టర్న్ ఘాట్ ప్రాంతం. ఈ జిల్లాలో ముఖ్యనది గోదావరి. ఇది ఉత్తర భాగం గుండా జిల్లాలోకి ప్రవేశించి, దక్షిణ దిశగా 125 కి.మీ. ప్రవహిస్తూ తరువాత సముద్రంలో కలిసిపోతుంది. రాజమండ్రికి దక్షిణంలో రెండు పాయలుగా చీలుతుంది. వశిష్టా గోదావరి, గౌతమి గోదావరి. ఈ నది యొక్క ప్రముఖమైన ఉపనదులు పాములేరు, సీలేరు. పోలవరం, అలుమేరువాగు, గండివాడు. ఈ జిల్లాలోని ఎత్తైన ప్రాంతం 641 మీ. అతి తక్కువ ఎత్తుగల ప్రాంతం 65 మీ. MSLపైన కలదు. ఈ జిల్లాలోని ప్రాంతంలో డ్రైనేజ్ ప్యాటర్న్ సబ్‌డెండ్రిటిక్ నుండి ప్యారెలెల్‌గా ఉంటుంది.



ఉమ్మడి గోదావరి జిల్లా జియోలాజికల్ మ్యాప్

ఈ జిల్లా యొక్క ఉత్తర ప్రాంతంలో ఈస్టర్న్ ఘాట్ సూపర్ గ్రూప్‌కు చెందిన కొండలైట్, చార్నోకైట్, మిగ్మటైట్ గ్రూప్‌లకు చెందిన శిలలను చూడగలము. కొండలైట్ గ్రూప్ యొక్క శిలలు ముఖ్యంగా క్వార్ట్జ్ – గార్నెట్ – సిల్లిమనైట్ – గ్రాఫైట్ నైస్, క్వార్ట్జైట్, కాల్క్ గ్రానులైట్ నైస్ మరియు సాఫరిన్‌తో కూడిన క్వార్ట్జో ఫెల్స్ పాతిక్‌నైస్. చార్నోకైట్ గ్రూప్‌కు చెందిన శిలలు ముఖ్యంగా, ఎసిడ్, ఇంటర్‌మీడియట్, బేసిక్ చార్నోకైట్స్. మిగ్మటైట్ గ్రూప్‌కు చెందిన శిలలు పార్ఫిరోబ్లాస్టిక్ గ్రానిటాయిడ్ నైస్, గార్నెటిఫెరస్ -క్వార్ట్జోఫెల్స్ పాతిక్‌నైస్ (లెప్టినైట్), గార్నెట్ – బయోటైట్ – హైపర్ స్తీన్ నైస్ మరియు క్వార్ట్జో – ఫెల్స్ పాతిక్ మొబిలిజెట్స్.

ఈ ఆర్ క్యన్ పెలియోప్రొటిరోజోయక్‌కు చెందిన క్రిస్టలైన్స్ పైన అప్పర్ గోండ వానా యొక్క తిరుపతి సాండ్ స్టోన్‌ని చూడగలము. ఇది ఒక ట్రాన్సిశనల్ వాతావరణంలో డిపాజిట్ అయినది కోస్తా ప్రాంతంలో. ఈ ఫార్మేశన్‌లో సాండ్‌స్టోన్‌తో పాటు కంగ్లామరేట్, క్లే జోన్స్‌ను చూడగలము. క్లే జోన్స్‌లో టిలోఫైలమ్ ప్లాంట్ ఫాసిల్‌ని చూడగలము. అన్నవరం ప్రాంతంలో గోండ్‌వానా శిలల్లో, మెరైన్ ఫాసిల్స్‌ని రిపోర్ట్ చేయబడినవి. రాజమహేంద్ర వరంకు 2 కి.మీ. ఉత్తర, తూర్పు దిశలలో డెక్కన్ ట్రాప్స్ యొక్క బేసిక్ ఫ్లోస్‌ని చూడగలము. ఇందులో లైమ్‌స్టోన్ ఇంటర్ ట్రోపియన్స్ రూపంలో గాస్ట్రోపాడ్, లీమెలి బ్రాంచ్ ఫాసిల్స్‌తో కూడి యున్నది. ఇవి కోటిలింగాల, కోరుకొండ, కాటేరు ప్రాంతాలలో కలవు. రాజమండ్రి ఫార్మేశన్‌లో మేయప్లై యొ సీన్‌కు చెందిన సాండ్‌స్టోన్, గ్రిట్, కంగ్లామరేట్ కలదు. వీటిపైన కరెంట్ బెడ్డెడ్ సాండ్ స్టోన్, క్లే బెడ్స్‌షేల్ బ్యాండ్స్‌తో కూడి యున్నది. ఈ ఫార్మేశన్ కేరళలోని వర్క లా బెడ్స్ మరియు తమిళనాడులోని కడ్డలూరు సాండ్‌స్టోన్‌తో కొరిలేట్ చేయబడినది. డెల్టా ప్రాంతంలో ఫ్లూ వియల్ మెరైన్ మరియు ఫ్లూవియో మెరైన్ సెడిమెంట్స్ క్వాటర్‌నేరికి చెందినది.

**ఖనిజ సంపద :**

ఈ జిల్లాలో గ్రాఫైట్, టంగ్‌స్టన్, బాక్సైట్, క్లే, డైమెన్షన్ స్టోన్ నిక్షేపాలు పుష్కలంగా వున్నవి.

**గ్రాఫైట్ :**

గ్రాఫైట్ ఖనిజం కొండలైట్ గ్రూప్‌కు చెందిన గ్రాఫైట్ నైస్‌లో మరియు కొన్ని ప్రాంతాలలో క్వార్ట్జైట్స్‌లో దొరుకుతుంది. కొన్ని జోన్స్ ఎక్కడైతే క్వార్ట్జో పెల్స్ పాతిక ఇంజెక్షన్స్, పెగ్మటైట్స్, క్వార్ట్జ్‌వీన్స్ కలవో అక్కడ వీటిలో రీ మొబిలైజ్ అయి లేన్సెస్, పాకెట్స్ రూపంలో గ్రాఫైట్ దొరుకుతుంది. ఈ గ్రాఫైట్, క్రిస్టలైన్

మరియు ఫ్లేకీగా వుంటుంది. ఈ లోగ్రేడ్ గ్రాఫైట్ డిపాజిట్స్ ఈ జిల్లాలో లీనియర్, కన్‌ఫర్మెబుల్ బ్యాండ్స్ రూపంలో 200 మీ. నుండి 750 మీ పొడవు గలిగి యున్నవి. వీటి విడ్త్ 5 మీ నుండి 12 మీ వరకు కలవు. ఈ గ్రాఫైట్ దొరికే ముఖ్యమైన ప్రాంతాలు బూరుగుబండ, తపసికొండ, మర్రికొండ, కొక్కిరపల్లె, రెడ్డిబొడేర.


**టంగ్‌స్టన్ :**

టంగ్‌స్టన్ ఈ ప్రాంతంలో కొండలైట్ గ్రూప్‌కు చెందిన గ్రాఫైట్ నైస్‌లో దొరుకుతుంది. ఇక్కడ టంగ్‌స్టన్ యొక్క ఖనిజం వోల్‌ఫ్రమైట్. ఇది ఈ ప్రాంతంలో క్వార్ట్జ్ రిచ్‌పెగ్మెటైట్స్‌లో వీన్స్ (0.3-3 cm తిక్) మరియు నెస్ట్స్ (5 to 15 cm) రూపంలో దొరుకును. అక్కడక్కడ వోల్‌ఫ్రమైట్‌లంప్స్‌ను కూడా చూడగలము. గ్రాఫైట్ నైస్‌లో టంగ్‌స్టన్ మినరలైజేషన్ 360 మీ పొడవు, 2 నుండి 12 మీ. వెడల్పుగల లేన్సెస్‌లో 0.1 నుండి 0.2% WO3ని చూడగలము. తపసికొండలో మినరలైజేషన్ క్వార్ట్జ్ వీన్స్‌లో చూడగలం. ఈ జోన్ 5 నుండి 10 మీ. వెడల్పు వుంటుంది. పైడి పుట్ట ప్రాంతం 1.5 కి.మీ. తపసికొండకు దక్షిణంలో వుంటుంది. ఇక్కడ మినరలైజేషన్ 1.0 నుండి 2.0 మీ. వెడల్పుగల జోన్ కలదు. ఇక్కడ మినరలైజేషన్ ఫోల్డ్ ఎక్సిస్ కంట్రోల్ చేస్తుంది. NMDC టంగ్స్‌టన్ మినరలైజేషన్‌ని 1500 మీ పొడవు గలిగి, 10 మీ. వెడల్పుగల జోన్‌లో 0.1 నుండి 0.2% ఖనిజం ఉన్నట్టు నిర్ధారించారు.

బూరుగుబండ – తపసికొండ మినరల్ బెల్ట్ 22 కి.మీ. పొడువు కలదు. ఇందులో చిన్నచిన్న ఫైట్‌నైస్ లెన్సెస్, బ్యాండ్స్ కలవు. మరియు వీటిలో టంగ్స్‌టన్ మినరలైజేషన్ కలదు. ఈ బెల్టులో టంగ్స్‌టన్ ఖనిజం చాలా వరకు వోల్‌ఫ్రమైట్ (ఫెబ్బరైట్ వెరైటి). ఈ ఖనిజం గోధుమరంగు మరియు నలుపు రంగులో ఉంటుంది. బాక్స్ వర్క్స్, నెస్ట్స్ రూపంలో దొరుకుతుంది. వీటి మార్జిన్స్‌లో వోల్‌ఫ్రమైట్‌ని శీలైట్ రీప్లేస్ చేస్తుంది. జి.ఎస్.ఐ బెనిఫిషియేషన్ టెస్టులు జరిపి బూరుగుబండ బెల్ట్‌లో వోల్‌ఫ్రమైట్ 45% రికవరీ చేసింది.

**బాక్సైట్:**

బాక్సైట్ క్యాప్పింగ్స్ రూపంలో కొండలైట్, చార్నొకైట్ గ్రూప్‌కు చెందిన శిలలపైన 1090 నుండి 1445 మీ MSL పైన దొరుకుతుంది. ఈస్ట్‌కోస్ట్ బాక్సైట్‌తో సిలికా తక్కువ మొత్తంలో ఉంటుంది. మరియు ఐరన్ ఆక్సైడ్ ఎక్కువగా ఉంటుంది. డెక్కన్ ట్రాప్ బాక్సైట్‌తో పోలుస్తే ఈ క్యాప్పింగ్స్ కొనికల్, లీనియర్ స్కార్ప్స్, పీక్స్‌గా ఒక మోస్తారి స్లోప్‌తో కూడిన ప్లాటూపైన చూడగలము. ఈ బాక్సైట్‌లో ఊలిటిక్, పిసోలిటిక్ స్ట్రక్చర్స్ ఉండవు. ఈ బాక్సైట్‌లో




గ్రాఫైట్ బెల్ట్ మ్యాప్

ముఖ్యమైన ఖనిజం గిబ్‌సైట్. ఇది కాకుండా వేరే ఖనిజాలు హెమటైట్స్ లిమొనైట్, గొథైట్ మరియు క్లే. బాక్సైట్ క్యాపింగ్స్‌ని మూడు ప్రాంతాలుగా విభజించవచ్చును. 1 అనంతగిరి గ్రూపు 2. చింతపల్లి గ్రూపు 3. గుర్తేడు గ్రూపు. మొదటి రెండు గ్రూపులను సెపరేట్ బెల్ట్‌గా గుర్తించబడినది. గుర్తేడు గ్రూప్ రెండు సబ్‌గ్రూప్‌లుగా విభజించబడినది. 1. కాటంరాజు కొండ. ఇందులో రెండు బ్లాకులు కలవు. ఇవి 1.8 చదరపు కి.మీలో విస్తరించి యున్నది. మొత్తం రిజర్వేస్ 42.60 MT ఓర్. దీని ఏవరేజ్‌గ్రేడ్ 46.76% Al2O3, దీని విడ్త్ 8 మీ నుండి 14.62 మీ ఉంటుంది.

**క్లే నిక్షేపాలు:**

క్లే నిక్షేపాలు దౌలేశ్వరం, రాజోలు, ఎర్రపాలెం, రామచంద్రాపురం, పెద్దాపురం, జగ్గంపేట, నరేంద్రపురం గ్రామాలలో రాజమండ్రి సాండ్ స్టోన్‌లో ఇంటర్ బెడ్స్ రూపంలో దొరుకుతుంది. అక్కడక్కడ కంగ్లామరేట్స్‌లో కూడా చూడవచ్చును. ఈ బెడ్స్ తిక్‌నెస్ 0.3 మీ నుండి 7.1 మీ వరకు వుంటుంది. దీని రిసోర్స్ 11.31 MTగా నిర్ధారించారు. ఈ క్లే తెలుపు, పింక్, గ్రే రంగులలో ఉంటుంది. ఈ క్లే ముఖ్యంగా కేయొలినైట్ ఖనిజం. ఈ క్లేని, సెరామిక్, పేంట్ ఎక్స్‌పోలసివ్, పాలిటెక్నిక్ పరిశ్రమలల్లో ఉపయోగిస్తారు. రాజమండ్రి సాండ్ స్టోన్‌ని కన్స్‌ట్రక్షన్ పరిశ్రమలో ఉపయోగిస్తారు.



చార్నో కైట్ శిలా

– కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com



# ఇండో- ముస్లిం శైలిలో ఆగ్రా ఫోర్ట్


## 1983లో UNESCO చే గుర్తింపు

**రాష్ట్రం:** ఉత్తర్ ప్రదేశ్

**ప్రకటితం:** 1983

**విభాగం:** కల్చరల్ (మాన్యుమెంట్)

**సార్వత్రిక విలువ:** ఆగ్రాకు చెందిన రెడ్ ఫోర్ట్ పదహారో శతాబ్దానికి చెందింది. మొఘల్ రాజు అక్బర్ దీన్ని యమునా నదీతీరంలో నిర్మించాడు. ఇప్పుడు దీన్ని షాజహాన్ గార్డెన్స్ వాయువ్య భాగంలో చూడవచ్చు. దీనికి దగ్గర్లోనే తాజ్ మహల్ ఉంది. ఈ రెడ్ ఫోర్ట్ రెడ్ శాండ్ స్టోన్‌తో నిర్మించబడింది. 2.5 కి.మీ. పొడవునా కోట గోడలున్నాయి. ఆగ్రా ఒకప్పుడు మొఘల్ పాలకుల రాజధానిగా ఉండింది. ఈ కోటలో జహంగీర్ ప్యాలెస్, ఖాస్ మహల్ (షాజహాన్ నిర్మించింది), దివాన్-ఇ-ఖాస్ వంటి సభా మందిరాలు, రెండు అందమైన మసీదులను చూడవచ్చు. ఈ కట్టడాలన్నీ కూడా పర్షియా ప్రభావంతో కూడిన ఇండో-ముస్లిం శైలిలో ఉన్నాయి.



**ప్రాథమ్యం :** (iii)


(iii) : పదిహేడో శతాబ్దంలో మొఘల్ పాలనలో ఆగ్రా కోట కీలకంగా ఉండింది. అక్కడ విలసిల్లిన నాగరికతకు అది చక్కటి నిదర్శనంగా నిలిచింది.

మొదట్లో ఇది చౌహాన్ రాజ్ పుత్ లచే యమునా నది ఒడ్డున ఒక మట్టికోటగా నిర్మితమైంది. ఎన్నో రాజవంశాలు ఇక్కడి నుంచే తమ పాలన కొనసాగించాయి. ఆరు మంది మొఘల్ రాజులు కూడా వివిధ కాలాల్లో ఇక్కడి నుంచే పాలించారు. 1300 ఏళ్ల ఉనికిలో ఎన్నో ఉత్థానపతనాలను చవిచూసింది. ప్రస్తుతం ఉన్న ఆర్కిటెక్చరల్ గొప్పదనం మాత్రం 70 ఏళ్ల వ్యవధిలో పాలించిన ముగ్గురు మొఘల్ రాజులకు చెందుతుంది - అక్బర్, జహంగీర్, షాజహాన్. వీళ్లే భారీ కట్టడాలతో ఈ గొప్ప కోటను నిర్మించారు.

అక్బర్ హయాంలో సామాన్య శకం 1560లలో సైనిక అవసరాల కోసం ఈ కోటను పునర్నించారు. కోట గోడలు 70 అడుగుల ఎత్తులో ఉన్నాయి. 1562లో ఈ కోట నిర్మాణం పూర్తయింది. ఈ కోట ఎప్పుడూ పటిష్ఠంగా యుద్ధానికి సన్నద్ధంగా ఉండేది. కోట నుంచి సైనికులు బయటకు వెళ్లేటప్పుడు వాయిద్యాలు మోగేవి. జెండాలు రెపరెపలాడేవి.

ఆగ్రా కోట భారీ దర్వాజాలు, బురుజులు, దర్బార్ హాల్స్,







భవనాలతో ఉంటుంది. వాణిజ్య ప్రాంతాలు, బహిరంగ స్థలాలతో ఉంటుంది. ఏనుగులు, గుర్రాలు కూడా ఉండేవి. ఆగ్రా కోట నిర్మాణంలో రాజ్ పుత్ శైలి, తిమురిడ్ (ఇరాన్ – మధ్య ఆసియా) శైలి మిళితం కావడాన్ని కూడా చూడవచ్చు. పొడువాటి హాల్స్, పెవిలియన్స్, కంట్రీయార్డ్స్ ఉన్నాయి. హిందూ ముస్లిం అలంకరణలతో నిర్మితమయ్యాయి. 'బెంగాల్, గుజరాత్ అద్భుతమైన డిజైన్లతో 500 భవనాలు' కోటలో ఉన్నట్లుగా అక్బర్ ఆస్థాన చరిత్రకారుడు అబుల్ ఫాజల్ పేర్కొన్నాడు. రాజ్ పుత్ కుటుంబానికి చెందిన అక్బర్ భార్య కోసం నిర్మించిన జహంగీరీ మహల్ మధ్యఆసియా ఆర్చీలను, రాజ్ పుత్ శైలిని మిళితం చేస్తుంది.



షాజహాన్ ఈ కోటకు మరెన్నో భవనాలను, మసీదులను జోడించాడు. వాటి నిర్మాణానికి పాలరాతిని వినియోగించాడు. ఎన్నో స్తంభాలతో కూడిన దివాన్ -ఇ-ఆమ్‌ను నిర్మించాడు. కోహినూర్ వజ్రం మధ్యలో మెరిసిపోతుండగా నెమలి సింహాసనంపై ఆసీనుడయ్యేవాడు. ఒక్క వందేళ్ల కాలంలోనే ఆ కోటలో మొఘల్ రాజులు ఎన్నో మార్పులు తీసుకువచ్చారు. కోట గుమ్మటాల ఎత్తు పెంచారు. ఎంతో దూరం నుంచి కూడా అవి కనబడుతుంటాయి. రాజుల ఆంతరంగిక మందిరంగా ఉండే ఖాస్ మహల్ మరింత ఆకర్షణీయతను సంతరించుకుంది. ముంతాజ్ మహల్ కోసం నిర్మించిన ముసామాన్ బురుజు అష్టభుజి ఆకారంలో ఉండేది. అక్కడి నుంచి చూస్తే యమునా నది కనిపిస్తుంది. వీటికి తోడుగా హమామ్స్, శీష్ మహల్ కూడా అందంగా నిర్మించారు.

విషాదం ఏమిటంటే షాజహాన్ తన కుమారుడు ఔరంగాజేబు ద్వారా బందీ అయింది కూడా ఇక్కడే. అక్కడి నుంచి ఆయన యమునా నదిని మాత్రమే చూడగలిగే వాడు. చరమాంకంలో ఆయన కోట దాటి వెళ్లలేకపోయాడు. తాజ్ మహల్‌లో ముంతాజ్ మహల్ సమాధి పక్కనే ఆయనను సమాధి చేశారు. వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా ఆగ్రా కోట అందరినీ ఆకట్టుకుంటోంది. ఏఎస్ఐ దీని రక్షణ, నిర్వహణ బాధ్యతలు చూస్తోంది.

– అమితా బేగ్

అనువాదం : ఎన్. వంశీ

ద











# హెరిటేజ్ పునరుజ్జీవనం

## 'ముడుమాల్ మెగాలిథిక్ మెనిహిర్స్' డిజైన్ కాంపిటీషన్

డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ నవంబర్ 21 నుండి 25 వరకు నిర్వహించిన వరల్డ్ హెరిటేజ్ వీక్ సెలబ్రేషన్స్-2024 కార్యక్రమ ముగింపు రోజు సందర్భంగా వారసత్వ పరిరక్షణలో యువతను నిమగ్నం చేయడమే లక్ష్యంగా, గ్రాడ్యుయేట్ ఆర్కిటెక్చర్ విద్యార్థుల కోసం "పునరుజ్జీవన వారసత్వం' - 'ముడుమాల్ మెగాలిథిక్ మెనిహిర్స్' పేరుతో డిజైన్ పోటీని నిర్వహించారు.

హెరిటేజ్ తెలంగాణ శాఖ సంచాలకులు ఎన్.శ్రీధర్ మార్గదర్శకాలను అనుసరించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెరిటేజ్ తెలంగాణ శాఖ రెండు బ్రోచర్లు "సెంటినరీ హెరిటేజ్ మ్యూజియం", "బౌద్ధుల సైట్ మ్యూజియం, ఫణిగిరి" విడుదల చేసింది.

వేదకుమార్ మణికొండ మాట్లాడుతూ.. ముడమాల్ మహారాతియుగం మెనిర్స్ సైట్ యొక్క విశిష్టమైన సార్వత్రిక విలువను (ఓయువి), దాని చారిత్రక మరియు సాంస్కృతిక ప్రాముఖ్యతను తెలియచేశారు. యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడాల తాత్కాలిక జాబితాలో ఈ ప్రదేశాన్ని చేర్చే లక్ష్యంతో పరిశోధన, డాక్యుమెంటేషన్ మరియు సంరక్షణ అధ్యయనాలను నిర్వహించడంలో తెలంగాణ వారసత్వ శాఖ మరియు దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (డిహెచ్ఎటి) సంయుక్త, సహకారం ప్రయత్నాలను, వివరాలను మరియు విశిష్టతలను తెలియజేశారు. ఇలాంటి సంపదను భావితరాలకు అందించడం, మానవాళి ఉమ్మడి సాంస్కృతిక వారసత్వాన్ని సుసంపన్నం చేయడం, ప్రపంచ వారసత్వ పటంలో తెలంగాణ ఖ్యాతిని నిలబెట్టడంలో వారసత్వ పరిరక్షణ కీలక పాత్ర పోషిస్తుందని ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ ఉద్ఘాటించారు.

డాక్టర్ దీపేంద్ర శర్మ మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక ఔన్నత్యాన్ని ప్రశంసించారు. రాష్ట్ర వారసత్వాన్ని పరిరక్షించడంలో తెలంగాణ వారసత్వ శాఖ చురుకైన చర్యలను అభినందించారు. ప్రభావ వంతమైన వారసత్వ పరిరక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్‌ను ఆయన ప్రశంసించారు.

డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి మాట్లాడుతూ.. వారసత్వ సంపదగా తెలంగాణ సాంస్కృతిక ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. సూక్ష్మ చిత్రాలు, గోడ చిత్రాలు, ఫిరంగులు, శాసనాలు మరియు కాలిగ్రఫీతో సహా దాని వైవిధ్యమైన సంపదను ప్రస్తావించారు. వీటన్నింటినీ జాగ్రత్తగా సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్‌తో కలిసి ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల నిర్వహణ బాధ్యత తీసుకుంది. ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, SPA, JNAFA, ఉస్మానియా యూనివర్సిటీ, Architecture Department Students, మరియు ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.









కార్యక్రమంలో అవార్డుల ప్రదానోత్సవంతో జరిగింది. విజేతలను సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌లను ప్రధానం చేశారు.

వారసత్వ పరిరక్షణలో విద్యావేత్తలు మరియు స్థానిక సంస్థలను భాగస్వామ్యం చేయడం మరియు యువతలో అవగాహన మరియు భాగస్వామ్య సంస్కృతిని పెంపొందించడం యొక్క ప్రాముఖ్యతకు ఈ సహకార ప్రయత్నం నిదర్శనంగా నిలుస్తుంది.

బి. నారాయణ, నాగరాజ్, డిప్యూటీ డైరెక్టర్స్, హెరిటేజ్ తెలంగాణ విభాగం, డాక్టర్ ఈ. శివనాగిరెడ్డి, సిఇఒ–ప్లీచ్ ఇండియా, ఇంటాక్ న్యూఢిల్లీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ దీపేంద్ర శర్మ, కోటయ్య వింజమూరి, ఏఎస్ఐ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఓయు జయశ్రీ, మరియు ఇంటాక్ హైదరాబాద్ చాప్టర్ కన్వీనర్ పి. అనురాధారెడ్డి, ఫోటోగ్రాఫర్ రమేశ్ మరియు అసిస్టెంట్ డైరెక్టర్ నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు. హెరిటేజ్ తెలంగాణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజ్ సభికులకు ధన్యవాదం తెలిపారు.

– కె. శ్యామల
e: desk.deccan@gmail.com

## పర్యావరణంపై ప్రత్యేక వ్యాసాలు



**మన దక్కన్‌ల్యాండ్** మాసపత్రికలో పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై కథనాలు, వ్యాసాలు, ఇంటర్వ్యూల పట్ల దృష్టి సారించాలని దక్కన్‌ల్యాండ్ ఎడిటోరియల్ బోర్డు భావిస్తున్నది. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కోరుతున్నాం. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం.

**రచయితలు పై అంశాల మీద లోతైన విశ్లేషణలు, విషయాలతో తమ కథనాలను పంపగలరు.**

చిరునామా :

TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

# సుస్థిర ప్రణాళికతోనే హైదరాబాద్‌కు విశ్వహోదా!

(వరల్డ్ సిటీస్ డే సందర్భంగా)

ఒకప్పుడు నగరాలను జనాభాపరంగా లేదా విస్తీర్ణం పరంగా పెద్ద నగరాలుగా చెప్పేవారు. ఇప్పుడు ఈ రెండు కొలమానాలకు పెద్దగా ప్రాముఖ్యం లేకుండా పోయింది. గత యాభై ఏళ్లుగా రకరకాల కొత్త కొలమానాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. వాటిని బట్టి ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని నగరాలకు ఏటా వివిధ ర్యాంకులు ఇస్తుంటారు. పచ్చదనం, పార్కులు, మైదానాలు, పునరుత్పాదక ఇంధన వనరులు, సుస్థిరదాయక రవాణా, ప్రజా రవాణా, గ్రీన్ బిల్డింగ్స్, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, సోషల్ ప్లానింగ్, బాధ్యతాయుత వినియోగం, వ్యర్థాల నిర్వహణ, నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, వరద నీటి నిర్వహణ వ్యవస్థ, వాన నీటి సంరక్షణ, సంస్కృతి – వారసత్వ పరిరక్షణ, జలాశయాల సంరక్షణ, కాలుష్య నివారణ, సుస్థిరదాయకత లాంటి అంశాలు ఈ ర్యాంకులలో కీలకపాత్ర వహిస్తాయి.



ప్రతీ నగరానికి మాస్టర్ ప్లాన్ అవసరం. మాస్టర్ ప్లాన్ ప్రకారమే ల్యాండ్ యూజ్ ఉండాలి. రెసిడెన్షియల్, కమర్షియల్, ఇనిస్టిట్యూషన్స్, కన్జర్వేషన్... ఇలా వివిధ అంశాలను పరిగణిస్తారు. అంతే కాదు, కనీసం 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుంటారు. ప్లానింగ్‌లో సమగ్రత ఉంటుంది. రీజనల్ మాస్టర్ ప్లాన్ రూపొందించిన తరువాతనే నగరం ప్లానింగ్ చేయాలి. అయితే చాలా సందర్భాల్లో అందుకు భిన్నంగా జరుగుతుంటుంది. హైదరాబాద్ విషయంలోనూ అదే జరిగింది. రీజనల్ స్టడీ చేయకుండానే 1981లో హైదరాబాద్ మాస్టర్ ప్లాన్ తయారు చేశారు. సాధారణంగా మాస్టర్ ప్లాన్‌ను పదేళ్లకోసారి రివైజ్ చేయాలి. రహదారుల వెడల్పు లాంటి అంశాల్లో వచ్చిన మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. ఏం ప్లాన్ చేశామో, ఏం సాధించామో చూసుకోవాలి. అలాంటిదేమీ జరగలేదు. 1981 నుంచి ఒకదాని తరువాత ఒకటిగా ఎన్నో మాస్టర్ ప్లాన్స్ వచ్చాయి. HUDA (హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ), BPA (బుద్ధ పూర్ణిమ అథారిటీ), QQSUDA (ఖులీ ఖుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ), CDA (సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ), HADA (హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ).... ఇలా ఒక్కోదానికి ఒక్కో మాస్టర్ ప్లాన్ వచ్చింది. ఇవి గాకుండా GHMC, HMDA, ORR Growth Corridorలకి వేరే మాస్టర్ ప్లాన్స్ తయారు చేసింది. MCH, కంటోన్మెంట్ తీరు మరో రకం. ఇలా హైదరాబాద్ నగరానికి ఎనిమిది మాస్టర్ ప్లాన్స్ వచ్చాయి. అవికాకుండా అవుటర్ రింగ్ రోడ్ కారిడార్‌కు వేరే మాస్టర్ ప్లాన్. వీటిని ఒక దానికి మరో దానితో సంబంధం లేకుండా తయారు చేశారు. దాంతో మొత్తం నగర మాస్టర్ ప్లాన్‌లో సమగ్రత లోపించినట్లయింది. నగరానికి ఒక డిజైన్ అంటూ లేకుండా పోయింది. సైబరాబాద్‌లో డ్రైనేజీ వ్యవస్థ కూడా లేకుండా అభివృద్ధి జరిగింది. వరద నీటి కాల్వలు కూడా లేవు. హైదరాబాద్‌కు చేరువలో రాబోయే ఫోర్త్ సిటీ విషయంలో ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలి.

అసఫ్ జాహీల కాలంలో ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా పేరొందిన హైదరాబాద్, ఆ తరువాతి కాలంలో తాత్కాలిక చర్యలతోనే ముందుకు సాగింది. సరైన డిజైన్ అంటూ లేకుండా పోయింది. మాస్టర్ ప్లాన్ ఉన్నా అమలులో కానరాకుండా పోయింది. ఏదైతే జరగకూడదో అదే జరిగింది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విధానాలు మారాయి. నిజానికి ప్రభుత్వాలు మారినా అవే ప్రాజెక్టులను, పథకాలను కొనసాగించాల్సి ఉంటుంది. నగరాల్లో

ఉండే సహజవనరులను చక్కగా వినియోగించుకోవాలి. ఓపెన్ స్పేస్‌లు అధికంగా నెలకొల్పాలి. ప్రజలకు రిక్రియేషన్ ఏరియాలు ఉండాలి. నగరాలు అభివృద్ధి చెందాలంటే... చుట్టుపక్కల గ్రామాలూ అభివృద్ధి చెందాలి. పట్నంలో పల్లె కనిపించాలి. పల్లెలో పట్నం కనిపించాలి. పట్నమైనా, పల్లె అయినా ప్రకృతితో మమేకమవ్వాలి.

అంతే కాదు, నగరాలు అభివృద్ధి చెందడంలోనూ కొన్ని పరిమితులు ఉండాలి. వలసలను నిరుత్సాహపరచాలి. వాటిని అడ్డుకునేందుకు కౌంటర్ మాగ్నెట్స్‌ను అభివృద్ధి చేయాలి. ఒక పరిమితి అంటూ లేకుండా నిరవధిక వలసలు భారీగా కొనసాగితే నగరాల్లోని మౌలిక వసతులపై భారం అధికమవుతుంది. నగరాలు మురికికూపాలుగా మారుతాయి. నరకానికి నకళ్లుగా మారుతాయి. నేడు దేశంలోని ఎన్నో నగరాలు ఇదే దుస్థితిలో ఉన్నాయి. అలాంటి దుస్థితి హైదరాబాద్‌కు రాకుండా జాగ్రత్త పడాలి. ట్రాఫిక్ నాణ్యతకు సంబంధించిన ర్యాంకింగ్స్‌లో భారతీయ నగరాలు బాగా ఇరుకైన నగరాలుగా ర్యాంకింగ్స్ పొందాయి. బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, పుణె ఇరుకైన నగరాలుగా పేరొందాయి.


ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) తన గ్లోబల్ లివబిలిటీ ఇండెక్స్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా 173 నగరాల జాబితా రూపొందించింది. ఈ విధమైన మదింపు వేసేందుకు వివిధ విభాగాల్లో 30 సూచికలను పరిగణనలోకి తీసుకుంది. సుస్థిరత్వం, ఆరోగ్య సంరక్షణ, సంస్కృతి, పర్యావరణం, విద్య, మౌలిక వసతులు లాంటివి వీటిలో ఉన్నాయి. ఈ జాబితాలో వియన్నా (ఆస్ట్రియా), కోపెన్ హేగన్ (డెన్మార్క్), జ్యూరిచ్ (స్విట్జర్లాండ్), మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా), కాల్గరీ (కెనడా), జెనీవా (స్విట్జర్లాండ్), సిడ్నీ (ఆస్ట్రేలియా), వాంకోవర్ (కెనడా), ఒసాకా (జపాన్), అకులాండ్ (న్యూజీలాండ్) ఉన్నాయి. ఇక ఈ జాబితాలో కింది పది స్థానాల్లో ఉన్న నగరాలను చూస్తే.... వరుసగా.... డమాస్కస్ (సిరియా), ట్రిపోలి (లిబియా), అల్జీర్స్ (అల్జీరియా), లాగోస్ (నైజీరియా), కరాచీ (పాకిస్థాన్), ఢాకా (బంగ్లాదేశ్), హరారే (జింబాబ్వే) ఉన్నాయి.

ఇటీవల ఒక సంస్థ జరిపిన అధ్యయనంలో 2033 నాటికి ప్రపంచంలో వేగంగా వృద్ధిచెందే పది నగరాలలో బెంగళూరు మొదటి స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో ఢిల్లీ నిలిచింది. హైదరాబాద్‌కు నాలుగో స్థానం దక్కింది. ముంబై ఐదో స్థానం పొందింది. ఆసియా, ఆఫ్రికా దేశాల నగరాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. కాకపోతే... వాటి అభివృద్ధి తీరులో ఒక క్రమం ఉన్నదా లేదా అనే అంశమే ముఖ్యమైంది.

స్మార్ట్ సిటీస్‌కు సంబంధించిన మరో జాబితాలో 88.3 పాయింట్లతో మ్యూనిచ్ మొదటి స్థానంలో నిలిచింది. హంబర్గ్ 86.2 పాయింట్లతో రెండో స్థానం పొందింది. పాలన, శక్తి–పర్యావరణం, ఐటీ – కమ్యూనికేషన్స్, మొబిలిటీ, సొసైటీ–ఎడ్యుకేషన్ అనే అంశాల ఆధారంగా ఈ ర్యాంకింగ్స్‌ను ప్రకటించారు. మరో జాబితాలో టోక్యో, సింగపూర్, సిడ్నీ, కేప్‌టౌన్, వియన్నా మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. అందమైన నగరాల జాబితాలో పారిస్, న్యూయార్క్ సిటీ, లండన్, వెనిస్ వంటివి ఉన్నాయి. ఇలాంటి జాబితాలు ఏవైనా సరే... వాటిలో భారతీయ నగరాలు ఉండాలని, అందుకు అనుగుణంగా ఆయా నగరాలు అభివృద్ధి చెందాలని మరీ ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి అందులో స్థానం దక్కాలని కోరుకుందాం.


*(రచయిత అక్టోబర్ 31న వరల్డ్ సిటీస్ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి దినపత్రికకు రాసిన వ్యాసం)*

**– వేదకుమార్ మణికొండ**
ఇంజనీర్, అర్బన్ &
రీజనల్ ప్లానర్, హైదరాబాద్










**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో** బాలచెలిమి ప్రచురించిన **సిద్ధిపేట జిల్లా బడిపిల్లల కథలు-1,' సిద్ధిపేట జిల్లా బడిపిల్లల కథలు-2', 'తురగా జానకీరాణీ – పిల్లల కథలు', 'పర్యావరణ కథల పోటీలు-2023'** అనే నాలుగు కథల పుస్తకాలు వెలువడినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాము.

ప్రతులు కావల్సిన వారు ఈ క్రింది చిరునామా నుండి పొందవచ్చును.

**విడి ప్రతి వెల: రూ.50/-**

'Bhoopathi Sadan' 3-6-716, Street No.12, Himayathnagar,
Hyderabad-500029, Telangana. Mob: 9030626288

మరియు


Nava Telangana, Manchi Pustakam
Nava Chetana, Navodaya Book House

# కృత్రిమ మేధస్సుతో

# మానవ మనుగడ ప్రశ్నార్థకమేనా..!

మానవ మేధస్సు రోజు రోజుకి రూపాంతరాలు చెందుకుంటూ కొత్త ఆలోచనలకు శ్రీకారం చుడుతుంది. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందింది అనే ప్రశ్నకు సమాధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది ఒక నిదర్శనం. మానవుని లాంటి తెలివితేటలు అవసరమయ్యే పనులను నిర్వహించగల సామర్థ్యం గల తెలివైన యంత్రాల అధ్యయనంగా సాగుతున్న సాంకేతిక మార్గాలలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నది ఎ. ఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్).

మానవ మేదస్సులో నిర్మితమైన ఆలోచనలను అభివృద్ధిని కలిగి ఉంటున్న ఒక సాంకేతికమైన నిర్మాణాత్మక విభిన్న రంగాలను త్వరితగతిన ఫలితాలను కలిగి ఉంటున్న మెషిన్ లెర్నింగ్ మరియు లెర్నింగ్ టెక్నిక్‌లను ఉపయోగిస్తుంది. మరియు పరిశ్రమలలో విస్తృతమైన అప్లికేషన్‌లను కలిగి, ముఖ్యమైన ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, ఎ.ఐ వ్యవస్థల బాధ్యతాయుతమైన అభివృద్ధి మరియు విస్తరణ కోసం సాధారణ మేధస్సుకు సంబంధించిన నైతిక ఆందోళనలు మరియు సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఎంతయినా ఉంది.




డిజిటల్ సామర్థ్యం కంప్యూటర్‌తో లేదా కంప్యూటర్ ద్వారా యంత్రిత రోబోట్‌తో సాధారణంగా తెలివైన జీవులతో అనుబంధించబడిన పనులను నిర్వహించడానికి. ఈ పదం తరచుగా మానవుల యొక్క మేధో ప్రక్రియల లక్షణాన్ని కలిగి ఉన్న అభివృద్ధి చెందుతున్న వ్యవస్థ అని చెప్పవచ్చు. 1940లలో అభివృద్ధి చెందినప్పటి నుండి, డిజిటల్ కంప్యూటర్లు గణిత సిద్ధాంతాలకు రుజువులను కనుగొనడం లేదా చదరంగం ఆడటం వంటి చాలా క్లిష్టమైన పనులను నిర్వహించడానికి ప్రోగ్రామ్లు ఎ.ఐ ద్వారా చేయబడ్డాయి.

గాబ్రియేలా రామోస్ యునేస్కో సోషల్ అండ్ హ్యూమన్ సైన్సెస్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ తెలిపిన వివరాల ప్రకారంగా దశాబ్దాలుగా బలమైన నైతిక రక్షణతో సైన్స్ మరియు టెక్నాలజీ అభివృద్ధి చెందేలా అంతర్జాతీయ ప్రయత్నానికి నాయకత్వం వహించింది.

జన్యు పరిశోధన, వాతావరణ మార్పు లేదా శాస్త్రీయ పరిశోధనపై ఏదైనా కావచ్చు, యునెస్కో శాస్త్రీయ ఆవిష్కరణల ప్రయోజనాలను పెంచడానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రమాణాలను అందించింది, అదే సమయంలో ప్రతికూల ప్రమాదాలను తగ్గించడం, అవి మరింత కలుపుకొని, స్థిరమైన మరియు శాంతియుత ప్రపంచానికి దోహదపడతాయని నిర్ధారిస్తుంది. ఇది న్యూరోటెక్నాలజీ యొక్క ఇంజనీరింగ్ మరియు ఇంటర్నెట్ వంటి అంశాలలో కొన్ని సరిహద్దు సవాళ్లను కూడా గుర్తించింది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)లో వేగవంతమైన పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా అనేక అవకాశాలను సృష్టించింది, ఆరోగ్య సంరక్షణ నిర్ధారణలను సులభతరం చేయడం నుండి సోషల్ మీడియా ద్వారా మానవ సంబంధాలను ప్రారంభించడం మరియు స్వయంగా పనుల ద్వారా కార్మిక సామర్థ్యాలను సృష్టించడం వరకు అయినప్పటికీ, ఈ వేగవంతమైన మార్పులు లోతైన నైతిక ఆందోళనలను కూడా పెంచుతాయన్నారు. కృత్రిమ మేధస్సు వ్యవస్థ పక్షపాతాలను పొందుపరచడం, వాతావరణ క్షీణతకు దోహదం చేయడం, మానవ హక్కులను బెదిరించడం మరియు మరిన్నింటి నుండి ఇవి ఉత్పన్నమవుతాయి. ఎ.ఐ తో సంబంధం ఉన్న ఎటువంటి ప్రమాదాలు ఇప్పటికే ఉన్న అసమానతల పైన ఇప్పటికే సమ్మేళనం చేయడం ప్రారంభించాయి, ఫలితంగా ఇప్పటికే అట్టడుగు వర్గాలకు మరింత హాని కలుగుతుందన్నారు.

ఈ సాధారణ-ప్రయోజన సాంకేతికతలు మనం పని చేసే, పరస్పర చర్య చేసే మరియు జీవించే విధానాన్ని మళ్లీ రూపొందిస్తున్నాయి.

ప్రపంచం చూడని వేగంతో మారబోతోంది. ఎ.ఐ సాంకేతికత అనేక రంగాలలో ప్రధాన ప్రయోజనాలను తెస్తుంది, కానీ నైతిక రక్షణ మార్గాలు లేకుండా, ఇది వాస్తవ ప్రపంచ పక్షపాతాలు మరియు వివక్షను పునరుత్పత్తి చేసే ప్రమాదం ఉందని విభజనలకు ఆజ్యం పోస్తుందని మరియు ప్రాథమిక మానవ హక్కులు మరియు స్వేచ్ఛలను బెదిరిస్తుందన్నారు.

– డా. చిటికెన కిరణ్ కుమార్
m : 9490841284
e:@gmail.com

# ప్రమాదంలో జీవవైవిధ్యం

సృష్టిలో గల జీవరాశులలో ఏ ఒక్కటి అధికం కాదు, ఏదీ తక్కువ కాదు. అన్ని సమానమే, ఒకదాని మీద ఒకటి ఆధారపడి జీవనం సాగిస్తుంటాయి. మనిషి తన ప్రతి అవసరానికి ప్రకృతి మీద ఆధారపడతాడు. ప్రకృతి లేనిదే మనిషి జీవితం లేదు. ఇది గమనించిన భారతీయ ఋషులు జీవవైవిధ్య చక్రం సక్రమంగా సాగేలా, మనిషి వాటిలో కల్పించుకునే వీలు లేకుండా మానవ ధర్మాలను వివరించారు.

నేడు భూమిపై ఉన్న అనేక మిలియన్ల వివిధ జాతుల వైవిధ్యం సుమారు 3.5 బిలియన్ సంవత్సరాల పరిణామం. మన జీవనశైలితో పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కిపోతున్నది. దీంతో జీవవైవిధ్యం దెబ్బతింటోంది. వివిధ కారణాల వల్ల ఎన్నో జీవజాతులు అంతరించిపోతున్నాయి.

ప్రపంచంలోని 12 మహా జీవవైవిధ్య ప్రాంతాలలో భారతదేశం ఒకటి. సుమారు 45 వేల వృక్ష జాతులు, దాదాపు 77 వేల జంతుజాతులు ఈ దేశంలో గతంలో ఉండేవి. కారణాంతరాల వల్ల అనేక జీవాలు కనుమరుగవుతున్నాయి. నేడు జీవ సంపదలో 10 శాతానికి పైగా ప్రమాదంలో ఉంది. చాలా జాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలలో 50 శాతానికి పైగా అరణ్యాలు, 70 శాతానికి పైగా నీటివనరులు మృగ్యమైపోయాయి. విస్తారంగా ఉన్న పచ్చిక బయళ్ళను స్వార్థ ప్రయోజనాల కోసం రూపుమాపారు. అరణ్యాలలోని వన్యప్రాణుల్ని నిత్యం వేటాడి మరీ అంతమొందిస్తున్నారు.



వ్యవసాయంలో రసాయనిక ఎరువులకు, కీటకనాశనులకు ప్రాధాన్యత పెరిగింది. మందుల కంపెనీల లాభాపేక్ష వాటిని విచక్షణా రహితంగా వాడేలా చేస్తున్నది. దీంతో నేలను, దానిపై నివసించే విలువైన జీవసంపదను కోల్పోవాల్సి వస్తున్నది. అత్యధిక కీటక నాశనులను ఉత్పత్తి చేసే దేశంగా భారత్ విరాజిల్లుతోంది. ఇటువంటి అవాంఛనీయ చర్యల వల్ల దారుణంగా నష్టపోతున్నాం. అంతేకాదు ఎన్నో జీవజాతులు కాలక్రమంలో అంతరించి పోయాయి.

భారతదేశంలో ఆదివాసులు అధికంగా ఉన్నచోట జీవవైవిధ్యం ఎక్కువగాను, పదిలంగానూ ఉంది. మన దేశంలో 53 మిలియన్ల కంటే ఎక్కువమందే ఆదివాసులు నివసిస్తున్నారని సర్వేలు చెబుతున్నాయి. వారిలో దాదాపు 53 తెగలున్నాయి. మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్‌లో 80 శాతానికంటే ఎక్కువ మంది గిరిజనులున్నారు. అక్కడే జన్యువైవిధ్యం కూడా ఎక్కువగా ఉంది. ఎన్నో పంటలలో వైవిధ్యాలు, రకాలు, ఆదివాసులు నివాసాలున్న ప్రాంతాలలోనే అధికం. ఇటీవల జన్యుమార్పిడి కూడా జీవవైవిధ్యాన్ని దెబ్బ తీస్తోంది. వీటిని రూపొందించే, ప్రవేశపెట్టే విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రక్షణ సంబంధమైన నియంత్రణలను పాటించాలి. జన్యు మార్పిడి వల్ల వచ్చే ప్రభావాలు స్వల్ప కాలంలో, దీర్ఘ కాలంలో ఎలా ఉంటాయో పూర్తిగా అధ్యయనం చేయకుండా వీటిని ఏ జీవజాతుల్లోనూ ప్రవేశపెట్టకూడదు. తొందరపడితే ప్రస్తుతం మనుగడలోని జీవజాతికే ప్రమాదం వాటిల్లుతుంది.

ఈ సృష్టిలో అన్నిటిలో ఏకత్వం ఎంత ఉందో, భౌతికంగా, మానసికంగా భిన్నత్వం కూడా అంతే ఉంది. వైవిధ్యమే సృష్టి లక్షణం అంటారు స్వామి వివేకానంద. వ్యవసాయ పద్ధతులే కావచ్చు, జీవన విధానమే కావచ్చు, ఆహారపు అలవాట్లే కావచ్చు, అన్ని సృష్టి చక్రానికి లోబడే ఉంటాయి. చెరువులో ఉండే కీటకాలను తిని కప్ప జీవిస్తుంది. కప్పను తిని పాము జీవిస్తుంది, పామును గద్ద తింటుంది, గద్ద మరణించాక దాన్ని క్రిములు తిని భూమిలో కలిపేస్తాయి. అది మొక్కలకు ఎరువుగా మారుతుంది. ఇదంతా ఒక గొలుసుకట్టు విధానం, ఒక నిరంతర ఆవృత వృత్తం. వీటిలో ఏ ఒక్క ప్రాణి అంతరించినా మిగతా అన్నిటి మీద ప్రత్యక్షంగా తీవ్ర ప్రభావం ఉంటుంది, మిగతా ప్రాణుల మీద పరోక్షంగా ముప్పు ఉంటుంది. ఇలా జగత్తులో అనేక వృత్తాలు ఉంటాయి. వాటిలో మనిషి ఏ మాత్రం జోక్యం చేసుకున్నా అది వినాశనానికి దారి తీస్తుంది. ఏ ఒక్క జీవి అంతరించినా, మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అనారోగ్యాలకు చికిత్స, వైద్యం చేయడానికి జీవవైవిధ్యం చాలా ముఖ్యం. అనేక మొక్కలు, జంతువులు, శిలీంధ్రాలను మందుల తయారీకి వాడడం చూస్తున్నాం.

ప్రపంచవ్యాప్తంగా ఏటా వేలాది జాతుల జీవరాశులు అంతరించిపోతున్నాయి. వాతావరణ సమతుల్యానికి, పర్యావరణ పరిరక్షణకు జీవరాశులను కాపాడుకోవడం అవసరం. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఇందుకోసం చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన తరుణం ఆసన్నమైంది.

*(అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా..)*

–రామకిష్టయ్య సంగనభట్ల
m : 99085 54535



జీడిగుండం, కల్లుగుండం

# జీడికల్లు తీర్థం

జనగామ జిల్లా లింగాల గణపురం మండలంలో చివరి గ్రామం జీడికల్లు. గొప్ప రామాలయక్షేత్రంగా ప్రసిద్ధి. ప్రతి కార్తీకపున్నమినాడు జీడికల్లు జాతర జరుగుతుంది.

జీడికల్లు 16వ శతాబ్దం తర్వాత కాలం నుంచి వైష్ణవపీఠంగా ప్రసిద్ధం. జీడికల్లు నుంచే చుట్టుపక్కల వైష్ణవాలయాలకు కావాల్సిన సంభావనలు, అంతేకాదు ఉద్యోగులకు జీత, భత్యాలందుతుండేవి. జీడికల్లు చుట్టు సీతారాంపురంలో రాముడు, బ్రాహ్మణపల్లి వేణుగోపాలస్వామి, సుద్దాలలో వేణుగోపాలస్వామి, గొలను కొండలో వేణుగోపాలస్వామి, అమ్మనబోలులో కేశవుడు, షారాజిపేటలో వేంకటేశ్వరుడుగా కొలువబడుతున్న కేశవమూర్తి, కొల్లూరులో వేణుగోపాల స్వామి, సాయిగూడెంలో రాముడు, ఆలేరులో రంగనాథుల ఆలయాలు ఒక వైష్ణవాలయాల గొలుసు. రాయగిరి వేంకటేశ్వరస్వామికి, యాదగిరిగుట్ట నరసింహస్వామికి కళ్యాణోత్సవాల సందర్భంగా తలంబ్రాలు జీడికల్లు నుంచే వెళ్ళేవని భక్తులు చెప్పుకుంటారు. జీడికల్లులో ఉన్న వైష్ణవ పీఠాధిపతి ఎవరో తెలియరాలేదు. దేశికులవారు ఈ దేవాలయానికి ఆస్థాన పూజారులు. ప్రస్తుతం జీడికల్లులో కృష్ణదేశికులు (ఆస్థానపూజారులు) న్నారు. వారి వారసులు వైష్ణవాలయాల అర్చక, పూజారులుగా వుండేవారు.

జీడికల్లు గురించి పురాణాలు, కైఫీయత్తులు చాలానే వున్నాయి. వాటిలో ఒకటి వీరుడనే రామభక్తుని తపస్సు ఉదంతం ఒకటి. భద్రాచలంలో భద్రుడు, వీరాచలం (జీడికల్లు)లో వీరుడు రాముని కొరకు తపస్సుచేసారని, వారిద్దరికి ప్రత్యక్షమైన రాముడు భద్రునికి భద్రాచాల రామునిగా, వీరునికి వీరాచలస్వామిగా అనుగ్రహించాడని చెప్పుకునే కథ వుంది. నిజానికి భద్రాచలానికి వీరాచలానికి సంబంధం కనిపించదు. శబరినది ఒడ్డున అడవిలో సీతారాములు, లక్ష్మణుల శిల్పాలెక్కడో వుండేవని వాటికి కంచర్ల గోపన్న గుడికట్టించిందే భద్రాచలమని ఐతిహ్యం. వీరాచలంలో రెండంచెల పరుపుబండ వుంది. కిందివైపుండే పరుపుబండమీద గుండమొకటి వుంది. చాలా వెడల్పుగా తెరుచుకుని వున్నదానిని ఇటీవల మూస్తూ వచ్చారు. ఆ గుండానికి ఆగ్నేయ దక్షిణాన శిలలో కనిపించిన వ్యక్తరూపాన్నే రాముడని పూజిస్తున్నారు.

వ్యక్తరూపం మీద వైష్ణవగురు పీఠాధిపతి ఎవరో తిరునామాలు, మీసాలు, కవచాన్ని అలంకరించారు. దానికి తీగెలు తీర్చిన చతురప్రాకారపు వెండి ద్వారచట్రం అమరించి వుంది. రామునికి దూరంగా ఎడంగా ఎడమవైపు దక్షిణం పడుమరగా సీతాశిల్పం చెక్కివుంది. అర్చామూర్తులలో సీతారామలక్ష్మణులు, సుదర్శన మూర్తి, ఆండాళు, రామానుజస్వాములున్నారు. బయట ద్వారపాలకులకు మీసాలున్నాయి. కొత్తశైలి. చతుర్భుజులు. పైరెండు చేతులతో చక్ర,శంఖాలు, గద, కటిహస్తాలతో ముందరిచేతులు, మణికిరీటాలతో, మూడువరుసల కంఠహారాలతో, దండకడియాలతో, కాళ్లుచేతులకు కడియాలతో, అంగవస్త్రాలతో, 5 అడుగుల ఎత్తున్నవి ద్వారపాలకుల విగ్రహాలు. దేవాలయనిర్మాణం, ద్వారగోపురం, ప్రాకారాలు, సత్రాలు అన్నీ 18, 19 శతాబ్దాలవే. మళ్ళీ కొత్తగా పునరుద్ధరణలు చేపట్టారు.



జీడికల్ గుడి ద్వారగోపురం

క్షేత్రపాలకుడుగా వున్న హనుమంతుడు మధ్వశైలి మూర్తే. ప్రాంగణంలో మరొక ఆంజనేయమూర్తి దక్షిణాభిముఖుడుగా, ఇంకొక హనుమంతుడు మధ్వశైలిలో భక్తాంజనేయరూపంలో వున్నాడు.

గుడికెదురుగా ప్రవేశద్వారం మీద నౌబత్ ఖానా వుంది. దేవాలయ ప్రారంభం, ముగింపు వేళలలో ఈ ద్వారం పై అంతస్తులో సన్నాయిమేళం వాయించేవారని స్థానికులు చెప్పారు. అదొక ఆలయ సంప్రదాయం.

ఈ ప్రాంతంలోని సాయిగూడెం రామునిబండకు, జీడికల్లు వీరాచలాలకు రామాయణగాథలకు సంబంధ మున్నట్లు స్థానిక ప్రజలవిశ్వాసం. సాయిగూడెంలోని రామునిబండను యోగాచలమని, జీడికల్లుని వీరాచలమని అంటారు. రాముని బండమీద వనవాససమయంలో రాముడు సీతాసమేతుడై నివసించాడని, ఇది రాముని ధ్యానప్రదేశమని, జీడికల్లు వీరాచలం మీద నిలిచి మాయలేడిని


ద్వారపాలకులు


జీడికంటి రాముడు, రామాలయమూర్తులు, లక్ష్మణుడు


హనుమాండ్లు

సంహరించాడని, అది లేడిబండ అనేచోట పడి మరణించిందని గాథ.

'లేడి పాయెరా,

బాణమేసెరా' అని పాడుకుంటారు జనులు.

"ఈ రామాలయానికి రెండు కిలోమీటర్ల దూరంలో పరుపు బండ ఉంది. దీనినే లేడిబండ అంటారు. ఈ బండకు రామాయణ గాథకు సంబంధం ఉందని ఇక్కడి ప్రజల విశ్వాసం. పర్ణశాల నుండి మాయాలేడిని వెంబడిస్తూ రాముడు ఈ జీడికల్లుకు వచ్చాడని, ఇక్కడి ఈ పరుపు బండపైన రాముడు మోకాలు ఆన్చి లేడిని సంహరించినాడని జానపదుల విశ్వాసం. అందుకే ఈ పరుపు బండకు లేడిబండ అని పేరు వచ్చింది. దీనిపై లేడి అడుగులు, నెత్తుటి మరకలు కనిపిస్తాయి. ఈ లేడిబండపైన చిన్న గుంట ఏర్పడి ఉంది. ఈ గుంట లోపలి అంచులను పరిశుభ్రమైన గుడ్డతో తుడిచినా గుంటలో నీరు ఊరుతుంది. పాప పుణ్య ఫలనిరూపణకు ఈ గుంట అంచులను తుడిచి యాత్రికులు సంతృప్తి చెందుతుంటారు. జీడికల్లు రామున్ని దర్శించే యాత్రికులు కచ్చితంగా లేడిబండను సందర్శించి, ఇక్కడి గుంటను తుడిచి, గుంటలో నీరూరినా పుణ్యాత్ములమని భావించి, ఆ తీర్థం స్వీకరించి వెళ్తుంటారు. లేడిబండ సమీపాన దూసమడుగు ఉంది. ఇది చాలా లోతైన మడుగు. మాయాలేడి సంహరణానంతరం రాముడు తన విల్లమ్ములను ఈ మడుగులోనే శుభ్రపరుచుకొన్నాడని జానపదుల విశ్వాసం." (వికీపీడియా నుంచి)

ప్రతి కార్తీకపౌర్ణమిరోజున శ్రీరామకళ్యాణం జరుగుతుంది. ఆ రోజు జరిగే జాతర వందయేండ్లకు మించి చరిత్రవున్నది. ఇక్కడి రామునికి రెండోసారి శ్రీరామనవమిన కూడా కళ్యాణోత్సవం జరుగుతుంది. జీడికల్లు రామునికి మీసాల రాముడని పేరుంది. మీసాల వీరనారాయణుడు కొలనుపాకలో వున్నాడు. మీసాల వేణుగోపాల స్వాములు కూడా వున్నారు.

ఇక్కడ ప్రతివారం పశువుల అంగడి జరుగుతుంది. ఇది ఒక పురాతన ఆచారం. ఆలేరు దగ్గర ఏడూర్ల పొలిమేర వుంది. అక్కడ పురామానవులు పున్నమిరోజుల్లో కలుసుకునేవారని, జానపదుల కథ. జీడికల్లు కూడా ఒక పొలిమేర కూడలి. కూడలిలో కూడలి దేవతలుంటారు. ఆలేరులో బంగారిమైసమ్మ వుంది. జీడికల్లులో కూడా పొలిమేర దేవత వుండాలి. అక్కడ వున్న పరుపుబండ కొత్తరాతియుగం కన్న ముందునుంచి పురామానవుల ఆవాసమని చెప్పడానికి ఆధారాలున్నాయి. ఆ పరుపుబండమీద పురామానవులు రాతిపనిముట్లు నూరుకున్న 'నూరుడుగుంటలు', బండమీద నుంచి వాననీళ్ళకు కొట్టుకొచ్చి బండ అంచుల్లో పడివున్న సూక్ష్మరాతి పనిముట్లు (చిన్న, చిన్న బ్లేడ్లవంటి కత్తిముక్కలు, పనిముట్లు తయారీకి వాడిన క్వార్ట్జ్ కందరాళ్ళు) ఈ ప్రదేశం పురామానవులకు వేలయేండ్ల నుంచి ఆవాసమై వుంటుందని చెప్పడానికి సాక్ష్యాలు. చుట్టుపక్కల గొలనుకొండ, మూట కోదూరు, కళ్ళెం, శ్రీనివాసపురం, ఆలేరు–కాచారం, రఘునాథపురం, చల్లూరు, రాయగిరులలో పెదరాతియుగం సమాధులు, నిలువురాళ్ళు, మధ్యరాతి యుగం, కొత్తరాతియుగం రాతిపనిముట్లు లభించాయి. అంతేకాదు, ఆలేరులోని పెదవాగు, ఏదులవాగు, రాయగిరి వాగుల అంచులలో పాతరాతియుగం మానవుల ఆవాసాల జాడలున్నాయని ఎస్.నాగభూషణరావు అనే పురాశాస్త్రవేత్త తన 'స్టోన్ యేజ్ కల్చర్స్ ఇన్ నల్గొండ' అనే పుస్తకంలో రాసాడు.

జీడికల్లుకు జీడికల్లు అనే పేరు రావడం వెనుక ఒక కథ వుందని చెప్తారు. జీడికల్లు రామాలయానికి పైన వున్న శివాలయాన్ని ఆనుకుని వున్న రెండు నీటిగుండాలను జీడిగుండం, కల్లు గుండం అంటారు. ఇవే రామలక్ష్మణులకు ప్రతిరూపాలంటారని నాకు పాఠశాల తెలుగు టీచర్ మల్లారెడ్డి చెప్పారు. జీడిగుండంలో స్నానం చేస్తే పాపాలు కడిగి వేయబడ్తాయని, కల్లు(తెల్ల) గుండంలో స్నానం చేస్తే పవిత్రులవుతారని భక్తుల విశ్వాసం.

ఒక గుండం నీళ్ళు తెల్లగా వుంటే అది కల్లు గుండమని, మరొక గుండం నీళ్ళు వుంటాయి కనుక జీడిగుండం అని జనం పిలుస్తారు. నిజానికి రెండింటి నీళ్ళు చిక్కగా కనిపిస్తాయంతే. గుండాలవల్ల ఈ బండకు జీడికల్లు అనే పేరు రాదు. జీడి అంటే నల్లనిది, కల్లు అంటే రాయి. జీడికల్లు అంటే జీడిలెక్క నల్లటిరాతిబండ అని అర్థం. దానిమీద


జీడికంటి బండమీద శివాలయం


జీడికంటి శివాలయం



గణపతి


జీడికంటి కల్లుగుండం


జీడికల్ శాసనం


శిథిల సత్రాలు


యాగమంటపం


జీడికల్ శాసనం


జీడికంటి నౌబత్ ఖానా

అల్లుకున్న కథలు విశ్వాసాలకు సంబంధించిన పురాణాలే.

ఈ గుండాలకు పక్కన వున్నది శివాలయం. రెండడుగుల ఎత్తున్న శివలింగానికి చతురస్రాకారపు పానవట్టం నేలమట్టంగా అమరివుంది. ఈ శివాలయానికి గణపతి సోదరి కుందమాంబ దానాలు చేసినట్లు కాకతీయ శాసనాలవల్ల తెలుస్తున్నది. ఈ గుడికి ఎదురుగా రాతిస్తంభాలతో దంగుసున్నం, ఇటుకలు, రాతిఖనీలలో నిర్మించిన యాగశాల కనిపిస్తున్నది. దానికివతల ఒక ధ్వజస్తంభంపై చిన్న లేబుల్ శాసనముంది.

*"శ్రీరామాచంద్రా*
*గుముడవెల్లి కత్తుల*
*తిమ్మరెడ్డి కొడుకు*
*అంబరెడ్డి కంభము*
*శ్రీ శ్రీ శ్రీ జయస్తు"*

అని రాసివుంది. శాసనంలోని లిపి తెలుగు. శాసనభాష 100 లేదా 150యేండ్ల కిందదై వుంటుంది. శాసనంలో 'క' 3చోట్ల 3రకాలుగా చెక్కబడ్డది. జీడికల్ సమీప గ్రామమే గుముడవెల్లి. ఈ శాసనం మీద సూర్యచంద్రులు, శంఖు, చక్రాలు చెక్కివున్నాయి. పైన యాగశాల కట్టించినపుడు ఎత్తించిన స్తంభమైవుంటుంది.

జీడికల్లులో సంస్కృతపాఠశాల వుండేది. ఈ బడిలో మాగురువు మల్లారెడ్డిగారు, రామచంద్రాపురం నుంచి వచ్చి చదువుకున్న పుల్లారెడ్డన్న విద్యార్థులు. ఆ పరంపరలో చాలా చోట్ల ఈ పాఠశాలలు ఒక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడేవట. వాటి వివరాలు చెప్పేవారు లేరు. జీడికల్లు పాఠశాల నిర్వాహకుడుగా ప్రసిద్ధ రైతుకవి, సహజకవి 'కాపుబిడ్డ' కవి గంగులశాయిరెడ్డి గారు ఉండేవారు.

జీడికల్లు రామాలయానికి దేవాలయభూములు గుంటూరుజిల్లా వట్టిచెరువుమండం, కొర్నెపాడుగ్రామంలో 12 ఎకరాలు, జీడికల్లులో 50 ఎకరాలు, పొరుగు గ్రామం గుమ్మడవెల్లిలో 35 ఎకరాల భూమున్నదట.

**కొసమెరుపు:**

నిజాము పాలనకాలంలో ప్రసిద్ధ చారిత్రక, పర్యాటక క్షేత్రం కొలనుపాకలో బహిరామియా గ్రంథాలయం ఉండేది. అదిప్పుడు శాఖాగ్రంథాలయం. అప్పట్ల ఆ గ్రంథాలయం కార్యదర్శిగా వున్న గంగరాజు రఘునాథరావు రామన్నపేట వాస్తవ్యుడైన కేశవపట్నం నరసయ్య రచించిన జీడికంటిరామ శతకం అనే రాతపుస్తకాన్ని (అముద్రితకావ్యం) తప్పులు సవరించి 1934 ఫిబ్రవరిలో అచ్చు వేయించిండు. ఆ పుస్తకానికి రఘునాథరావు రాసిన పీఠికలో శతకకవి నరసయ్య వానకొండ శతకం నిరోష్ఠ్యంగా రాసిండని తెలిపిండు. ఇప్పుడా పుస్తకం దొరుకుతదో, లేదో.



జీడికంటి రామ శతకం

జీడికంటిరామ శతకాన్ని కొలనుపాక వాస్తవ్యుడు శేషమఠం నర్సయ్య ముద్రణ కొరకు తనకిచ్చిండ్రని రఘునాథరావు రాసిండు. అచ్చుకొరకు 'కాపుబిడ్డ' కవి గంగుల శాయిరెడ్డి డబ్బిచ్చి సాయం చేసిండట.

ఈ పుస్తకంలో 100 పద్యాలున్నయి. అన్నీ సీసపద్యాలే. వ్యావహారిక భాషలో రాయబడిన శతకమిది. ఎక్కడోగాని గ్రాంథిక భాష వుండదు. తెలుగు, సంస్కృతం, ఉర్దూ, పారసీ భాషాపదాల తోని పద్యాలు సాగుతయి. పద్యాలు అంత్యప్రాసలతో రాయబడ్డయి. క నుంచి ళ వరకు అక్షరాలు ప్రాసకు వాడబడ్డయి.

1. శ్రీరామరామ నిన్ సేవింతు తొల్లింటి, నేటి నేరముల మన్నింపుమంటి
2. బరిమార్చితౌర నీ శరజాలమున లంక, ఘోరదుష్ట రక్కసుల వంక
3. తగ దాసజనుల బ్రోవగ గాంచితౌ జగ్గు, అసురాళి జేసితౌరౌర నుగ్గు
4. పవననందనుడు నీ బంట్రౌతు బల్తేజి, సురల జేసితివిగా సర్కరాజి
5. భువనాల సవరించితివిగదా నీపొట్ట, నీళ్ళపై నిలిపితౌ రాళ్ళకట్ట
6. కుబ్జ నీకేపాటి గొప్పనజరు బెట్టె, సేవ యహల్యేమి జేసెనట్టె


వైష్ణవభక్తి ప్రధానమైన ఈ పద్యాలలో విష్ణువతార ఘట్టాలు వర్ణించబడ్డయి.

**శతకంలోని తొలిపద్యం:**

సీ. *శ్రీరామ రామనిన్ సేవింతు తొల్లింటి*
*నేటి నేరముల మన్నింపుమంటి*
*ఏకాకినై బ్రోతె లోకాలనన్నింటి*
*నతిజేతు గావవే నన్ను నొంటి*
*అనిలో ప్రతాపమేమని జెప్ప నీ వింటి*
*తరిబాణముల విచిత్రంబు పొంటి*
*మునుమున్నె నినుగొల్చి ఘనడయ్యె ముక్కంటి*
*ధరమించె సిరి నీ పదంబులంటి*

తె.గీ. *ఘన దయాంబుధి వంచు నిక్కముగ వింటి*
*గావబూనెదవేని మే ల్గంటిమంటి*
*సిరుల కిరువైన జంటి శ్రీ జీడికంటి*
*ధామ సుగుణాభిరామ శ్రీరామ రామ*

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com




## భారత రాజ్యాంగం ఆమోదించి 75 ఏళ్లు పూర్తి

## రాజ్యాంగ రూపశిల్పి

# డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్

## డిసెంబర్ 6న అంబేద్కర్ వర్ధంతి

**20వ** శతాబ్ది ప్రథమార్ధ భాగంలో భారత రాజకీయ, సాంఘిక, మతవిశ్వాసాల రూపురేఖలపై చెరగని ముద్రవేసిన విప్లవ నాయకుడు, మానవ హక్కుల పోరాట యోధుడు, సంఘసంస్కర్తగా, న్యాయవాదిగా ఆర్థికవేత్తగా, ప్రజాప్రతినిధిగా, బ్రిటిష్ రాజ ప్రతినిధి కార్య నిర్వాహక మండలి సభ్యునిగా, భారత రాజ్యాంగ రూపశిల్పిగా, కేంద్ర న్యాయశాఖ మంత్రిగా, బహుముఖ ప్రజ్ఞాశీలిగా సమాజానికి సేవలు అందించి భారతరత్నమై నిలిచిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్.

1891 నుండి 1956 వరకు ఆరు దశాబ్దాల పైబడి ఆయన రచనల విస్తృతి చేసిన ఉద్యమాల ఉధృతి నడిపించిన స్వరాల సవ్వడి చూస్తే దిగ్భ్రమ కలుగుతుంది. దళితులు మహిళలు కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడాయన మతరహిత, కులరహిత ఆధునిక దేశం కోసం అంబేద్కర్ తన జీవితకాలం పోరాటము చేశారు. చిన్న నాటి నుంచే తాను ఎదుర్కొన్న అంటరానితనాన్ని ఎవరు ఎదురు కొనకూడదని అణగారిన వర్గాలకు అండగా నిలబడ్డారు. ఆయన చేపట్టిన కార్యక్రమాలు ఇప్పటికీ చరిత్రాత్మకమైనవి. డిసెంబర్ 6న ఆ మహనీయుడి వర్ధంతి సందర్భంగా ఘన నివాళి.

అంబేద్కర్‌లోని తన జీవితంలోని ముఖ్యాంశాలను తన ఆత్మకథ అయినా వెయిటింగ్ ఫర్ ఏ వీసాలో రాసుకున్నారు.


### అంబేద్కర్ జీవిత నేపథ్యము

భీమ్ రావు రాంజీ అంబేద్కర్ 1891లో ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్‌లోని మౌలో జన్మించాడు. తండ్రి రాంజీ రాంజీ సక్పాల్, తల్లి బీమా భాయ్ చిన్నతనంలోనే మరణించడంతో మేనత్త మీరాబాయి పెంపకంలో పెరిగాడు. పాఠశాల విద్య దశలోనే వివాహమైనది. అంబేద్కర్ మెట్రికులేషన్, కళాశాల విద్యను ఎల్ఫిన్ స్టన్‌లో పూర్తి చేశాడు.

అంబేద్కర్ జీవితంపై గౌతమ బుద్ధుని ఆలోచనలు, బోధనలు

విశేషంగా ఆకర్షించాయి. బెంజిమెన్ ఫ్రాంక్లిన్‌ను తనకు ఆదర్శంగా చెప్పుకున్నాడు. రనడే, రూసో జాన్ డేవిడ్, బెర్నాడు షాల ప్రభావము అంబేద్కర్ పై ఉన్నది.

బరోడా మహారాజు, మాక్స్ ముల్లర్ సహాయంతో ఆయన అమెరికాలో కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ, పీహెచ్‌డీ డిగ్రీలను పొందాడు. దేశానికి తిరిగి వచ్చి బరోడా సంస్థానంలో సైనిక సెక్రటరీగా, ఆ తరువాత బొంబాయిలో ఆచార్యులుగా కొంతకాలము పనిచేస్తూ అవమానాలను ఎదుర్కొన్నారు. మూక్ నాయక్, బహిష్కృత్ భారత్, సమత, జనత మరియు ప్రబుద్ధ భారత్ వంటి ప్రతికలను స్థాపించి సమాజంలో చైతన్యాన్ని తీసుకురావడానికి ప్రయత్నించారు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా వంటి పార్టీలను స్థాపించారు. పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ, సిద్ధార్థ కాలేజ్, షెడ్యూల్ కులాల సమైక్య లాంటి సంస్థలని ఏర్పాటు చేశారు. అసమానతలకు, కులతత్వానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నడిపించారు. చివరకు కుల వివక్ష లేని బౌద్ధాన్ని స్వీకరించారు.



**అంబేద్కర్ కుల నిర్మూలన**

కుల వ్యవస్థ పుట్టుక నిర్మాణం గురించి అంబేద్కర్ శాస్త్రీయ పద్ధతిలో వివరించాడు. ప్రాచీన భారతదేశం ఆర్యులు, మంగోలు, వంటి వివిధ జాతుల సమ్మేళనం అని పేర్కొన్నాడు. కొన్ని ప్రత్యేక సంప్రదాయాలు ఆచారాలు గల ఈ జాతులు తమ ప్రత్యేకతను నిలుపుకునేందుకు కృషి చేశాయి. ఫలితంగా విచ్ఛిన్నమై శ్రేణియుత సామాజిక వ్యవస్థగా కుల వ్యవస్థ హిందూ సమాజంలో కుల వ్యవస్థను శక్తివంతం చేశాయని పేర్కొన్నారు. మత శాస్త్రాలను సాకుగా చూపి కుల వ్యవస్థను సమర్థించడాన్ని అంబేద్కర్ వ్యతిరేకించాడు.

శ్రమ విభజన కుల వ్యవస్థకు ఆధారమని వాదనతో కూడా అంబేద్కర్ ఏకీభవించలేదు. ఏ నాగరిక సమాజంలో ఆసహజమైన పని విభజన ఉండదని కుల వ్యవస్థ శ్రమ విభజనని గాక శ్రామికులను కూడా కులాల వారీగా విభజించినదని అంబేద్కర్ విశ్లేషించారు. వ్యక్తి శక్తి సామర్థ్యాలను నైపుణ్యాలతో నిమిత్తం లేకుండా పుట్టుక ప్రామాణికంగా వృత్తులను అంటగట్టడంలో ఆర్థిక ప్రగతికి, జాతీ అభివృద్ధికి కులం ఆటంకమైనది. కనుక కుల వ్యవస్థ నిర్మూలనకు హిందూ సమాజంలో మౌలిక వ్యవస్థాగత మార్పులు రావాలని సూచించాడు. కులాంతర వివాహాలు, సామూహిక భోజనాలు నిర్వహణ ఈ విషయంలో కొంత ప్రగతిని సాధించవచ్చని పేర్కొన్నారు. పురోహితాన్ని రద్దుచేసి ప్రవేశ పరీక్షల ద్వారా పురోహితులను నియమించాలని సూచించారు. కులం ద్వారా ఒక జాతిని గాని, నీతిని గాని నిర్మించలేమని పేర్కొన్నారు.

**హిందూయిజంపై, బ్రాహ్మణిజంపై అంబేద్కర్ భావాలు**

వర్ణ ధర్మాన్ని వ్యతిరేకించి బౌద్ధమతంలో చేరాడు. హిందూ సమాజంలో వెనుకబడిన తరగతులను సాంఘికంగా దోపిడి చేసే, హింసించే వ్యక్తులుగా బ్రాహ్మణ వాదాన్ని ఆయన పేర్కొన్నాడు. వారు శూద్రులని యజ్ఞోపవీతాన్ని ధరించనీయలేదు. అలాగే విద్యకు దూరం చేశారు. హిందూ మత గ్రంథాలలో శూద్రులను అణిచివేసేందుకు అనేక అంశాలు తరువాత కాలాలలో చేర్చారని అంబేద్కర్ పేర్కొన్నారు. అంబేద్కర్ ప్రకారము బౌద్ధం బ్రాహ్మణుల మధ్య జరిగిన ఆధిపత్య పోరు నుంచి అస్పృశ్యత పుట్టుకొచ్చింది. అస్పృశ్యులు అంటే ఎవరు అనే గ్రంథంలో ఈ విషయంపై ఆయన సవివరమైన విశ్లేషణ ఇచ్చాడు. హిందూ సమాజము విశాల ప్రజానీకాన్ని శతాబ్దాల తరబడి అణిచివేసి జనజీవన స్రవంతికి దూరంగా ఉంచింది. తమ పూర్వ పద్ధతులను వదిలి, కుల వ్యతిరేక ఉద్యమంలో పాల్గొనాలని సూచించారు. మద్యపానము, జూదము విడనాడి తమ పరిస్థితిని, హోదాని మెరుగు పరుచుకోవాలని సూచించారు.

**ప్రజాస్వామ్యంపై అంబేద్కర్ భావాలు**

ప్రజాస్వామ్యంపై అంబేద్కర్ కు సంపూర్ణ విశ్వాసము కలిగి ఉన్నాడు. ప్రజా జీవితంలో రక్తపాతము లేకుండా విప్లవాత్మక మార్పులు తేవడం ప్రజాస్వామ్యంలోనే సాధ్యమని వక్కాణించారు. ప్రజలకు రాజ్య నిర్వహణలో భాగస్వామ్యము కల్పించడమే కాకుండా అసమానతలను రూపుమాపడానికి ప్రజాస్వామ్యము విస్తృత అవకాశాలని కల్పిస్తుందని పేర్కొన్నాడు. భారతదేశానికి పార్లమెంటరీ తరహా వ్యవస్థ సరియైనదని సూచించారు. పార్లమెంటరీ ప్రభుత్వంలో వారసత్వ పాలనకు తావులేదని, నిర్ణీత కాలానికి జరిగే ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పరచడం, ప్రజా ప్రతినిధుల ద్వారా పాలన జరుగుతుందని పేర్కొన్నారు. పార్లమెంటరీ వ్యవస్థ మనుగడకి బాధ్యతాయుత ప్రతిపక్షము, స్వేచ్ఛాయుత ఎన్నికలు మూల స్తంభాలని అంబేద్కర్ భావన. రాజకీయ ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే సాంఘిక, ఆర్థిక ప్రజాస్వామ్య సంస్కృతి తప్పనిసరిగా ఉండాలని నొక్కి చెప్పారు.


**పౌర హక్కులు**

ప్రజాస్వామ్య వ్యవస్థలో మాత్రమే పౌరులందరికీ హక్కులు,

స్వేచ్ఛ కల్పించగలదని పేర్కొన్నారు. ఆస్తి హక్కు తప్పనిసరి అని పేర్కొన్నాడు. సమాజంలో అన్ని వర్గాలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు సమానంగా అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చారు. వీటికి భంగం కలిగితే న్యాయస్థానాలను ఆశ్రయించేలా ఏర్పాట్లు చేశారు.

### చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు

అంబేద్కర్ చిన్న రాష్ట్రాలు సమర్థించారు. భారతీయ సమైక్యతను సామాజిక ఉద్రిక్తతలను భాష వ్యవస్థీకరణ చేయాలని సూచించారు. అన్ని భాషలను ప్రోత్సహించాలని ఆయన సూచించాడు. హిందీని అధికార భాష హోదా కల్పించడంలో జాతీయ సమైక్యతకు ఆయన తోడ్పడ్డాడు. ఒకే భాషకు చెందిన భిన్న ప్రాంతాలు చిన్న రాష్ట్రాలుగా ఏర్పాటు చేయడాన్ని ఆయన సమర్థించాడు.



### దేశ విభజనపై అంబేద్కర్ భావాలు

ప్రతి సముదాయానికి తమ మతము, సంస్కృతి కాపాడుకునే హక్కు, స్వయం ప్రతిపత్తి ఉండాలని ఆయన భావించారు. ప్రతి జాతి ఒక స్వతంత్ర సార్వభౌమ రాజ్యాంగ ప్రకటించుకుని ఉండాలని అన్నారు. అంబేద్కర్ పాకిస్తాన్ ఏర్పాటును సమర్థించడమే కాకుండా, ప్రత్యేక దళితస్థాన్ ఏర్పాటు చేయాలని కోరారు. అయితే దేశ విభజన నాటి పరిస్థితులను దృష్ట్యా ఈ డిమాండ్‌ను ఉపసంహరించుకున్నాడు.

### హిందూ కోడ్ బిల్

అంబేద్కర్ స్త్రీల కోసం చేసిన కృషిలో తల మాణికం హిందూ కోడ్ బిల్. రాజ్యాంగంలో పొందుపరిచిన స్త్రీలకు సమాన అవకాశాలను కార్య రూపం ఇచ్చే ప్రయత్నమే హిందూ కోడ్ బిల్. స్త్రీ హక్కులైనా దత్తత హక్కు, వివాహ హక్కు, విడాకుల హక్కు, బహుభార్యాత్వపు రద్దుని సూచిస్తుంది. హిందూ కోడ్ బిల్లును అంబేద్కర్ 1947 ఏప్రిల్ 11న రాజ్యాంగ సభలో ప్రవేశపెట్టాడు. ఈ బిల్లుపై దాదాపు నాలుగు సంవత్సరాలు వాదోపవాదాలు జరిగి సభ నిట్ట నిలువుగా చీలిపోయినది. ఫిరోజ్ గాంధీ, జగ్జీవన్ రామ్, దుర్గాబాయి, సుచేత, అమృత కౌర్, దేవి సింగ్, గాడ్గిల్ ఈ బిల్లును సమర్థించారు. శుక్ల భార్గవ్ మదన్మోహన్ మాలవ్య, బాబు రాజేంద్రప్రసాద్ లాంటివారు దీనిని వ్యతిరేకించారు. హిందూ కోడు బిల్ ముసాయిదాను పార్లమెంటు నిలుపుదల చేయడంతో అంబేద్కర్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు.

భారత రాజ్యాంగ పరిషత్తు సభ్యుడిగా, ముసాయిదా కమిటీ చైర్మన్‌గా సేవలం దించారు. రాజ్యాంగాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ భారత రాజ్యాంగము దానిని అమలు చేసే వ్యక్తుల మీద ఆధారపడి ఉంటుందని పేర్కొన్నాడు.

విద్య ద్వారా విశ్వవిఖ్యాతి పొందిన ఆ మహనీయుని జయంతిని ప్రపంచ జ్ఞాన దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి ప్రకటించడం ప్రతి భారతీయుడికి గర్వకారణం. అలాగే అంబేద్కర్ స్ఫూర్తిని పట్టుదలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలి.


అంబేద్కర్ పేర్కొన్న బోధించు, సమీకరించు, పోరాడు వ్యాఖ్యానాలను స్ఫూర్తిగా తీసుకొని వెనుకబడిన వర్గాలు రాజ్యాధికార దిశగా ముందుకు వెళ్లాలి.

అంబేద్కర్ సూచించిన సామాజిక న్యాయం దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడి వడిగా అడుగులు వేయాల్సి ఉంది. బలహీనవర్గాలకి సరియైన రాజకీయ ప్రాతినిధ్యం ఉండేలా కృషి చేసినప్పుడే ప్రజాస్వామ్యము పరిడవిల్లుతుందని, స్వేచ్ఛ, సమానత్వము, సౌభ్రాతృత్వము ప్రతి ఒకరి జీవనములో భాగం కావాలని అంబేద్కర్ సూచించారు.

– డా. ఎస్.యాదగిరి
m : 94928 75705


DECCAN
దక్కన్
సామాజిక, సాంస్కృతిక ఛానల్
CHANNEL





# కబిని ప్రకృతితో ఏకత్వాన్ని అనుభవిస్తోంది

విక్రమ్ నంజప్ప రచించిన కబిని ఆన్ మై మైండ్ – మ్యూజింగ్స్ ఆఫ్ ఎ నేచురలిస్ట్ చదివిన తర్వాత, నాగర్‌హెూళే టైగర్ రిజర్వ్‌లో పులుల గురించి మరింత తెలుసుకోవాలనే ఆసక్తి కలిగింది. ఇక్కడ నివసించే పులుల గురించి చెప్పని అనేక కథలు విన్న తర్వాత నేను కబినిలో దిగాను. వైవిధ్యమైన పక్షులను చూడటం మొదట నన్ను ఆకర్షించింది. జంగిల్‌ఫౌల్, పైడ్ హార్న్‌బిల్స్, వాగ్‌టెయిల్‌లు, డేగలు, చిలుకలు, ఐబిస్‌లు, కొంగలు, డార్టర్‌లు, అనేక ఇతర పక్షులు. నేను కబిని బ్యాక్ వాటర్స్ వైపు చూస్తున్నప్పుడు, మానసిక ప్రశాంతత ప్రకృతి రూపంలో సులభంగా వస్తుందని గ్రహించాను. తరువాత నేను ఏ జంతువును, పక్షిని చూడబోతున్నానో తెలియక కొంత థ్రిల్ మరియు శాంతి ఉంది. సూర్యాస్తమయం సమయంలో, ఆఫ్రికాకు సమానమైన దృశ్యాలను చూసి మంత్రముగ్ధనయ్యాను. ఆకాశం



వైలెట్ రంగులోకి మారినప్పుడు, దాదాపుగా పెయింటింగ్ లాగా ఆకాశానికి ఎదురుగా ముదురు నల్లని చెట్లను నేను చూశాను. అన్నింటికంటే ఎక్కువగా, ప్రకృతి అందించే అద్భుతమైన దృశ్యాలను చూస్తున్నప్పుడు నాలో ఏకత్వం అనుభూతి చెందింది.

సూర్యాస్తమయం తర్వాత, నేను ఎవాల్వ్ బ్యాక్, కబినిలో ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శనను ఆస్వాదించాను. నాగరహెూళె టైగర్ రిజర్వ్‌లో దొరికిన జంతువుల అంతుచిక్కని కథల గురించి డాక్యుమెంటరీ రూపొందించబడింది. డాక్యుమెంటరీ గురించి నన్ను ఎక్కువగా బాధించింది వాతావరణ మార్పుల కారణంగా ఒక నిర్దిష్ట ఏనుగు చనిపోవడం. ఆ ఏనుగు కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేసింది. నేను బాధను అనుభవించాను. ప్రకృతిలో సంఘం యొక్క భావం ఎంత లోతుగా పాతుకుపోయిందో

గ్రహించాను.

చెట్లు ఒకదానితో ఒకటి అనుసంధానించబడిన నెట్‌వర్క్‌లను మరియు ఒకదానితో ఒకటి ఎలా సంభాషించుకుంటాయో హైలైట్ చేసే పీటర్ వోహ్లెబెన్ రాసిన 'ది హిడెన్ లైఫ్ ఆఫ్ ట్రీస్' అనే పుస్తకాన్ని నేను కొంతకాలం క్రితం చదివాను. నేను నాగర్‌హోళే టైగర్ రిజర్వ్‌లో సఫారీకి వెళ్లినప్పుడు చెట్లలో ఈ ఏకత్వ భావన నెలకొంది. చెట్లలోని వివిధ రకాల ఆకుపచ్చ రంగులను చూసి నేను ఆశ్చర్యపోతానని ఊహించలేదు. కానీ నా మనస్సు శాంతించింది. నేను గాఢంగా ఊపిరి పీల్చుకోగలిగాను.



జింకల గుంపు కొన్ని మచ్చల జింకలతో పాటు దూకడం. దూకడం సజీవంగా ఉండటం అంటే ఏమిటో చూపిస్తుంది. నేను ఊహించని సమయంలో, మేము భూమిపై ఒక పులి పగ్‌మార్క్‌ని గుర్తించాము. సఫారీలో ఉత్సాహం వెల్లివిరిసింది. మేము ఊహించలేదు కానీ మేము బ్యాక్ వాటర్స్‌కి బ్యాక్ ఎంట్రీ ద్వారా వచ్చి మూడు తాబేళ్లు ఒక లాగ్‌పై విశ్రాంతి తీసుకోవడం చూశాము. సమయానికి తాబేళ్ల నుండి కదలకపోతే, రెండు పులులు సంభోగం చేసే దృశ్యాన్ని కోల్పోయేవాళ్లం. అవి చాలా దూరంలో ఉన్నా బైనాక్యులర్‌తో చూడగలిగాం. ఏడేళ్లుగా సఫారీలకు వెళ్తున్న మా గైడ్ అనిష్‌కి ధన్యవాదాలు. మేము చాలా దూరంలో ఉన్న దాన్ని గుర్తించగలిగాము. ఆ పులులను చూస్తుంటే కొద్దిమంది మాత్రమే చూసే అరుదైన దృగ్విషయంలో నేను భాగమైనట్లు అనిపించింది. నేను నెట్‌వర్క్‌లోకి తిరిగి వచ్చినప్పుడు ప్రజలకు చెప్పడానికి నాకు చాలా కథలు ఉన్నాయి.

సఫారీ ముగిసి ఉండవచ్చు కానీ నా సాయంత్రం ఇప్పుడే ప్రారంభమైంది. కొన్ని అప్పాలు వేచి ఉన్నాయి. అల్పాహారం వద్ద బెన్నె దోసెల తర్వాత, నేను ఆహారంపై ఎక్కువ అంచనాను కలిగి ఉన్నాను. నా అంచనాను అందుకుంది. నేను ఇక్కడ కబినిలో టొమాటో గ్రేవీ లేదా బెల్లం రోసగుల్లాలతో భిండిని తినాలని అనుకోలేదు. కానీ చెఫ్ టప్పన్ నేను కోరుకున్నవన్నీ పొందేలా చేసాడు.

నేను కబిని బ్యాక్ వాటర్స్‌లో సాంప్రదాయ కోరాకిల్ రైడ్‌కి కూడా వెళ్లాను. ఇది దాదాపు వియత్నామీస్ బోట్ లాగా ఉంటుంది. కానీ పరిమాణంలో పెద్దది మరియు సర్కిల్‌లలో కదలగలదు. నీలగిరిపై మేఘాలు దిగడం చూస్తుంటే, నా జీవితంలోకి మళ్ళీ ఒక విచిత్రమైన అనుభూతి ప్రవహిస్తున్నట్లు అనిపించింది. ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఇది నేను మరియు అంతులేని ఆకాశం మాత్రమే. గ్రామంలో స్థానిక ఎద్దుల బండి ప్రయాణం నాపై అదే ప్రభావాన్ని చూపింది. అది నన్ను నా మూలాల్లోకి తీసుకువెళ్లింది. సాయంత్రం గిరిజన నృత్యం సమయంలో నేను దూరంగా నృత్యం చేస్తున్నప్పుడు, అనుసరించాల్సిన సరళమైన విషయాలు వాస్తవానికి ఎంత కష్టతరమైనవో నేను గ్రహించాను. మనం ఏది తీసుకుంటామో - మన నగరాల్లో ప్రకృతి లాగా, మనకు అత్యంత శాంతిని కలిగిస్తుంది.

సాయంత్రం వేళల్లో నదిలో ప్రయాణించడం విశ్రాంతిగా ఉండేది. అలాగే, నేను సూర్యాస్తమయం క్రూయిజ్‌లో అనేక పక్షులను గుర్తించాను. పక్షులు నా సాయంత్రాలను తక్కువ ఒంటరిగా భావించాయి. నేను మరిన్ని కబిని సూర్యాస్తమయాలను చూస్తున్నప్పుడు జీవితం, మరణం మరియు మధ్యలో ఉన్న ప్రతిదాని గురించి ఆలోచించినప్పుడు, నేను అంతర్గత శాంతి అనుభూతిని పెంచుకున్నాను. స్థానిక గ్రామాలలో నివసించే ప్రకృతి శాస్త్రవేత్తలు, అటవీ ప్రాంతవాసులు, గిరిజనులు, పిల్లల జీవితాల నుండి ఇంకా చాలా నేర్చుకోవలసి ఉంది. తిరిగి వెళ్ళడానికి ఇంకా సమయం ఉంది. అప్పటికి, నేను ఉన్న చోటే ఉండి అన్నింటినీ తీసుకోవడానికి ఇది సమయం.

-విధి బుబ్నా
ట్రావెల్, కళ-సంస్కృతి జర్నలిస్ట్

ద

# రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ 11వ జాతీయ సమావేశం

హైదరాబాద్‌లో నవంబర్ 10, 11 తేదీల్లో జరిగిన రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (NCRWA) 11వ జాతీయ సమావేశానికి Er. వేదకుమార్ మణికొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణ సవాళ్లను పరిష్కరించడానికి నివాసితులు మరియు అధికారుల పాత్రపై ఆయన మాట్లాడారు. స్థిరమైన, సుపరిపాలనను నిర్మించడంలో RWAల పాత్ర గురించి చర్చించడానికి ప్లానర్లు మరియు విధాన రూపకర్తలు మరియు భారతదేశం అంతటా శక్తివంతమైన నివాస సంఘాలు ఉన్నాయి. సమావేశంలో సూచించిన పరిష్కారాలు, పర్యావరణ అనుకూలమైన, శక్తి-సమర్థవంతమైన మరియు వాటిపై అవగాహన కల్పించడం వనరుల స్ఫూర్తితో కూడిన కమ్యూనిటీలు స్థిరమైన పట్టణ అభివృద్ధిని తీసుకురావడానికి నగరాలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ప్రకృతే సౌందర్యం! **31** ప్రకృతే ఆనందం!!

# మేము నాగరిక బాటలో! మీరు అనాగరిక దారిలో!!

అది 1873వ సంవత్సరం. ఈస్టిండియా కంపెనీ కలకత్తా నగరంలో ప్రజారవాణా నిమిత్తమై ట్రామ్స్‌ను ప్రవేశపెట్టింది. పోతే, అవి యంత్రశక్తితో కాకుండా, గుర్రాలతో లాగబడేవి. కాలక్రమంలో అవి యాంత్రికశక్తికి మార్చబడినాయి. అదే కాలంలో లండన్‌లో కూడా గుర్రాల ద్వారానే బండ్లు (టాక్సీ) లాగబడేవి. దాదాపు ప్రపంచ వ్యాపితంగా గుర్రాలచే, గాడిదలచే, ఒంటెలచే, ఎడ్ల, దున్నలచే, మంచు ప్రాంతాల్లో కుక్కలచే (స్లెడ్జ్‌లను) రవాణా సాధనాలు నడపబడేవి. ఆయా దేశాల ఇతిహాసాలని, రాచరిక వ్యవస్థల్ని గుర్తు చేసుకున్నా గుర్రాలు, ఏనుగులు, ఆలమందలు మదిలో మెదులుతాయి. యుద్ధరంగంలో అయితే విధిగా, రాజుల బలాలు గుర్రాలచే, ఏనుగులచే, కొన్ని ప్రాంతాల్లో ఒంటెలచే గుర్తించబడేవి. సైనికబలంతో పాటుగా, ఈ అశ్విక, గజ బలగాన్ని బట్టి రాజుల శక్తి అంచనా వేయబడేది. కాని, నిజానికి మాకు (జంతువుల) ఆసలు యుద్ధతంత్రమే తెలియదు. తెలిసిందల్లా మీరు చెప్పినట్లు మేము నడవడమే. మీరు వీరోచితంగా పోరాడి గెలిచినా, ఓడినా, ప్రాణాలు పోగుట్టుకున్నది మేమే! ఇరువర్గాలు శత్రువులుగా భావిస్తే, ఇరువైపుల వున్న మాకు ఎలాంటి శత్రుభావన వుండదని మీరేనాడు గుర్తించలేదు. చచ్చేది మేమైతే (సైనికులు కూడా), రాజ్యాల్ని విస్తరించుకున్నది మీరే!




గుర్రపు పందాలు, కోడి పందాలు, పొట్టేళ్ళ పోట్లాటలు మీ గొప్పతనాలకై ఏర్పాటు చేసుకున్నవే! మీరు రెచ్చగొట్టడంతో మేం పోట్లాడు కోవడం తప్ప, మాకు వైషమ్యాలే తెలియవు. గెలుపు, ఓటములు మాకసలే తెలియకున్నా, మీ విజయాన్ని మీసాల్ని మెలివేసుకొని చెప్పడం మీ దుర్బుద్ధికి చిహ్నం. అమెరికా పోలో గ్రౌండ్ నుంచి స్పెయిన్ బుల్‌ఫైట్, ఎడారి దేశాల్లో ఒంటెల పోటీలదాకా (అనాద బాలల్ని కొనితెచ్చి, వాటిపై ఎక్కించి వినోదం చూడడం) రాజస్థాన్ బికెనేర్‌లో ఒంటెల విన్యాసాలు, తమిళనాడు జల్లికట్టు, కర్నాటకలో దున్నలతో బురదగుంటల్లో పరుగు (సినిమా: కాంతారా), కోనసీమ కోడిపుంజుల జూదం... తదితర జంతువుల పోటీలు, విన్యాసాలు, సరదాలకు, షికార్లకు, వినోదాలకు, విలాసవంతానికి, దోచుకున్న సొమ్మును దుబారగా ఖర్చు చేయడానికే!

ఇలా ఎన్ని ఉదాహరణలు చెప్పినా మా జంతుజాతి శ్రమ వెలకట్టలేనిదే! శ్రమ మాదైతే, భోగం మీది. త్యాగం మాదైతే సౌఖ్యాలు మీవి. ఇక వ్యవసాయ రంగంలో, అనుబంధ రంగంలో, ఎద్దు, దున్నలు, ఒంటెలు, గాడిదలు, గుర్రాలు చేసే శ్రమ ఏనాడు మీ జాతీయ స్థూల ఉత్పత్తిలో లెక్కకు రాలేదు. రావడం లేదు. ఇక ఆహార విషయంగా గొడ్లు, మేకలు, గొర్రెలు, పందులు, బాతులు, కోళ్ళు, కుందేళ్ళు, పక్షులు, జలచరాలైన చేపలు, రొయ్యలు, పీతలు, నత్తగుల్లలు, పాల విషయంగా ఆవులు, గేదెలు, మేకలు, ఒంటెలు... మీ మానవసేవకే అంకితమై పోయాయి. చివరికి కుక్కలు, పాములు కూడా మీ దృష్టినుంచి తప్పించుకోలేక పోయాయి. ఈ భూమిపై మా జంతువులు ఒక్క రోజు సమ్మె చేసాయనుకోండి... ఏం జరుగుతుందో ఊహించండి!

మా జంతు ప్రపంచం గూర్చి, మీ మానవ దాష్టికం గూర్చి, ఎంత చెప్పుకున్నా తక్కువనే! మానవ విన్యాసాలతో కూడుకున్న సర్కసులు కూడా మా జంతువుల విన్యాసాలు లేకుండా ప్రదర్శించబడవని తేలిపోయింది. సర్కసులలో జంతువుల నిషేధం తర్వాత అవి మూతపడ్డాయి. కోతులు, ఎలుగుబంట్ల విన్యాసాల్ని నియంత్రించడంతో వీటిపై ఆధారపడే కుటుంబాలు ప్రత్యామ్నాయ మార్గాల్ని వెతుకోవాల్సి వస్తున్నది. పాముల, గంగిరెద్దుల ఆటలు ఆడించే కుటుంబాలది ఇదే స్థితి! స్వేచ్ఛగా జీవించే మమ్మల్ని జంతు ప్రదర్శనశాలలో నిర్బంధించడంతో మా జీవన ప్రమాణం తగ్గిపోతున్నది. మీ దృష్టిలో మాకెంతో మేలు చేస్తున్నామని భావిస్తారు. కాని, అవి మాపాలిట యమకూపాలు. మీ వినోదానికి మమ్మల్ని బలిపశువుల్ని

> **మనమంతా సజీవ సమాధులం. విచ్చలవిడిగా జంతువులను చంపి తింటున్నాం. జంతువులు నా స్నేహితులు. నా స్నేహితుల్ని నేను భుజించలేను. శాఖాహారిగా సుమారు 70 సంవత్సరాలు జీవించిన**
>
> – జార్జ్‌బెర్నాడ్‌షా

చేస్తున్నారు. ఇక్కడ కూడా మాకు పెట్టాల్సిన ఆహారాన్ని దొంగచాటుగా కాజేస్తారు. (చూడు మలయాళ సినిమా: GRRR...) మమ్మల్ని మచ్చిక చేసుకొని, మా శరీరానికి మించిన బరువుల్ని మోయిస్తారు. లాగిస్తారు. దుక్కుల్ని దున్నిస్తారు. పెద్ద పెద్ద దుంగల్ని దొర్లింపచేస్తారు. పోలీసుల్ని మించిన రక్షణకై మమ్మల్ని మీ ఇండ్లకు, ఆస్తుల రక్షణకు జంతువులనే వాడుకుంటున్నారు. మీ ఆనందానికి జలచరాలచే (డాల్ఫిన్) విన్యాసాలు చేయిస్తారు. కాని, ఈ శిక్షణ వెనుక ఎంత క్షోభ్యత వుంటుందో ఏనాడు ఆలోచించరు. రథాల్ని, గుర్రపు బగ్గీలను, కచ్చడాలను లాగించారు. యాంత్రిక ప్రయాణ సాధనాలు రాకముందు మా గుర్రాలే కదా అతివేగవంతమైన ప్రయాణ సాధనాలు. అందుకే కాబోలు మా గుర్రాల పేరుననే మీ యంత్రశక్తిని గుర్తిస్తారు. అయినా మాకు ఒనగూరే ప్రయోజనం ఏమీలేదు.




ట్రామ్‌ను లాగుతున్న గుర్రం (నమూనా)

మీ వికాసానికి, అర్థికాభివృద్ధికి, వ్యవసాయనికి, రవాణాకు, ఆహారానికి, వినోదానికి, అలంకరణ, సౌందర్య వస్తువులకు, మాచర్మాల్ని వొలిచి మీ శరీరఅందాల్ని కాపాడుకోవడానికి, పాలకు, మీగడకు, నెయ్యికి, మజ్జిగకు, నోరూరించే తియ్యటి పాల పదార్థాలకు, మీకు కావాల్సిన కొవ్వులకు, ప్రోటీన్లకు, సుగంధ పదార్థాలకు (కస్తూరి), ఒకటేమిటి యావత్ మానవ జీవితం, దినచర్య, ఉచ్వాస, నిశ్వాసాలకు మేమే వనరులం! కారకులం! మీ దేశాల, ప్రాంతాల ఆర్థిక ప్రగతిలో, స్థూల జాతీయోత్పత్తిలో మా వాటానే అత్యధికం. (దేశాల స్థూల జాతీయోత్పత్తిలో 55 శాతం ప్రకృతి, జంతువుల నుంచే). అయినా ఆ లెక్కలకు మమ్మల్ని ఏనాడు కర్తల్ని చేయలేదు. ఈ ప్రగతికి కేవలం మీ మానవ వనరులు, శక్తులే కారణమని, పాలకులే ప్రధాన సూత్రదారులనే లెక్కలు చెప్పుకుంటారు. ఇదెంత అన్యాయమో ఏనాడు ఆలోచించడంలేదు. మీ వ్యాపారాలకు, యజ్ఞాలకు యాగాలకు, పండగలకు, పబ్బాలకు, కోరికల్ని తీర్చుకునే మొక్కుల చెల్లింపులకు మమ్మల్నే కదా బలిపశువుల్ని చేసేది. పసిబాలల్నే బలి ఇచ్చే మీ సంస్కృతికి మేము లెక్కకు రాలేము కూడా!

బాధాకరమైన విషయమేమంటే, మానవులపై జరిగే హత్యాకాండలపై కనీసం చర్చలు, శిక్షలు వుంటాయి. కాని, మాపై జరిగే హత్యాకాండకు మాట్లాడేవారెవరు. (పైపైన కొంత చర్చ వున్నది). పైగా మా జంతువుల మారణకాండ, మానవుల హక్కుగా ప్రపంచవ్యాపితంగా చలామణిలో వుండడం గమనార్హం! పోతే, కొన్ని మతాల, వర్గాల వారు మాత్రం జంతువుల విషయంగా గౌరవంగా వుంటూ, మాంసాహారాన్ని మానండని, తినవద్దని, శాఖాహారానికి మారండని ప్రచారం చేస్తున్నారు. (ఆహారపు గొలుసులో భాగంగా ఈ చర్చ చేయడం లేదు).

**వైద్యో.... అశ్వం:**

మా జంతువులు శ్రమకు, వినోదానికే ననేది అత్యధికుల భావన! కాని, మీ వైద్యవిధానంచే స్వస్థత చేకూర్చని రుగ్మతల్ని మా జంతువులు తగ్గిస్తాయని అనేక ఉదాహరణలు చూపుతున్నాయి.

> **టెబుల్‌పై మనం వాడే ఫోర్క్ - హింసాత్మకమైన ఆయుధం.**
>
> -మహాత్మాగాంధీ

**మానవుడే మహా తిండిపోతు**

ప్రపంచ వ్యాపితగా సంవత్సరానికి 360 మిలియన్ టన్నుల మాంసాన్ని మానవులు వినియోగిస్తున్నారు. ఇందులో రోజువారిగా

- 202 మిలియన్ల చికెను
- 3.8 మిలియన్ల పందులు
- 1.4 మిలియన్ల మేకలు
- 9 లక్షల ఆవులు వినియోగించ బడుతున్నాయి.

ఇందులో జలచరాలను చేర్చలేదు.

**మానవుడే జంతువర్గంలో అతిక్రూరుడు**

- జంతువుల మాంసాన్ని పొందడానికి వాటిని బోనుల్లో, చీకట్లో, గాలిరాని ప్రదేశాల్లో దారుణంగా బంధిస్తారు.
- వాటికి సరియైన ఆహారం, నీరు, సూర్యరశ్మి కూడా దొరకదు.
- కనీసం తిరగడానికి స్థలం వుండదు.
- జంతువులను చంపడానికి అశాస్త్రీయ పద్ధతుల్నే వాడతారు. అవి హింసకు గురికాకుండా చంపాలనే నిబంధనలు ఎవ్వరు పాటించరు.

**మానవ వికాసానికి జంతువులే బలిపశువులు:**

- పరిశోధనల కోసం, వైద్యవిధానాల అభివృద్ధి కోసం, కొత్త మందుల పరిశీలన కోసం ప్రపంచ వ్యాపితంగా ప్రతి సంవత్సరం 115 మిలియన్ జంతువులు వినియోగించ బడుతున్నాయి. వీటిలో అత్యధికంగా కుందేళ్ళు, గునియా పిగ్స్, కుక్కలు, పిల్లులు, కోతులు, ఎలుకలు. ఇవి కాకుండా కళాశాల ప్రాక్టికల్స్‌లో కప్పలు, ఎలుకలు, బొద్దింకలు తదితర జంతువులకు లెక్కేలేదు.
- ఈ జంతువుల తల, ఎముకల్లో, రంధ్రాలు చేస్తారు. మత్తుమందు ఇస్తారు. చర్మాల్ని ఒలిచి కాలుస్తారు. రంపాలతో కోస్తారు.
- వాషింగ్ పౌడర్ల, సబ్బుల సౌందర్య సాధనాల షాంపుల, రంగుల పరీక్షలకు కూడా వీటిపై ప్రయోగాలు చేస్తారు.

(TOI : 18/5/24).

**కనుమరుగైతున్న జీవరాశి – ఉనికిని కోల్పోతున్న భూగోళం!**
**లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ – 2024**
(Living plannel Report)

పర్యావరణ విపత్తులు మన ఊహకు అందనంత వేగంగా జరిగిపోతుంటే, జీవావరణ వ్యవస్థలు రోజురోజుకు పతనమై పోతున్నాయి. ప్రకృతిపై, విభిన్న జీవావరణ వ్యవస్థలపై మానవుడి ఆధిపత్య ధోరణి, విధ్వంసం, వినియోగం, యావత్ జీవరాశిపై తీవ్ర ప్రభావం చూపుతున్నది తెలిసిందే! వీటి ఫలితంగా గత 50 సంవత్సరాలుగా దాదాపు అన్ని రకాల జీవులు భూగోళం నుంచి సెలవు తీసుకుంటున్నాయి. కనుమరుగై పోతున్నాయి.

ఈ విషయంగా, వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (WWF), జువాలోసికల్ సొసైటీ ఆఫ్ లండన్ (ZSL)లు సంయుక్తంగా ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి భూమిపై విభిన్న జంతువుల స్థితిగతుల్ని, ఉనికిని, జీవన విధానాన్ని, ప్రస్తుత మనుగడ, వాటి సంఖ్యను (జనాభా), వాటిపట్ల మోగుతున్న ప్రమాద ఘంటికల్ని, ప్రపంచవ్యాపితంగా గల పర్యావరణ సంస్థలతో కలిసి 1998 నుంచి రూపొందిస్తున్నాయి. గత అక్టోబర్‌లో ఈ సంస్థ 2024 సంవత్సరపు నివేదికను విడుదల చేసింది. అందులోని కొన్ని ముఖ్య అంశాలు ఈ విధంగా వున్నాయి.

- పరిశీలించిన కాలం – 1970–2020 – 50 సం॥
- పర్యవేక్షించిన జంతుజాలం – 34,836
- పర్యవేక్షించిన వెన్నెముక జంతువులు – 5,495
- కనుమరుగైన జీవులు – 73%

**ఆవాసాల వారీగా – జంతువులు**

- మంచినీటి జీవులు – 85%
- భూచరాలు – 69%
- సముద్ర జీవులు – 56%

**ప్రాంతాల వారీగా – జీవుల కనుమరుగు**

- లాటిన్ అమెరికా, కరేబియన్ – 95%
- ఆఫ్రికా – 76%
- ఆసియా, ఫసిఫిక్ – 60%
- ఉత్తర అమెరికా – 39%
- యూరోప్, మధ్యఆసియా – 35%




*మే 4, 2024న ఖాట్మండులో జరిగిన జంతూహింస వ్యతిరేక ప్రదర్శనలో వ్యాసకర్త*

**అతి శీఘ్రంగా కనుమరుగైతున్న జంతువులు:**

- హాక్స్‌బిల్ టర్టల్ – ఆస్ట్రేలియా – 1990–2018–57%
- చిన్‌స్ట్రాప్ పెంగ్విన్ – అంటార్కిటిక్–1980–2019–61%
- చినూక్ సాల్మన్ – కాలిఫోర్నియా–1970 నుంచి – 88%
- అమెజాన్ రివర్ డాల్ఫిన్ – బ్రెజిల్–2020–2022–65%
- ఆఫ్రికన్ ఫారెస్ట్ ఎలిఫెంట్–ఆఫ్రికా–2004–2014–61%
- ఇండియన్ ఎలిఫెంట్–ఇండియా–2017–2023–20%
- ఇండియన్ రాబందులు – 2002–2022
- వైట్‌రంప్డ్ వల్చర్ – 67%
- ఇండియన్ వల్చర్ – 48%
- స్లెండర్ బిల్ద్ వల్చర్ – 89%

గుర్రపు స్వారీతో పోలియోలాంటి రుగ్మతల్ని తగ్గించవచ్చని హైదరాబాద్‌లో గుర్రపుస్వారికై శిక్షణ ఇస్తున్న వారు చెపుతున్నారు. నేర్చుకుంటున్న వారు కూడా టివి (వి6) ఛానళ్ళకు తెలపడం గమనార్హం. బ్రిటన్‌లో జంతువులతో వైద్యంపై మాస్టర్ డిగ్రీ పొందిన క్లినికల్ సైకాలజిస్టు అంజనా తంపే కూడా ఈ




*ఖాట్మండులో వ్యాసకర్త*

విధానాన్ని పాటిస్తున్నారు. చాలా కాలంగా గుర్రాల సహచర్యంతో ముఖ్యంగా మానసిక సమస్యలు పరిష్కరించబడుతాయని ఆమె తెలుపుతున్నారు. హార్స్ టు హ్యూమన్ (H to H)ను తమిళనాడులోని ఆరోవిలేలో స్థాపించిన మిర్రాబెల్లే లిండెమన్ (Mirrabelle Lindemann) ప్రకారం జంతువుల సహచర్యంతో వైద్యం (animal`assisted therapy) పురాతన కాలంలో కుక్కలతో జరిపేవారని, ఇప్పుడు పెంపుడు జంతువులన్నింటితో ఈ విధానం కొనసాగుతున్నదని, ముఖ్యంగా గుర్రాలతో నరాల బలహీనతల్ని, మాటలు సరిగారాని పిల్లలకు మాటలు వచ్చేలా చేయడానికి ఈ విధానం బాగా పనిచేస్తుందని, ఈ కేంద్రానికి 2–70సం॥ వయస్సుల వారు వచ్చి చికిత్సలు పొందుతున్నారని ఆమె తెలిపారు. (TOI : 5/10/24).

## పాఠకులకు వినమ్రంతో...

**జూ**లై 2020 నుంచి ప్రకృతివరణంతో రాస్తున్న కథనాలకు ఈ సంచికతో నాలుగున్నర సంవత్సరాలు! ఇందులో 2023 దాకా **'ప్రకృతే నియంత్రిస్తుంది! ప్రకృతే శాసిస్తుంది'** అనే శీర్షికతో 36 కథనాల్ని (17 అంశాలపై) రాయడం తెలిసిందే. ఈ విషయాల్ని జూన్ 2023 సంచికలో ప్రస్తావించడం జరిగింది. జులై 2023 నుంచి **'పకృతే సౌందర్యం! ప్రకృతే ఆనందం!!'** శీర్షికన మానవుడి పుట్టక ముందునుంచే ఈ భూమిపై పురుడు పోసుకొని, మనుగడ సాగించిన కోట్లాది జీవరాశి మానవుడి ప్రభావంతో ఎలా తనువుల్ని చాలిస్తున్నాయో, భూగోళం నుంచి ఎలా సెలవు తీసుకుంటున్నాయో సవివరంగా వివరించడం జరిగింది. ఇలా 18 నెలలుగా పాఠకులకు అందించిన కథనాలు పూర్తి సమగ్రం కాకపోవచ్చు! కాని, యావత్ జంతు ప్రపంచానికి (జనాభా) ప్రాతినిథ్యం వహిస్తాయి. ఇంకా వివరాలు కావల్సిన వారు, ఆయా కథనాల సందర్భంగా ప్రస్తావించిన అనుబంధాల్ని, సహ గ్రంథాల్ని, నివేదికల్ని చూడవచ్చు!

జీవుల మనుగడ, కనుమరుగు గూర్చిన పూర్తి సమాచారానికి Living Planet Reports 2022, 2024 లను చూడగలరు.


ప్రకృతి సూత్రాలలో (18) ఎనిమిదింటిని సందర్భాను సారంగా విశ్లేషించి, అన్వయించడం జరిగింది. వీలును బట్టి మిగతా 10 సూత్రాల్ని విశ్లేషించే ప్రయత్నం చేద్దాం! అయితే ఈ ప్రయత్నం దక్కన్‌ల్యాండ్ పత్రికదో, వేదకుమార్ గారిదో, ఈ కథనాల రచయితదో అని భావించకుండా, ప్రతి పౌరుడిదిగా భావించాలని కోరుతూ..

గత నాలుగున్నర సంవత్సరాలుగా నన్ను ప్రోత్సహించి, ఆదరించిన దక్కన్‌ల్యాండ్ ఎడిటర్ ఎం. వేదకుమార్‌కు, కార్యాలయ సిబ్బందికి, పాఠకులకు సదా కృతజ్ఞుణ్ని.

**రచయిత**
**– డా॥ లచ్చయ్య గాండ్ల**

### అరిస్టాటిల్ – కుక్కలు

ఆధునిక సైన్సు పితామహుడు తత్వవేత్త అరిస్టాటిల్, మానవులకు, కుక్కలకు గల సంబంధాల నేపథ్యంలో స్నేహితం మూడు రకాలని మొదటిది పరస్పర లాభాన్ని ఆశించేది, రెండోది పరస్పర ఆనందాన్ని పొందేది కాగా,మూడోది పరస్పర గౌరవాన్ని పొందేది అని విశ్లేషించాడు. ఈ మూడో రకం స్నేహితం మీ మానవుల్లో కొందరిలో వుంటే వుండవచ్చు గాని, జంతువులు మాత్రం ఈ మూడో కోవకు చెందినవే. అందుకే కాబోలు ఆయన కుక్కల్ని అమితంగా ప్రేమించేవాడు. టాటాగ్రూప్ అధినేత రతన్‌టాటా కూడా ఇలాంటి ఆలోచనాపరుడే కావడం గమనార్హం!




### స్వార్థమే మీ (మానవ) పరమార్థం!

ఈ మాట మీకు నచ్చక పోవచ్చు! కాని, మానవ సమాజం ఎదిగిన నాటి నుంచి మీది స్వార్థ చింతననే! ఈ విషయం మీనైజం గూర్చి రాబర్ట్ గ్రీనె (Rober Greene) రాసిన మానవ గుణాలు (The Laws of Human Nautre) చదవండి. ఆయన మీ గూర్చి ప్రస్తావించిన 18 సూత్రాలు అక్షర సత్యాలు కావా? అందులో చివరి సూత్రం (18) చావును వాయిదా (Meditate on our common Mortality) వేయడం గూర్చిన చింతనను మాపట్ల ఏనాడు ఆలోచించలేదు. పైగా, మాపై వేటు, వధ, వలవేసి పట్టడం, టక్కుటమారాలతో బోనుల్లో పడేలా చేయడం అనాదిగా జరుగుతున్నదేగా! కనీసం ఇప్పుడన్నా మామానాన మమ్మల్ని బతకనీయండి!

### చివరగా..

మా జంతు ప్రపంచం గూర్చి, మా ప్రాముఖ్యత గూర్చి, పర్యావరణ రక్షణలో, ఆహారపు గొలుసులో మా పాత్ర గూర్చి (గత సంవత్సరం జూన్ 2023 నుంచి) సవివరంగా మీ దృష్టికి తేవడం జరిగింది. ప్రకృతి పరంగా జరుగుతున్న విధ్వంసం గూర్చి, భూగోళం ఎదుర్కొంటున్న విపత్తుల గూర్చి కూడా చర్చలు జరుగుతున్నా, ఆశించిన ఫలితాలు రావడం లేదు. మా జంతువుల వినాశనం ఎదేచ్ఛగా కొనసాగుతూనే వున్నది. కొన్ని పూర్తిగా కనుమరుగైతే, మరికొన్ని ప్రమాదపుటంచున వున్న విషయాల్ని కూడా మీ ముందుచాం! ఆలోచించు కోవాల్సింది మీరే!

**ఈ వ్యాసపరంపరలో ఇది చివరి కథనం!**

> **మానవులకే కాదు – జంతువులకు పౌర (జంతు) హక్కులుంటాయి. 1955లో తెల్లవారికి (మాంసాహారి) బస్సులో పక్క సీటులో కూర్చోవడానికి నిరాకరించిన ఆఫ్రికన్ – అమెరికన్ మహిళ** *– రోసా పార్క్స్*

***(ప్రకృతి, జంతు ప్రేమికులకు, ఉద్యమకారులకు ఈ కథనాలు అంకితం.)***

**– డా॥ లచ్చయ్య గాండ్ల,**
m : 9440116162
e : drglachaiah@gmail.com



# సింగరేణి సోలార్ విద్యుత్ సద్వినియోగానికి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థ

సోలార్ విద్యుత్తును నిలువ ఉంచడమే లక్ష్యం.. పైలెట్ ప్రాజెక్ట్‌గా ఒక మెగావాట్ ప్లాంట్

దీని ద్వారా ఏడాదికి రూ. 1.6 కోట్ల విలువైన సోలార్ సద్వినియోగం

ప్రయోగాత్మకంగా మందమర్రి సోలార్ ప్లాంట్‌లో ఏర్పాటు

ప్రయోగం సఫలమైతే మరో 2 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ఏర్పాటు

తద్వారా మొత్తం రూ. 4.8 కోట్ల లబ్ధి

సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ వెల్లడి

సోలార్ విద్యుత్ సద్వినియోగం, పొదుపు చర్యల్లో భాగంగా సింగరేణి సంస్థ మరో వినూత్న ఆవిష్కరణకు శ్రీకారం చుట్టింది. మందమర్రి సోలార్ ప్లాంట్‌లో పగటిపూట ఉత్పత్తి జరిగి, వినియోగం తర్వాత ఇంకా మిగిలిన సోలార్ విద్యుత్ ను వృథాగా పోనీయకుండా బ్యాటరీలో నిలువ చేసే "బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను" పైలెట్ ప్రాజెక్ట్‌గా ఏర్పాటు చేస్తోంది. సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్. బలరామ్ ఈ వినూత్న పద్ధతికి సంబంధించిన వివరాలను ఒక ప్రకటనలో తెలియజేశారు.

మందమర్రి ఏరియాలోని 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపడుతున్న ఒక మెగా వాట్ నిలువ సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ పద్ధతి వల్ల నెలకు రూ. 13 లక్షల విలువైన (ఏడాదికి రూ. 1.6 కోట్ల) సోలార్ విద్యుత్ వృథా కాకుండా సద్వినియోగం కానున్నదని తెలియజేశారు. ఈ పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతం అయితే మరో రెండు మెగా వాట్ల సామర్థ్యం గల సిస్టమ్‌లను ఇక్కడ ఏర్పాటు చేయనున్నామని, తద్వారా నెలకు దాదాపు 40 లక్షల రూపాయల (ఏడాదికి రూ. 4.8 కోట్ల) విలువైన సోలార్ విద్యుత్ సద్వినియోగం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

మందమర్రిలో సింగరేణి సంస్థ తన గనుల విద్యుత్ అవసరాల నిమిత్తం 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను 2021లో ఏర్పాటు చేసుకుంది. సొంత అవసరాల కోసం ఏర్పాటు చేశారు కనుక దీనిని "ఇన్ హౌస్ క్యాప్టివ్ ప్లాంట్"గా పేర్కొనడం జరుగుతుంది. ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును

మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలలో ఉన్న మొత్తం 11 భూ గర్భ గనులు, 4 ఓపెన్ కాస్ట్ గనులు, తదితర పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తూ వస్తున్నారు.

ఈ ప్లాంట్ ద్వారా రోజుకు సగటున ఒక లక్ష 34 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా దీనిలో సుమారు ఒక లక్ష 14 వేల యూనిట్ల విద్యుత్‌ను కంపెనీ వినియోగిస్తుంది. కానీ ఇంకా మిగిలి ఉన్న సుమారు 20 వేల యూనిట్ల విద్యుత్ ను మాత్రం వినియోగించలేకపోతుంది. మధ్యాహ్నం వేళ కార్మికులకు భోజన విరామ సమయం ఉండడం, యంత్రాలు కూడా విశ్రాంతిలో ఉండటం వలన ఈ విద్యుత్ ను వాడలేకపోతున్నారు. ఫలితంగా ఈ విద్యుత్ స్థానిక సబ్ స్టేషన్ ద్వారా తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్)కు ఉచితంగా అందజేయాల్సి వస్తుంది. ఇన్ హౌస్ క్యాప్టివ్ పవర్ ప్లాంట్ ద్వారా ఈ మిగులు విద్యుత్ రాష్ట్ర విద్యుత్ శాఖ లైన్లలో కలుస్తుంది. కనుక దీనికి డిస్కమ్ వారు ఎటువంటి ఛార్జీలు చెల్లించకుండా ఉచిత విద్యుత్తుగా పరిగణిస్తూ వాడుకుంటున్నారు.

ఈ విధంగా గ్రిడ్‌కు ఉచితంగా వెళ్లిపోతున్న 20 వేల యూనిట్ల సోలార్ విద్యుత్ ను సద్వినియోగం చేయాలన్న ఉద్దేశంతో సింగరేణి సంస్థ దీనిని నిలువ ఉంచుకొని, తిరిగి అవసరమైనప్పుడు వినియోగించుకునే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం (బి.ఈ.ఎస్.ఎస్.) ను ఇక్కడ ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ ప్రత్యేక చొరవతో ఈ సిస్టం ఏర్పాటులో అనుభవం ఉన్న కంపెనీలను ఆహ్వానించడం జరిగింది. వీటిలో కాన్పూర్‌కు చెందిన మెస్సర్స్ మార్స్ ఇండియా యాంటేనాస్ అండ్ ఆర్ ఎఫ్ సిస్టమ్స్ అనే ప్రైవేటు కంపెనీకి పైలెట్ ప్రాజెక్ట్‌గా ఒక మెగావాట్ సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఏర్పాటు పనిని అప్పగించారు.

మరి కొద్ది రోజుల్లో ఈ సిస్టం ఇక్కడ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇది ఏర్పాటైతే మధ్యాహ్నం పూట వృథా అవుతున్న సోలార్ విద్యుత్‌లో ఒక మెగావాట్ సామర్థ్యం గల విద్యుత్ ను బ్యాటరీ ఎనర్జీ సిస్టంలో నిలువ ఉంచి, రాత్రివేళ సింగరేణి అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ విధంగా నెలకు రూ. 1 3 లక్షల విలువైన సోలార్ విద్యుత్ ను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. ఇది విజయవంతం అయితే మరో రెండు మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఇక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఒక మెగావాట్ (బి.ఈ.ఎస్.ఎస్.)కు దాదాపు 2.5 కోట్లు ఖర్చు అవుతుండగా.. మూడు మెగావాట్ల ప్లాంట్లకు అయ్యే వ్యయం దాదాపు రూ.7.5 కోట్లుగా అంచనా. సోలార్ విద్యుత్ సద్వినియోగం ద్వారా ఈ ఖర్చు రెండు సంవత్సరాల లోపే తీరినున్నది.

**సొంత సోలార్ ప్లాంట్‌తో నెలకు నాలుగు కోట్ల రూపాయలు ఆదా**

మందమర్రి ఏరియాలో సింగరేణి సంస్థ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయక ముందు శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలలో గల 15 గనుల అవసరాలకు నెలకు 13 కోట్ల రూపాయల విలువైన విద్యుత్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ నుండి కొనుగోలు చేస్తుండేది. కాగా 2021 ఏప్రిల్ 17 తేదీన 28 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన తరువాత నుండి నెలకు కేవలం 9 కోట్ల రూపాయల కరెంటు బిల్లులు మాత్రమే చెల్లిస్తుంది. అంటే సోలార్ ప్లాంట్ వల్ల నెలకు నాలుగు కోట్ల రూపాయల ఆదా చేకూరింది. ఇప్పుడు ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం విజయవంతం అయితే మరో రూ.4.8 కోట్ల ఆదా చేకూరనుంది. సోలార్ విద్యుత్ సద్వినియోగానికి, పొదుపుకు సంస్థ ఛైర్మన్ తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలనిస్తున్నాయి.

**–చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్**
ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ప్రభుత్వ సంస్థ), ప్రజా సంబంధాల విభాగం, హైదరాబాద్

**చందా వివరాలు :**

విడి ప్రతి : రూ.40
వార్షిక చందా : రూ.400
2 సంIIలకు : రూ.750

'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందా చెల్లించవచ్చు.

**Account Details:**
Bank Name : Canara Bank
A/c No. : 30101010003714
BracnH : Ashoknaar, Hyderabad
IFSC Code : CNRB0013010



చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో, మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో 1990 మరియు 1991 సంవత్సరములలో వెలువడిన 'బాలచెలిమి' పిల్లల వికాస పత్రిక మంచి ఆదరణ పొందినది. బాలల్లో సృజనాత్మకతను పెంచి విజ్ఞాన వినోదాలను అందించాలన్న లక్ష్యంతో 'బాలచెలిమి' జనవరి 2024 ఆకర్షణీయమైన రంగులతో, ఎక్కువ (52) పేజీలతో పత్రికను పునరుద్ధరించామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

**మా చిరునామా :**
**బాలచెలిమి**
'చంద్రం' 3-6-712/2,
స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029,
తెలంగాణ.
Mobile : 9030626288
Email: desk.chelimi@gmail.com
website : www.balachelimi.com

# పామాయిల్ గెల – కాసులు గలగల

ఆయిల్ పామ్ రైతుకు అమ్మలా అండనిచ్చే మంత్రి తుమ్మల... ప్రస్తుతం ఏ రైతు నోట విన్నా... ఇదే మాట. అనుక్షణం పామాయిల్ రైతుల సంక్షేమాన్ని గురించి ఆలోచించే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతుకు మేలు చేసే ఏ అవకాశాన్నైనా ఉపయోగించుకుంటారు. సెప్టెంబర్ నెలలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఖమ్మం జిల్లా సందర్శించినప్పుడు వారికి ఆయిల్ పామ్ రైతుల సాధకబాధకాలు వివరించారు. నూనెల మీద దిగుమతి సుంకం తక్కువగా ఉండటం వల్ల జరిగే నష్టాన్ని వివరించారు. కేంద్ర మంత్రులు అధికారులతో అనేక మార్లు చర్చించి 5.5% ఉన్న దిగుమతి సుంకాన్ని 27.5% పెంచేటట్లు కృషి చేశారు. అందువలన 12వేల రూపాయల లోపు ఉన్న ఆయిల్ పామ్ గెలల ధర 19వేల రూపాయల పైచిలుకు పెరిగింది. దీనివల్ల రైతుల ఆదాయం పెరిగింది. కొత్తగా ఆయిల్ పామ్ తోటలు వేయాలనుకునే రైతులకు ఉత్సాహం వచ్చింది.

**ఆయిల్ పామ్ తోటలు ఎందుకు వేయాలి:**

భారతదేశ జనాభా వినియోగానికి 90 లక్షల మెట్రిక్ టన్నులు పామాయిల్ అవసరమవుతుంది. కానీ మన దేశంలో 2.90 లక్షల మెట్రిక్ టన్నులు పామాయిల్ మాత్రమే ఉత్పత్తి అవుతుంది. ఇంకా 87.10 లక్షల మెట్రిక్ టన్నుల పామాయిల్ మనం దిగుమతి చేసుకుంటున్నాం. దీనికోసం మనం 70వేల కోట్ల రూపాయలు వినియోగిస్తున్నాం. 70వేల కోట్ల రూపాయల విలువగల విదేశీ మారక ద్రవ్యం ఆదా చేయాలంటే ఇంకా మనదేశంలో 70లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడే తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్ పామ్ సాగు చేపట్టి ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ఆదర్శంగా నిలిచారు. తెలంగాణలో ఆయిల్ పామ్ సాగుకు ఆద్యుడు తుమ్మల నాగేశ్వరరావు అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. స్వయంగా ఆయన ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తూ ఇతర రైతులను ప్రోత్సహించారు. ఆ విధంగా ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో ఆయిల్ పామ్ సాగు విస్తరించింది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రైతులు సత్తుపల్లి దమ్మపేట అశ్వరావుపేట లోని ఆయిల్ పామ్ తోటలు, ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ సందర్శించి, రైతులతో సంభాషించి, సాగు మెళకువలు తెలుసుకున్నారు. ఆ విధంగా తెలంగాణ రాష్ట్రంలో ముప్పది నాలుగు వేల ఎకరాలు ఉన్న ఆయిల్ పామ్ సాగు రెండు లక్షల మూడువేల ఎకరాలకు విస్తరించింది.

ఆయిల్ పామ్ తోటలలో అంతర పంటలు వేసి రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని నిరూపించి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారు తుమ్మల నాగేశ్వరరావు. ఆయిల్ పామ్ తోటల ఆదాయం సాఫ్ట్ వేర్ జీతం కన్నా ఏమాత్రం తక్కువ కాదని చెప్పి ఇతర రైతులను ప్రోత్సహించేవారు.

**ఆయిల్ పామ్ ఆదాయం :**

ఎకరానికి 10 నుంచి 12 టన్నుల ఆయిల్ పామ్ గెలల దిగుబడి వస్తుంది. సగటున 10 టన్నులకి ప్రస్తుత ధర ప్రకారం (19,144/- టన్ను) 1,91,440/- రూపాయలు, ఇంకా అంతర పంటలపై 50,000/- రూపాయలు మొత్తం 2,41,440/- ఖర్చులు 36,000/- పోను 2,05,440/-రూపాయల నికర ఆదాయం రైతుకు వస్తుంది.



పామ్ ఆయిల్ గెలను పరిశీలిస్తున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ఉద్యాన సంచాలకులు శ్రీమతి యాస్మిన్ భాషా, తదితరులు

తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ తోటలు వేసే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా పలు రాయితీలు కల్పిస్తుంది. ఆయిల్ పామ్ మొక్కలు, అంతర పంటలు, తోటల యాజమాన్యం, డ్రిప్ సౌకర్యములకు గాను ఒక ఎకరానికి 50,918/- రూపాయలు రాయితీ ఇస్తుంది.

| పామ్ ఆయిల్‌తో వరి, మొక్కజొన్న, పత్తి పంటల ఆదాయ పోలిక | | | | | |
|---|---|---|---|---|---|
| వ.సం. | వివరాలు (ఎకరానికి) | వరి | మొక్కజొన్న | పత్తి | పామ్ ఆయిల్ |
| 1 | సాగు ఖర్చు ఎకరానికి (సం॥ రూ.) | రూ.42,320 (2 సీజన్లు) | రూ.56,000 ఎకరానికి | రూ.25,600 ఎకరానికి | రూ.36,000 (సం॥) for bearing gardens |
| 2 | ప్రధాన పంట ఆదాయం | రూ.63,480 | రూ.88,000 | రూ.38,400 | 1,91,440 (@Rs.19,144 per MT for 10 Tons of FFB per ac) |
| 3 | అంతర పంటలపై ఆదాయం | 0 | 0 | 0 | రూ. 50,000 |
| 4 | గరిష్ట ఆదాయం (సం॥ రూ.) | రూ.1,05,800 (2 సీజన్లు) | రూ.1,44,000 | రూ.64,000 | రూ.2,41,440 |
| 5 | నికర ఆదాయం (సం॥ రూ.) | రూ.63,480 | రూ.88,000 | రూ.38,400 | రూ.2,05,440 |



*పామ్ ఆయిల్ తోటను పరిశీలిస్తున్న రాష్ట్ర ఉద్యాన సంచాలకులు యాస్మిన్ భాషా, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు*

ఉద్యాన & పట్టు పరిశ్రమ శాఖ సంచాలకులు శ్రీమతి యాస్మిన్ భాషా, ఐ.ఎ.యస్., రైతులకు రాయితీలు సకాలంలో అందించడంతో పాటు వివిధ కళారూపాల ద్వారా ఆయిల్ పామ్ పథకాన్ని విస్తృతంగా జిల్లాల్లో ప్రచారం చేయిస్తున్నారు. పాటలు, రేడియో ద్వారా ప్రకటనలు, లఘు చిత్రాల ద్వారా ఆయిల్ పామ్ తోటల లాభాలు రైతులకు తెలియజేయడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులను రాజులుగా చేయాలనే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆశయాల మేరకు ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఐ.ఎ.యస్., అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్.వి. పాటిల్, ఐ.ఎ.యస్., వ్యవసాయ విస్తరణాధికారులకు తగు సూచనలు చేసి పంట మార్పిడి ద్వారా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నారు.

సంప్రదాయ పంటల ఆదాయం కన్నా నాలుగు నుంచి ఐదు రెట్లు అధిక ఆదాయం గల ఈ పంటకు కోతులు మరియు దొంగల బెడద లేదు. కూలీ ఖర్చు తక్కువ, ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఈ పంట తట్టుకుంటుంది. గిట్టుబాటు ధర కలిగిన పంట. ఇతర పంటలతో పోలిస్తే, ఆయిల్ పామ్ పంట లాభదాయకం.

ఇన్ని రకాల ప్రయోజనాలు గల ఆయిల్ పామ్ పంట రైతులు సాగు చేసి అధిక ఆదాయం పొందడంతో పాటు విదేశీ మారక ద్రవ్యం ఆదా చేయడంలో తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షిద్దాం.

– సముద్రాల విజయ్‌కుమార్
m : 8374449922
e: @gmail.com



## పర్యావరణాన్ని పరిరక్షించే

# గిరిజనుల కల్పవృక్షం!

పేదవాడి కలప, ఆకుపచ్చ బంగారంగా పేరొందిన వెదురు- అడవులకు స్థిరీకరణ శక్తిగా పనిచేస్తుంది. అడవుల్లో వర్షాల ధాటికి మట్టి కొట్టుకొని పోకుండా నిలువరిస్తుంది. అడవులపై ఆధారపడిన గిరిజనులతోపాటు, గ్రామీణుల జీవితాలతోనూ వెదురు పెనవేసుకుపోయింది. జీవనోపాధి మార్గంగానే కాకుండా, సామాజిక, సాంస్కృతిక, మతపరమైన కార్యకలాపాల్లోనూ ఒక భాగంలా మారింది. వెదురుకు ఉన్న బహుళ ప్రయోజనకర లక్షణాల కారణంగా గిరిజనులు తదితరులకు ఆదాయ, ఉపాధి కల్పనలో తోడ్పడుతోంది. గిరిజనుల వేట, ఆహార సేకరణ, వ్యవసాయ పనిముట్లు, సంగీత వాయిద్యాలు, గృహోపకరణాలు తదితరాలెన్నో వెదురుతో తయారవుతాయి. బతుకు తెరువు చూపిస్తున్న వెదురుతో గిరిజనులకు పవిత్రమైన సహజీవన సంబంధం ఏర్పడింది. పుట్టుక నుంచి మరణందాకా వారి జీవన చక్రంలోని ఆచారాల్లో వివిధ రూపాలలో వెదురుతో చేసిన ఉపకరణాలు ఉపయోగించడం సంప్రదాయంగా కొనసాగుతోంది.

దుస్తులన్నీ దేంతో తయారవుతాయి... పత్తి, పట్టూ లేదా కృత్రిమ దారాలతోనే కదా... ఇప్పుడిప్పుడు వీటితోపాటు మరో సుతిమెత్తని దారం కూడా కనిపిస్తోంది. అదే బ్యాంబూ ఫైబర్. ఒకప్పుడు ఇళ్ల నిర్మాణంలోనూ ఫర్నిచర్‌లోనూ మాత్రమే వాడుకునే వెదురు, ఇప్పుడు టెక్స్‌టైల్ రంగంలోకీ అడుగుపెట్టింది. అంతేనా... 'రోజువారీ అవసరమయ్యే ప్రతి వస్తువునీ వెదురుతో చేసుకోవచ్చు' అంటోంది నవతరం... అందుకే ఒకప్పుడు ఏ అడవుల్లోనో కనిపించే వెదురు, ఇప్పుడు పంటపొలాల్లోనూ పెరుగుతోంది.

'తినడానికి తిండీ ఉండటానికో ఇల్లూ కట్టుకోవడానికి బట్టలూ... ఈ మూడూ మనిషి కనీసావసరాలు... వీటన్నింటినీ ఇవ్వగలిగే గడ్డిమొక్కే వెదురు. అందుకే 'పుట్టినప్పుడు వేసే ఉయ్యాల నుంచి చనిపోయాక మోసుకెళ్లే పాడె వరకూ వెదురు తోడుగా ఉంటుంది...' అన్న నానుడి కొన్నిచోట్ల వాడుకలో ఉంది. దీన్ని నిజం చేస్తూ- దైనందిన జీవితంలో అవసరమయ్యేవన్నీ వెదురుతో చేస్తున్నారిప్పుడు. అంటే- వేసుకునే దుస్తులూ కప్పుకునే క్విల్ట్‌లూ తాగే బాటిలూ తినే ప్లేటూ... ఇలా సకలం వెదురుమయంగా మారే రోజు ఎంతో దూరంలో లేదన్నమాట.

'వెదురుని పెంచినా వాడినా తిన్నా... అంతా మన మంచికే... నేలను సారవంతం చేస్తూ గాలిని శుద్ధి చేస్తూ మనిషికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తూ ఆదాయాన్నీ ఇస్తోంది వెదురు పంట. కాబట్టి తృణ, చిరుధాన్యాలతోపాటు ఈ పచ్చ బంగారాన్నీ పెంచండి' అంటోంది ప్రభుత్వం. వెదురు నుంచి నారను తయారుచేసే ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టే ఆలోచనా చేస్తోంది. మనదేశంలో వెదురు కొరత తీవ్రంగా ఉండటంతో అగరుబత్తుల తయారీకి కూడా దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. అందుకే అటవీశాఖ పరిధిలోనే ఉండే వెదురు మొక్కని హార్టీకల్చరల్ విభాగంలోకి చేర్చి, పెంచేందుకు సబ్సిడీనీ అందిస్తోంది ప్రభుత్వం.

### వెదురే ఎందుకు?

మిగిలిన చెట్లతో పోలిస్తే వెదురు పది రెట్లు వేగంగా వాతావరణం నుంచి కార్బన్‌డై ఆక్సైడ్‌ను తొలగిస్తుంది... అంతే ఎక్కువగా ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. ఒక వెదురు పొద, అంతే విస్తీర్ణంలో ఉన్న చెట్టుకన్నా 35 శాతం ఎక్కువ ప్రాణవాయువుని

ఇస్తుంది. పోతే, కాగితం తయారీలో వాడే కలప గుజ్జుకోసం చెట్లను కొట్టడంతో వాతావరణం వేడెక్కడంతోపాటు అడవుల్ని తిరిగి పెంచడానికి ఏళ్లకు ఏళ్లు పడుతుంది. దాంతో కలప గుజ్జు తయారీ తగ్గింది. అందుకే ఆ చెట్లకు బదులు వెదురుని పెంచితే వేగంగా పెరుగుతుంది. ఎంతంటే- రోజుకి 35 నుంచి 47.6 అంగుళాల చొప్పున చూస్తుండగానే ఎదిగిపోతుంది. రోజుకి మూడు అడుగుల వరకూ పెరిగేవీ ఉన్నాయి. అంటే- గంటకి ఒకటిన్నర అంగుళాలన్నమాట. మొత్తమ్మీద పదీ ఇరవయ్యేళ్లపాటు పెరిగే కలపతో పోలిస్తే, వెదురు మూడు నుంచి ఐదేళ్లలోనే పెరుగుతుంది. కాబట్టే కలపకీ కలపగుజ్జుకీ చక్కని ప్రత్యామ్నాయంగా మారింది వెదురు.

**వెదురు ఉత్పత్తులెన్నో..!**

ఒకప్పుడు వెదురుతో ఇంట్లో వాడుకోవడానికీ వ్యవసాయానికీ అవసరమయ్యే బుట్టలూ తట్టలూ చేటలూ తడికెలూ... వంటివి అల్లడమే తెలుసు. గిరిజన తెగలు మాత్రం వెదురు ఇళ్లు కట్టుకుని, వస్తువులూ తయారుచేసుకుంటాయి. అందుకే దీనికి పేదవాడి కలపగా పేరు. అయితే పర్యావరణ ప్రియమనో లేదా కొత్తదనంకోసమో గానీ ఇప్పుడు అవన్నీ ఆధునికులకీ నచ్చుతున్నాయి. ఇంట్లోనూ బాల్కనీలోనూ పెరట్లోనూ వెదురు మొక్కల్ని పెంచడమే కాదు, దాంతో అల్లిన హస్తకళాకృతుల్నీ అలంకరిస్తున్నారు. రిసార్టుల్లోనూ ఫామ్‌హౌసుల్లోనూ వెదురిళ్లు కట్టుకోవడంతోపాటు ఫ్లోరింగ్ నుంచి ఫర్నిచర్ వరకూ వెదురే అందం అనుకునేవాళ్ల సంఖ్యా పెరుగుతోందిప్పుడు.



- చైనాలో పూర్వకాలం నుంచీ వెదురుతో చేసిన కాగితం వాడుకలో ఉంది. అడవుల విస్తీర్ణం రోజురోజుకీ తగ్గడంతో ప్రపంచ దేశాలన్నీ వెదురు కాగితంమీద దృష్టి సారిస్తున్నాయి. పైగా కలప నుంచి కన్నా దీంతో సులభంగా తయారు చేయవచ్చు. వెదురుగుజ్జుతో కాగితంతోపాటు డిస్పోజబుల్ పేపర్ కప్పులూ, టాయిలెట్ పేపరూ, రీయూజబుల్ ప్లేట్లూ, గిన్నెలూ, కార్డుబోర్డులూ... వంటివెన్నో చేస్తున్నారు
- ఎకరంలో పండే పత్తితో పోలిస్తే వెదురు నుంచి యాభై రెట్లు ఎక్కువ ఫైబర్ వస్తుంది. అందుకే క్విల్ట్‌లూ దుప్పట్లూ టవల్సూ టీషర్టులూ చీరలూ ప్రాకులూ... ఇలా అన్ని రకాల దుస్తులకీ ప్రాసెస్ చేసిన వెదురు నారని వాడుతున్నారు. ఇవి వేసవిలో చల్లదనాన్నీ చలికాలంలో వెచ్చదనాన్నీ అందిస్తాయనీ వెదురుకి సహజంగా ఉండే యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ గుణాలవల్ల ఒంటికి మేలుచేస్తాయనీ చెబుతున్నారు.
- చెక్క, ప్లాస్టిక్కు వాడకాన్ని తగ్గించే క్రమంలో యాక్సెసరీలు, వంటింటి సామగ్రి, డిన్నర్‌వేర్‌లతోపాటు బయో ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, జ్యువెలరీ, వాహనాలు, పిల్లల ఆటవస్తువులు... ఇలా అన్నింటా వెదురు వాడకం పెరుగుతోంది. సప్తస్వరాల్ని పలికించే వేణువూ ఫిడేలూ ఏక్‌తారా... వంటి సంగీత వాద్య పరికరాలు సైతం వెదురుగానాన్నే ఆలపిస్తున్నాయి.

**ఆరోగ్యానికీ..!**

'కాసిని వెదురు పిలకల్ని తీసుకుని సన్నగా కోసి కొబ్బరి పాలల్లో ఉడికించుకుని తింటే ఆ రుచే వేరు...' అని ఎవరైనా అంటే ఆశ్చర్యపోకండి. ఒకప్పుడు ఆగ్నేయాసియా దేశాల్లోనూ గిరిజన తెగల్లోనూ మాత్రమే వాడుకలో ఉన్న వెదురు పిలకలు ఆరోగ్యానికి మంచివని చాలామంది తింటున్నారిప్పుడు. ఇవి కొద్దిగా తిన్నా కడుపు నిండుతుంది. క్యాలరీలు తక్కువ. దాంతో బరువు తగ్గాలనుకున్న వాళ్లకు మేలన్నమాట. లేత వెదురు కాడల్లో ఖనిజాలూ ఇతరత్రా పోషకాలూ అధికంగా ఉండటంతో రోగనిరోధకశక్తినీ పెంచుతాయి. వెదురు చిగుళ్లతో ఊరగాయ కూడా పెట్టుకుంటారు. ఈ చిగుళ్ల కషాయం చలువ చేస్తుంది. దీన్ని సంప్రదాయ, ఆయుర్వేద వైద్యులు కఫం, మూల వ్యాధి, మధుమేహ నివారణకీ, ఆకలికీ, గర్భకోశ శుద్ధికీ వాడతారు. దీన్ని కాల్చినప్పుడు వచ్చిన బొగ్గుని ఆరోగ్యకరంగా భావించి ఆహారోత్పత్తుల్లోనూ వాడుతున్నారు. అంతెందుకు... 'తింటే బొంగులో చికెనే తినాలి' అనేవాళ్ల సంఖ్యా పెరిగింది!

**వెదురుతో అనేక లాభాలు..**

వెదురు పొదలు వివిధ వన్యజీవులకు ఆవాసాలుగా ఉపయోగపడతాయి. గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు జీవనోపాధి కల్పించడంలో వెదురు ఎనలేని పాత్రను పోషిస్తుంది. ఇటీవల బస్తర్ ప్రాంతంలో- మహిళలు వెదురుతో చేసిన రాఖీలకు ప్రజల నుంచి మంచి స్పందన రావడం సహా సామాజిక మాధ్యమాల్లో దేశమంతటా చర్చనీయాంశంగా మారింది. వెదురుతో తయారు చేసే కళారూపాల్ని బహుమతులుగా తీర్చిదిద్దడం ద్వారా పలువురు ఆదాయ మార్గాల్ని సృష్టించుకొని, ఆర్థిక ఉన్నతి వైపు అడుగేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వెదురు వస్తువుల ఎగుమతులు సుమారు 250 కోట్ల డాలర్లకు చేరుకోవడం దీని ఆర్థిక ప్రాధాన్యానికి అద్దం పడుతోంది. అంతేకాకుండా, వెదురును అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు అడవుల క్షీణతను అడ్డుకోవచ్చు. వెదురుతో కూడిన అటవీ వనాల పెంపకాన్ని ఒక ఉద్యమంలా చేపట్టవలసిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు అందరిపైనా ఉంది. ఇకనైనా ప్రభుత్వాలు ఈ దిశగా యోచించాల్సిన అవసరం ఉంది.

- ఎసికె. శ్రీహరి, m : 9849930145
e : ackvs08@gmail.com



# పురాతన ధాన్యం– చిరుధాన్యాల పుణరాగమనం

## మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా డా. ఖాదర్ వలికి ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ సత్కారం

నవంబర్ 18న హైదరాబాద్, హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ యాజమాన్యం పద్మశ్రీ అవార్డు గ్రహిత డాక్టర్ ఖాదర్ వలికి ఆతిథ్యమిచ్చి సత్కరించారు.

ఈ సందర్భంగా సత్కారగ్రహీత డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ.. వరి మరియు గోధుమ వంటి సాంప్రదాయ ప్రధాన పంటల నుండి ప్రపంచ ఆహార ఉత్పత్తి మరియు మానవ ఆరోగ్యంపై మన దృష్టిని మరల్చవలసిన అవసరాన్ని డాక్టర్ వలి చెప్పారు. అతను కొర్రలు, ఊదలు, సామలు, అరికలు, అండు కొర్రలు, సజ్జలు, రాగులు, వరిగలు మరియు జొన్నలు ప్రపంచ వ్యాప్తంగా కనిపించే చిరుధ్యాన్యాల రకాల యొక్క గొప్పతనాన్ని విశ్లేషించారు.

విద్యార్థుల విషయంలో ఆరోగ్యకరమైన మరియు సుస్థిరమైన భవిష్యత్తును ప్రేరేపించడానికి ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ డైరెక్టర్ మణికొండ ప్రార్థన మార్గదర్శకత్వంలో ముఖ్యమైన చర్యలు తీసుకుంటున్నారు అని తెలిపారు. పాఠశాల ఆవరణలో ప్రత్యేకమైన చిరుధ్యాన్యాల తోట ఏర్పాటు చేయబడుతుంది అని అన్నారు. ఇది విద్యార్థులకు అభ్యాస అవకాశాలను మెరుగు పరుస్తుంది. అదనంగా, పాఠశాల యొక్క "చిరుధ్యాన్యాల సోమవారం" చొరవ విద్యార్థుల ఆహారంలో వారంలో ఒక రోజు చిరుధ్యాన్యాలు భుజించడానికి మరియు వాటిపై ఆసక్తిని కలిగించి, పోషకాలు అధికంగా ఉండే ధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది అన్నారు. డాక్టర్ ఖాదర్ వలి చిరుధ్యానాల వైపు మన ఆహార దృష్టిని మార్చవలసిన తక్షణ అవసరాన్ని సూచించారు.

కార్యక్రమంలో శ్యామ్ సుందర్ రెడ్డి నీటిపారుదల శాఖలో రిటైర్డ్ ఇంజనీర్, మినుము సాగులో తన అనుభవాలను తెలిపారు. లయన్స్ క్లబ్ ధనంజయ్య చిరుధ్యాన్యాలు తినడం వల్ల తనతో పాటు తన కుటుంబ సభ్యులు పొందిన ఆరోగ్య ప్రయోజనాలను విషదీకరించి పిల్లలలో చిరుధ్యాన్యాల పట్ల ఆశక్తిని ప్రేరేపించారు.

పాఠశాల తన విద్యార్థులలో చిరుధ్యాన్యాల సాగు మరియు వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా, స్థిరమైన మరియు ఆరోగ్యకరమైన ఆహార ఎంపికల పట్ల లోతైన అవగాహన కలిగించడం లక్ష్యంగా పెట్టుకుంది. డాక్టర్ ఖాదర్‌వలి యొక్క ప్రయత్నం నిశ్చదేహంగా పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు "చిరుధ్యాన్యా విప్లవాన్ని" స్వీకరించడానికి ప్రేరేపించింది.

**"ఖాదర్ వలి సిరి జీవన విధానం శాస్త్రీయం మరియు కళాత్మకం" పుస్తకావిష్కరణ:**

ఈ సందర్భంగా ఎస్. ధనంజయ్య, డా.సముద్రాల మారయ్య –మణెమ్మ సేవా ట్రస్ట్ తరపున **"ఖాదర్ వలి సిరి జీవన విధానం శాస్త్రీయం మరియు కళాత్మకం"** అనే పేరుతో తెలుగులో ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు వక్తలతో "చిరుధ్యాన్యాల ప్రాముఖ్యతని" పరస్పర సంభాషణాలతో నిమగ్నమైన ఉత్సాహంతో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రార్థన మణికొండ, కరస్పాండెంట్, కె. ప్రభాకర్, డీన్ రామాంజుల, సీబీఎస్ఈ ప్రిన్సిపాల్ రేఖ రావ్, ప్రీ–ప్రైమరీ ప్రిన్సిపాల్ ఫాతిమా ఖాజిమ్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

– కట్టా ప్రభాకర్, m : 8106721111
e : akumarkatta@gmail.com

# సాదిక్ అంటే నిరంతర చలనం!

ఒక సంఘ సేవకుడి గురించి మాట్లాడుకుందాం. ఒక మనసున్న స్నేహితుడి గురించి మాట్లాడుకుందాం. ఒక సాహిత్య ప్రేమికుడి గురించి మాట్లాడుకుందాం. సాహిత్యానికి నాలుగు చక్రాల కాళ్ళిచ్చి తోపుడుబండి పేరిట ఊరూరా చేర్చిన కార్యకర్త గురించి మాట్లాడుకుందాం. చదువుకోవడానికి ఆర్థికసాయం అవసరమైన వాళ్ళకు నేనున్నానని అండగా నిలబడ్డ ఒక చేయూత గురించి మాట్లాడుకుందాం. ఒక జర్నలిస్ట్ గురించి ఒక ఆధునిక పెళ్లిళ్ల పేరయ్య గురించి ఒక ప్రేమికుడి గురించి హిందీ పాటల పిచ్చిలో రెండు చెవులు కోసేసుసుకున్న వ్యక్తి గురించి మాట్లాడుకుందాం. అందరినీ కన్నీళ్లలో ముంచి అర్థాంతరంగా లోకంనుంచి నిష్క్రమించిన ఒక మనీషి గురించి మాట్లాడుకుందాం. ఇంతమంది గురించి వేర్వేరుగా కాదుగానీ ఇవన్నీ ఒక్కడే అయిన సాదిక్ గురించి మాట్లాడుకుందాం. చాలా మందికి తోపుడుబండి సాదిక్‌గా తెలిసిన ఈ మనిషి నడిచొచ్చిన దారినిండా ముళ్ళు గోతులు చీకట్లు తప్ప మరేమీ లేవు. అసలు దారంటూ లేని నేలమీద నడిచి




శిఖరాగ్రానికి చేరినవాళ్ళలో అతి తక్కువ మందిలో ఉండే నమ్రత, స్నేహగుణం సాదిక్ సొంతం. ఉదయంలో జర్నలిస్టుగా ప్రయోగవాదం పంచన నిలిచి కార్మిక నాయకుడై ఎదురుదెబ్బలు తిని దారి మార్చి మ్యారేజ్ బ్యూరోలో తేలిన చమత్కారి 'వశిష్ఠ' సాదిక్. తను పనిచేసిన పత్రిక మూతపడితే తట్టుకోలేక మళ్ళీ తెరిస్తే కోటి రూపాయలిస్తానన్న మనసున్న మనిషి సాదిక్. మతాంతర ప్రేమలో మునిగి అదే అమ్మాయిని జీవిత భాగస్వామిగా తన కలంపేరులోనూ భాగస్వామిగా చేసుకున్న విశ్వమానవుడు ఉషా సాదిక్. 'వశిష్ఠ' కలం పేరుతో 'యూనివర్సల్' మ్యారేజ్ బ్యూరో స్థాపించడం ద్వారా వేలాదిమందికి పెళ్లి సంబంధాలు కుదిర్చారు. సాదిక్ తండ్రిని చిన్నతనంలోనే కోల్పోయారు. ఖమ్మం సిద్ధారెడ్డికళాశాలలో డిగ్రీ వరకు చదివి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాలలో చురుకుగా ఉండేవారు.

'కొందరు/లోకం ఖాళీ చేస్తే /వెలితి/వెక్కిళ్ళు పడుతుంది/చరిత్ర గర్వంగా/ శాశ్వతపుట లిఖిస్తుంది' అని అతని ఆచరణ, అతని సంకల్పం, అతని సేవాతత్పరతలకు ఒక కవి ఇచ్చిన కితాబు. "సాదిక్ గారు లేకపోవడం వో పెను విషాదం. వారిదగ్గర నుండి వో పుస్తకం, ఓ బూట్ల జత, వో స్కూలు బాగు, వో చలి దుప్పటి, ఓ అన్నం ముద్ద.. ఇంకేదో ఇంకేదో అందుకున్న ఏ పిల్లవాడైనా, ఏ ఆడబిడ్డ అయినా ఎలా మర్చిపోతారు ఈ ప్రేమమూర్తిని.." అని ఒక సాహిత్యకారుడు భావించడం అంటే, ఇవాళ్టి కాలంలో ఎందరో చేద్దామనుకుంటూ తాము చేయలేకపోతున్న పనుల్ని భుజానికెత్తుకొని సాదిక్ చేశాడని నిండుమనసుతో కూడిన మెచ్చుకోలు.

పేద పిల్లలకు సాయం చేసేందుకు తోపుడుబండి ఫౌండేషన్‌ను స్థాపించారు. ఫౌండేషన్ ద్వారా విరాళాలు, వేలాది మంది పేద పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్, పాఠశాలలకు ఫర్నిచర్ సమకూర్చారు. అనాథ పిల్లలకు చేయూతనిచ్చారు.

ముఖ్యంగా యువతరాన్ని దగ్గరకు తీసుకోవడం, వాళ్ళల్లో ఒకడిగా కలిసిపోవడం, ఆ తర్వాత చిన్ని పిల్లల యోగక్షేమాలవైపుకు దృష్టి మరల్చడం, అనేక కార్యక్రమాలు చేపట్టడం– సాదిక్ దీర్ఘదర్శిలా కనిపిస్తాడు. అసలు తోపుడుబండి ప్రాథమికంగా మొదలయ్యింది కవిత్వం పాఠకులకు చేరువచేద్దామని, వాళ్ళద్వారా కొనుగోళ్లు చేయిద్దామని, విస్తృతంగా ప్రచారం చేద్దామని. ఆ తరవాత మొత్తం సాహిత్యం వైపుకు, ఆ తర్వాత పాఠశాలలవైపుకు, పిల్లల అవసరాల వైపుకుమళ్ళి విస్తృతమై అదొక ఫౌండేషన్ లా రూపుదిద్దుకుంది. బుక్ ఫెయిర్‌లలోకి ప్రవేశించి అక్కడికి వచ్చిన సందర్శకుల చేతిలో పుస్తకాలు ఉంచి సెల్ఫీలు దించి, సోషల్ మీడియాను పుస్తకప్రపంచంగా మార్చిన సాదిక్ సమాజాన్ని పుస్తకాలవైపుకు ఎన్ని రకాలుగా ఆకర్షించాలో ఆలోచించి ఆచరించి చూపాడు. తోపుడుబండి మీద వంద రోజుల్లో వెయ్యి కిలో మీటర్లు తిరిగి పుస్తకాలను పంచిపెట్టారు. కొంతమంది స్నేహితులు పుస్తకాలు కొనేందుకు సహకరించారు.

పుస్తకాలపండుగలకు జవజీవాలను ఇవ్వడానికి ముచ్చటైన ప్రయత్నాలు చేసి సఫలం చేసాడు. పుస్తకాలబండి, తోపుడుబండి సాదిక్‌గా క్రమేణా అతని పేరు స్థిరపడేంతగా అతని కార్యాచరణ కొనసాగింది. అతని మరణాన్ని ఎవరూ జీర్ణించుకోలేంతగా అతను చివరినిమిషంవరకు కృషిచేస్తూనే ఉన్నాడు. దాతలకు ఏవో విన్నపాలు చేస్తూనే ఉన్నాడు. పిల్లలతో కలిసి వాళ్లకు ఏవేవో ఇస్తూనో, భోజనాలు పెడుతూనో కనపడుతూనో ఉన్నాడు. అందుకే ఎవరూ అతను ఇప్పుడు లేడు అంటే అంగీకరించడానికి ఇష్టపడటం లేదు. కల్లూరు మండలంలోని దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కావలసిన వస్తువులను దాతలనుంచి సేకరించి అందించేవారు. ఇందుకోసం కొన్నాళ్లుగా కల్లూరులోనే స్థిరపడ్డారు. కొవిడ్ సమయంలో పేద విద్యార్థులకు సెల్‌ఫోన్లను ఉచితంగా అందించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడ్డారు. చనిపోవడానికి ముందురోజు కూడా 200 మంది బాలబాలికలకు షూస్ ఇచ్చారు. తన మానవీయ సేవలతో అందరి మన్ననలు పొందారు సాదిక్. ఇటువంటివాళ్లను మరణంతో కలిపి ఊహించుకోలేం అన్నది ప్రతి ఒక్కరి గుండె లోతుల్లోంచి వచ్చే మాట.. అదీ అతని జనంతో ఉన్న మమేకత. ఆచరణలోని స్వచ్ఛత, పారదర్శకత.

సాదిక్ నవంబర్ ఏడున ఈ లోకాన్ని వీడిపోయారని, ఆయన లేరు అనేది అబద్ధం. ఆయన ఉనికి అందరి గుండెల్లో శాశ్వతం అన్నదే నిజం.

*(ఆంధ్రజ్యోతి ఎడిట్ పేజీ, 9.11.2024)*

–కవి యాకూబ్



# పిల్లల గ్రంథాలయాలు - ప్రాముఖ్యత

## 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలపై కార్యక్రమం

బాల చెలిమి తెలంగాణ రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం సహకారంతో, హిమాయత్‌నగర్, హైదరాబాదులోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ కలసి నవంబర్ 19న, 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా "పిల్లల గ్రంథాలయాలు మరియు వాటి ప్రాముఖ్యత" పై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం, అఫ్జల్‌గంజ్, హైదరాబాదులో జరిగింది.



ఈ కార్యక్రమానికి చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఛైర్మన్ మరియు బాలచెలిమి ప్రధాన సంపాదకులు, వేదకుమార్ మణికొండ అధ్యక్షత వహించారు. పిల్లల గ్రంథాలయాల ప్రాముఖ్యతపై వేదకుమార్ మాట్లాడుతూ.. నేటి సాంకేతిక పరిజ్ఞానం మరియు అధ్యయనం-ఇంటెన్సివ్ వాతావరణంలో పిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లను పేర్కొన్నారు. ఆట మరియు చదవడానికి కూడా సమయం కేటాయించలేక వారు కోల్పోతున్న బాల్యం గురించి ప్రస్తావించారు. చైల్డ్ రీడర్లు తమ ఖాళీ సమయంలో పుస్తకాలను చదివి జ్ఞానం పెంపొందించుకునేందుకు అంకితమైన పిల్లల లైబ్రరీలను ప్రారంభించడానికి పౌర సమాజం కూడా ముందుకు రావాలని ఆయన ఆహ్వానించారు.

వేదకుమార్ గ్రంథాలయాల బహుముఖ పాత్రను కూడా నొక్కి చెప్పారు. ఆయన వాటిని కేవలం పఠన స్థలాలుగా కాకుండా సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా అభివర్ణించాడు. ఇక్కడ పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను పెంపొందించడం మరియు అభివృద్ధి చేయడం, వారి ఎదుగుదలకు దోహదపడుతుంది అని తెలిపారు.

కార్యక్రమంలో డాక్టర్ రియాజ్, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మాట్లాడుతూ.. పిల్లల కోసం ప్రత్యేకంగా చేపట్టిన ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్రంలో మునుపెన్నడూ లేవని ఆయన ఉద్ఘాటించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బాలచెలిమి గ్రంథాలయం, రాష్ట్ర సెంట్రల్ పబ్లిక్ లైబ్రరీతో కలిసి బాలల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో అతికా అహ్మద్- డైరెక్టర్, చిల్డ్రన్స్ ఫైన్ ఆర్ట్స్ గ్యాలరీ, డా.రోహిణి చింత- తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం, హైదరాబాదు, కన్నెగంటి అనసూయ- బాలల కథా రచయిత్రి, కప్పరి కిషన్- ఆర్ట్ డైరెక్టర్, జవహర్ బాల్ భవన్, డా.ఉప్పల పద్మ- చిల్డ్రన్స్ స్టోరీ టెల్లర్, హైదరాబాదు, రాణి-చీఫ్ లైబ్రేరియన్, సి.అపర్ణ-గెజిటెడ్ లైబ్రేరియన్, అపర్ణ- లైబ్రేరియన్, కేసరి హనుమంత్- సహాయక లైబ్రేరియన్, స్టేట్ సెంట్రల్ లైబ్రరీ పిల్లలను ఉద్దేశించి ప్రసంగించారు. యువకుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో




బాలల గ్రంథాలయాల కీలక పాత్రను పోషిస్తాయని ప్రముఖులందరూ నొక్కి చెప్పారు. గ్రంథాలయాలు కేవలం చదవడానికి మాత్రమే స్థలాలు కాదని, సృజనాత్మకతను, కల్పనను పెంపొందించే సమగ్ర అభివృద్ధికి కేంద్రాలన్నారు. విభిన్న పుస్తకాలు మరియు అభ్యాస సామగ్రికి ప్రాధాన్యతను అందించడం ద్వారా, పిల్లల లైబ్రరీలు చిన్న వయస్సు నుండే పఠనం, స్వతంత్ర అభ్యాసం మరియు విమర్శనాత్మక ఆలోచనలపై ప్రేమను ప్రోత్సహిస్తాయి అని తెలిపారు.

పిల్లల కోసం ప్రత్యేకంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం కోసం నిర్వాహకులు చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమాలు చైల్డ్ లైబ్రరీల భావనను ప్రచారం చేయడంలో పఠన ఆనందాన్ని జరుపుకోవడమే కాకుండా జీవితకాల అభ్యాసానికి మరియు వ్యక్తిగత ఎదుగుదలకు పునాది వేస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ డీన్ జి.రామాంజుల, బాలచెలిమి కో-ఆర్డినేటర్ ఖైజర్ బాషా, మరియు వివిధ పాఠశాలల పిల్లలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

– ఖైజర్ భాష,
m : 9030 6262 88
e : desk.deccan@gmail.com







Oxford
Grammar High School
KNOWLEDGE IS POWER
OGS JUNIORS
grow naturally
43rd
YEARS OF MERITORIOUS PERFORMANCE
We make school time the best time for your kids
At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.
• Loving atmosphere & play ground
• CCTV surveillance
• Certified teachers & caring staff
• Kids zone & play area
• Interactive & Value based Learning
CARING TEACHERS & STAFF
Your child will get the best care and attention
ECO-FRIENDLY PRACTICES
We let the children play with nature friendly material
HUGE PLAYGROUND
Your child will get lots of fresh air and playtime
INTERACTIVE LEARNING
Our trusted method helps your child communicate and learn with ease.
Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512

DECCAN LAND, Telugu Monthly Magazine Date of Publication 26th - November 2024
ISSN 2581-3188
Postal Dates: 28th & 29th Every Month

PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

VOL 13వ వసంతంలో
148 ISSUES నూట నలభై ఎనిమిదవ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



దక్కన్

## పన్నెండు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2024 డిసెంబర్ సంచికతో 148 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).




**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar